SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL
ILLUSTRATED MONTHLY
Volume: 53, Issue: 8
January-2023, Price Rs. 20/-

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక
జనవరి 2023
వెల రూ.20/-
పుటలు-56



రథసప్తమి
(28-01-2023)

విశ్వేశం విశ్వకర్తారం మహాతేజః ప్రదీపనమ్।
మహాపాపహరం దేవం తం సూర్యం ప్రణమామ్యహమ్॥

# తిరుమల తిరుపతి దేవస్థానములు

20-11-2022 నుండి 29-11-2022 వరకు **శ్రీ తిరుచానూరు అమ్మవారి కార్తిక బ్రహ్మోత్సవాలు** జరిగాయి.
ఈ కార్యక్రమంలో ఆం.ప్ర. డిప్యూటి సి.ఎం. శ్రీ కె.నారాయణస్వామి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు.
తొమ్మిదిరోజుల పాటు జరిగిన ఈ ఉత్సవాలలో తి.తి.దే. అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి సతీసమేతంగా పాల్గొన్నారు.
వీరితో పాటు తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్., గారు, తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారులు
శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., శ్రీమతి సదాభార్గవి, ఐ.ఏ.ఎస్., ఇతర తి.తి.దే. ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

























# గీతాశ్లోకార్థసారం

**శ్లో : ఏవముక్త్వార్జునస్సంఖ్యే రథోపస్థ ఉపావిశత్**
**విసృజ్య సశరం చాపం శోకసంవిగ్న మానసః ॥**

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం- 47వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** సంఖ్యే= యుద్ధభూమిలో, అర్జునః= అర్జునుడు, ఏవమ్= ఈ ప్రకారంగ, ఉక్త్వా= చెప్పి, శోకసంవిగ్నమానసః= దుఃఖంచే మిక్కిలి చలించిన మనస్సుగలవాడై; సశరమ్= బాణంతో గూడిన; చాపం= ధనుస్సును, విసృజ్య= విడిచిపెట్టి, రథోపస్థే= రథంమీద, ఉపావిశత్= చతికిలబడ్డాడు.

**భావం:** ఓ! ధృతరాష్ట్రమహారాజా! యుద్ధభూమిలో అర్జునుడు ఈ ప్రకారంగా చెప్పి శోకంతో కలతపడ్డ చిత్తంగలవాడై, బాణంతో గూడిన వింటిని పారవేసి రథంపై చతికిలబడ్డాడని సంజయుడు చెప్పాడు.

---

## కాంతులు చల్లుతూ మేలుకొనుస్వామీ!

భోగిశయనమును బుసకొట్టెడిని
యోగనిద్ర పాయును మేల్కొనవే

కన్నులు దెరవక కమలబాంధవుఁడు
వెన్నెలరేణువు వెలయ దిదే
అన్నువ మలసీ నరుణోదయ మిదే
మిన్నక నీ విటు మేలుకొనవే

తెల్లనికన్నులు దెరవక విరియఁగ
నొల్లక జలజము లున్న వివే
కల్లనిదుర నినుఁ గవియఁగ నియ్యక
మెల్లనాయ నిటు మేలుకొనవే

తెరవగురెప్పలఁ దెల్లవారవలె
తెరవక చీఁకటి దీర దిదే
తెరఁగువేంకటాధిప నీ వెఱుఁగుదు
మెఱుఁగులు చల్లుచు మేలుకొనవే

(సంపుటం-1, సంకీర్తన-139)




*స్వామీ! మీరు శేషపాన్పు మీద పవళించారు. యోగనిద్రలో ఉన్నారు. శేషుడు తెల్లవారడం గమనించి బుసలుకొడతాడు. యోగనిద్ర వదలిపోతుంది. మేలుకోస్వామీ! కమలబాంధవుడైన సూర్యుడు కన్నులు తెరవక తెల్లని కాంతికిరణం ప్రసరింపదు. మనోహరమైన అరుణోదయకాలపు ఎఱ్ఱని కాంతులు వ్యాపిస్తున్నాయి. ఆలస్యంచేయక మేలుకోస్వామీ!*

*తెల్లని స్వచ్ఛమైన కన్నులు నీవు తెరవకపోవడం వల్ల తామరపువ్వులు విచ్చుకోవడానికి సిద్ధపడకుండా ఉన్నాయి. నువ్వు నిజంగా నిద్రపోవటం లేదు. కపటనిద్ర నీ దగ్గఱకు చేరనీయకుండ ఇక మేలుకో దేవా!*

*లోకానికంతటికీ దారి చూపే నీ కనురెప్పలలో తెల్లవారాలి. నువ్వు కళ్లుమూసుకుని ఉన్నంతసేపూ లోకాలకు చీకటే. నువ్వు కళ్లు తెరిస్తేనే చీకటిపోయి వెలుగువచ్చేది. ఎలా లోకాలకు వెలుగు ప్రసాదించాలో నీవు ఎఱుగుదువు కదా స్వామీ! కాంతులు చల్లుతూ మేలుకొనవే! అని అన్నమయ్య శ్రీవారికి పై సంకీర్తనలో మేలుకొలుపు పాడాడు.*

ఆయుర్వేదం

# ఆరోగ్యామృతం అరటి

- డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ,
90007 61390

భగవంతునికి నివేదించే ఫలాలలో అత్యంత ప్రాధా న్యత కలిగిన ఫలం అరటి. దీన్ని సంస్కృతంలో కదళీఫల మంటారు. మంగళకరద్రవ్యమే కాక ఆరోగ్యభాగ్యాన్ని ప్రసా దించే అమృతతుల్య ఔషధం అరటి.

అరటిపండులోని ట్రిప్టోఫాన్ అనే ప్రొటీన్ మన శరీరంలో సెరటోనిన్‌ను ఉత్పత్తి చేయటం వల్ల మానసిక ఉల్లాసం, ఆనందం కలుగుతాయి.

**మొటిమలు, నల్లమచ్చలు తగ్గి ముఖం అందంగా ఉండా లంటే:** బాగా మాగిన ఒక అరటిపండు గుజ్జులో ఒక టీ స్పూన్ రోజ్ వాటర్ లేదా పన్నీరు కలిపి ముఖంపై లేపనం చేసి గంటసేపాగి గోరువెచ్చని నీటితో కడిగితే ముఖం కోమలంగా తయారౌతుంది.

**మలబద్ధకం తగ్గేందుకు:** రోజు రాత్రి పడుకునేటప్పుడు ఒక చిన్న అరటిపండును 5-10 మి.లీ. ఆముదంలో కొద్ది కొద్దిగా ముంచి తింటే సత్వరప్రయోజనం కనిపిస్తుంది. మూలశంక లేదా మొలల వ్యాధి కూడా తగ్గుతుంది. అధిక వేడివల్ల, వాతదోషం వల్ల వచ్చే నొప్పులు తగ్గుతాయి.

**చర్మసమస్యలకు:** రోజు ఒకసారి అరటి పండు గుజ్జులో తగినంత పన్నీరు కలిపి లేపనం చేస్తుంటే దురదలు, దద్దుర్లు, చర్మం మంటలు, అరికాళ్లు, అరిచేతులమంటలు తగ్గుతాయి.

**కాలిపగుళ్ళకు:** రోజు ఒకసారి అరటిపండుగుజ్జును పట్టించి 15 నిమిషాలాగి కడిగేస్తుంటే ఈ సమస్య త్వరగా తగ్గుతుంది.

**కిడ్నీ స్టోన్స్ కరిగేందుకు:** రోజూ ఉదయం పరగడుపున అరటికాండం (దూట) రసం 50 మి.లీ., ముల్లంగి రసం 50 మి.లీ., మజ్జిగ 50 మి.లీ. కలిపి త్రాగుచుండాలి. ఇలా వాడటం వల్ల కిడ్నీలో రాళ్లు కరగడమే కాక ఇన్ఫెక్షన్ తగ్గి మూత్రంలో మంట కూడా తగ్గుతుంది.

**తెల్లబట్టకు:** రోజూ రెండుపూటలా పూటకు ఒక అరటి పండు గుజ్జులో ఒక గ్రాము ఉసిరిక పొడి కలిపి తీసుకుంటే ప్రయో జనం కలుగుతుంది. తెల్లబట్టవల్ల స్త్రీలలో కలిగే నీరసం, బలహీనత లాంటివి తగ్గుతాయి.

**దగ్గుతీవ్రత తగ్గేందుకు:** రోజు ఉదయం, సాయంత్రం ఒక అరటిపండు చిన్నముక్కలో మధ్య గుంటలా చేసి అందులో 2, 3 చిటికెల మిరియాల పొడి వేసి ఆపండుని మింగుతుంటే వేధించే దగ్గు చాలా త్వరగా తగ్గిపోతుంది.

**గర్భసంచి జారితే:** అరటికాయలను చిన్నముక్కలుగా చేసి బాగా ఎండించి పొడిచేసి జల్లించి సమానంగా పటిక బెల్లం పొడి కలిపి ఉంచుకుని రెండుపూటలా పూటకు అర టీ స్పూను పొడిని 50 మి.లీ. కాచిన పాలలో కలుపుకుని సేవిస్తే గర్భాశయకండరాలు గట్టిపడతాయి.

**అతిమూత్ర వ్యాధికి:** 50 గ్రా. అరటికాయల పొడిలో 10 గ్రాముల మిరియాలపొడిని కలిపి రెండుపూటలా పూటకు ఒకట్రెండు గ్రాముల పొడిని తగినంత తేనె కలిపి సేవిస్తే అతిమూత్రవ్యాధిని నివారించవచ్చు.

**నోరు, ముక్కు, మల, మూత్రం గుండా అయ్యే రక్తస్రావానికి:** అరటివేళ్ళు ఎండించి చూర్ణించి జల్లించి సమానంగా పటిక బెల్లంపొడి కలిపి ఉంచుకుని ఉదయం, సాయంత్రం పూటకు అర టీ స్పూను పొడిని తగినంత నీటిలో కలిపి సేవిస్తే ఫలితం ఉంటుంది.





అరటిఆకులో భోజనం చేయడం ఆరోగ్యకరం



తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 53 జనవరి, 2023 సంచిక : 08

## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| ఆరోగ్యామృతం అరటి | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 04 |
| శ్రీపద్మావతి హృదయాలయంలో.. చిన్నారులకు పునర్జన్మ | డా॥ కంపల్లె రవిచంద్రన్ | 07 |
| జీవన 'క్రాంతి'... సంక్రాంతి | డా॥ సుబ్బలక్ష్మి మర్ల | 12 |
| తిరుమల సమయాచారములు | కీ.శే.డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే.శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 15 |
| చదువులతల్లికి వందనం! | డా॥ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర రావు | 16 |
| కల్యాణ వైభోగమే! | ఆచార్య పి.నరసింహారెడ్డి | 18 |
| ఇలా చేద్దాం! నిరుత్సాహాన్ని తొలగించుకుందాం!! | బ్రహ్మశ్రీ, డా॥మైలవరపు శ్రీనివాసరావు | 20 |
| తిరుప్పళ్ళం బూదంగుడి | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 22 |
| లోకదీపం! | డా॥ కప్పగంతు రామకృష్ణ | 24 |
| తిరుమలలో అధ్యయనోత్సవం | డా॥ ఈ.ఏ.శింగరాచార్యులు | 31 |
| వ్రతభారతి | కీ.శే. విద్వాన్, డా॥ పమిడికాల్వ చెంచుసుబ్బయ్య | 33 |
| తిరుమలకు తొలిగడప | డా॥ చింతకుంట శివారెడ్డి | 35 |
| ఏ దేశమేగినా... ఎందు కాలిడినా... | శ్రీ ప్రతాప వెంకట సుబ్బారాయుడు | 37 |
| వెంకటాచల నిలయం-వైకుంఠపురవాసం | ఆచార్య కె.సర్వోత్తమరావు | 38 |
| అంతా నా కళ్లముందు జరిగింది! | శ్రీ ఎస్.వి.నరసింహం | 41 |
| ప్రాణశక్తి.... సూర్యరశ్మి | శ్రీమతి యడవల్లి మృదుల లక్ష్మి | 43 |
| నీవేగతిరామ, నీకు మ్రొక్కితి రామా! | శ్రీ ఎస్.కె.సైదా | 45 |
| అన్నప్రదాత (చిత్రకథ) | కథ: డా॥ కంపల్లె రవిచంద్రన్<br>చిత్రాలు: శ్రీ తుంబలి శివాజీ | 48 |
| రచన శాశ్వతం | శ్రీ ఆర్.సి.కృష్ణ స్వామి రాజు | 50 |
| బాలవినోదం | | 51 |
| క్విజ్ (06) | | 52 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 53 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 54 |


ముఖచిత్రం : సూర్యప్రభవాహనంపై శ్రీవారు (తిరుమల)
వెనుకచిత్రం : చదువుల తల్లి సరస్వతి (చిత్రకారుడు - శ్రీ పి.శివప్రసాద్)

వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి ॥


**గౌరవ సంపాదకులు**
శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి(ఎఫ్.ఏ.సి.), తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
డా॥ కె.రాధారమణ
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకులు**
డా॥ కంపల్లె రవిచంద్రన్,
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,



సప్తగిరి మాస పత్రిక

ఇతర వివరాలకు
ఫోన్ నెంబర్లు
0877-2264543
0877-2264359
0877-2264360



విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.



24 గంటలూ పనిచేసే
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777 / 2233333

వెబ్‌సైట్- www.tirumala.org; 'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri.helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

సంపాదకీయం


# హాయిగా... పండుగలు చేసుకుందాం!

పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు. కుటుంబాల మధ్య బాంధవ్యాలకు, అనుబంధాలకు, అనురాగాలకు పండుగరోజులు గొప్ప వేదికలు. పండుగలు కుటుంబాలనే కాదు, ప్రాంతాలను సైతం ఏకం చేయగల శక్తిని నింపుకుని ఉంటాయి. పండుగలు వస్తాయంటే కొత్త ఆశలు చిగురిస్తాయి. కొత్తకళలు సంతరించు కుంటాయి. చెట్టూపుట్టా, పశువూపక్షీ ఇలా ప్రకృతిలో అణువణువుతో పాటు మానవ జీవితాలు కూడా పులకరిస్తాయి. మొత్తంగా చెప్పాలంటే అంతా శోభాయమానంగా కన్పిస్తుంది.

దురదృష్టవశాత్తూ ఈనాడు 'పండుగ చేస్కో...' అనేది ఊతపదమైపోయింది. నేటి యువతరం అతిసాధారణంగా ఈ పదాన్ని వాడేస్తోంది. పండుగంటే తాత్కాలిక ఆనందమని వాళ్ల అభిప్రాయం. పండుగంటే విరివిగా వస్తువుల్ని కొనుగోలు చేయడమనుకుంటారు. ఇది నిజంగా పొరబాటు. పండుగరోజు నిర్ణయంలో ఓ ఆంతర్యం దాగి ఉంటుంది. సంస్కృతి సంప్రదాయాలకు చెందిన కథనం కన్పిస్తుంది. మానవజీవితాలకు, ప్రకృతికి అనుసంధానమైన విషయం దాగి ఉంటుంది. ఎన్ని తాత్కాలిక ఆనందాలు జీవితంలో వెల్లి విరిసినా అవన్నీ పండుగరోజుల ముందు తీసికట్టే! జీవితచక్రంలో కష్టసుఖాలు, ఆనంద, విషాదాలు సర్వసాధారణం. జీవితమంటే జీవపదార్థానికి– వ్యర్థపదార్థానికి మధ్యగల చలనం (సమయం). జీవితాన్ని జయించడానికి తాత్కాలికపండుగలతో పాటు పరమార్థాన్ని తెలిపే నిజమైన పండుగలు కూడా ఎంతో అవసరం.

జీవితం నానాటికీ ఒత్తిళ్లమయమైపోతున్న తరుణంలో పండుగలు ఊరటనివ్వడమే కాకుండా కొత్త ఉత్సాహాన్నిస్తాయి. రెక్కలొచ్చిన పక్షుల్లా కుటుంబసభ్యులు ఎక్కడ విహరిస్తున్నా పండుగకు సొంతఊళ్లకు చేరడం జీవితానికి పునఃఉత్సాహం, పునరుత్తేజం! వివిధవేడుకలతో ఎన్నిసార్లు కలుసుకున్నా పండుగ కలయిక కొత్త ఉత్సాహాన్ని నింపుతుంది. ఈ ఉత్సాహాన్ని ప్రతి ఏడాది పొందితే జీవనప్రమాణస్థాయి పెరుగుతుందంటే అతిశయోక్తి కాదు. ఒక తరం నుండి మరోతరానికి సంస్కృతి– సంప్రదాయాలు ధార్మికవారసత్వంగా చేరడానికి వారధి పండుగ. ఇలా చేరవేయడంలో ఏ తరం నిర్లక్ష్యం చేసినా ఆ తర్వాత అంతర్జాలంలో పండుగల గురించి వెతుక్కోక తప్పదు. ఇతర దేశీయులకు మన సనాతన సంస్కృతీసంప్రదాయాలను తెలియజెప్పేవిగా పండుగలు ఉపయోగపడాలే తప్ప మనమే అన్వేషించి తెలుసుకోవడానికి ఉపయోగపడితే అంతకన్నా పెద్ద చారిత్రకతప్పిదం వేరొకటి ఉండదు. అందుకే ఈ ఏడాది ఒకే నెలలో వస్తున్న సంక్రాంతి, వైకుంఠఏకాదశి, రథసప్తమి నుండైనా క్రమం తప్పకుండా హాయిగా పండుగలు చేసుకుందాం! మన సంస్కృతీ సంప్ర దాయాలకు పండుగల ద్వారానే సరైన మూల్యం సమర్పిద్దాం!

# శ్రీపద్మావతి హృదయాలయంలో..



# చిన్నారులకు పునర్జన్మ

- డా|| కంపల్లె రవిచంద్రన్,
98487 20478

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిఆలయంలో మొదట జరిగేసేవ సుప్రభాతసేవ. ఏకాంతసేవలో పరుండిన స్వామిని మేల్కొల్పడం ఈ సేవలో ప్రధానాంశం. ఈ సందర్భంలో ప్రతివాది భయంకరఅణ్ణన్ రచించిన సుప్రభాతశ్లోకాలను భక్తియుక్తంగా, శ్రావ్యంగా భక్తులకు విన్పిస్తారు. ఈ సుప్రభాతంలో మూడవభాగం పూర్తిగా అమ్మవారికి సంబంధించింది. 'ఈశానం జగతోஉస్య...' శ్లోకంలో చెప్పబడ్డ ఏకైక గుణం 'వాత్సల్యాది గుణోజ్జ్వలామ్'. మిగిలినవన్నీ అమ్మవారి ఉనికిని చాటేవి. తొలి భాగంలోని సుప్రభాతంలో 'మాతస్సమస్తజగతాం' అనేది కూడా అమ్మవారికి సంబంధించిందే. ఆ శ్లోకంలో 'స్వామిన్ సుశీల సులభాశ్రిత' అనేవి అమ్మవారి నైజాన్ని చాటుతాయి. లోకంలో వాత్సల్యమూర్తులైన వారిదగ్గరే పిల్లలు ఆత్మప్రత్యయంతో చేరతారు. ఈ భావమే 'వాత్సల్యాది గుణోజ్జ్వలామ్'లో విశదం.

ఆవు దగ్గర దూడ చేరుతుంది. తల్లి ఏనుగు దగ్గర గున్న ఏనుగు తచ్చాడుతుంది. శునక మార్జాలాది జంతువులు కూడా తమ కూనలరక్షణలో జాగ్రత్తపడతాయి. పక్షులు గూటిలో తమ సంతానాన్ని ఉంచినా దూరప్రాంతాలకు వెళ్లి చిన్నకూనల ఆకలిని తీరుస్తాయి. ఇవన్నీ సహజగుణాలు. అలాగే తల్లికి సంతానంపట్ల గల బాధ్యత, మరొకటేమిటంటే వాత్సల్యం.

బిడ్డ మొదట గుర్తించేది తల్లినే. పసికందు ఏడుస్తుంటే స్తన్యమిచ్చేది తల్లే. బిడ్డ ఏడిస్తే కన్నీళ్లు పెట్టుకునేది తల్లే! ఆకలైన వేళ అందరికీ గుర్తు వచ్చేది తల్లే! తల్లడిల్లేది కనుక తల్లి. కాసంత బిడ్డ ఎదిగాక తండ్రి కసరితే బిడ్డను వెన కేసుకొచ్చేది తల్లే. కొడుకు కారణాంతరాల వల్ల దుర్మార్గుడై, రోగపీడితుడైన వేళలో ఆశ్రితులు, రక్తసంబం ధీకులు వదిలేసినా కొడుకు దగ్గర ఉంటూ సేవలు చేసేది తల్లి. అందుకే 'మాతృదేవోభవ' అన్నారు. వాత్సల్యం చిత్రమైన గుణం. పసివానిది తప్పయినా వెనకేసుకు వచ్చే తల్లిలో వాత్సల్యమే కన్పిస్తుంది. ఒకవేళ తండ్రి గద్దించినా, ఇతరులు బాదడానికి వచ్చినా బిడ్డకు, ఇతరులకు మధ్య నిలిచేది తల్లి.

'తల్లిదీవెన ఆకాశమంత'- బిడ్డకు నూనె అంటి చివరగా రాయిగా, గుండురాయిగా ఉండమని పాతకాలంలో బిడ్డను ఆశీర్వదించేవారు. బారసాలవేళ తొట్టెలో గుండ్రాయి పెట్టేవారు. శారీరకంగా, మానసికంగా గుండ్రాయిలా ఉండమని భావన. బాలదర్శనం బ్రహ్మదర్శనమంటారు. గృహస్థులు బిడ్డను కన్నాక ఆలయంలో తులాభారం వేసి ఆ పై మా బిడ్డ అనేవారు. రోగగ్రస్థులైన వేళ పిల్లల బాధ అమ్మలకే తెలుసు.

# ముందుకు వచ్చిన దాతలు...

ఇక్కడి వైద్యసేవలను గుర్తించి ఎంతోమంది దాతలు, ఉదారహృదయులు భూరివిరాళాలు అందిస్తున్నారు.

'శ్రీవేంకటేశ్వర ఆపన్నహృదయ' పథకం ద్వారా వచ్చే మొత్తాన్ని పిల్లల వైద్యంకోసం ఖర్చు చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం నిర్ణయించింది. వివిధప్రాంతాలకు చెందిన నూటయాభైమందికి పైగా దాతలు ముందుకు వచ్చారు. రూ.లక్షనుంచి పదిలక్షలవరకు 'ఆపన్నహృదయ' పథకంలో జమ చేశారు.









అమ్మ వాత్సల్యస్వరూపిణి. కనుకనే అన్నమయ్య మోకాలిమిట్ట దగ్గర అలసటతో, ఆకలితో, శోషతో పడిపోయిన వేళ అలమేలుమంగమ్మ తానే ప్రసాదంతో వచ్చి అన్నమయ్యను ఆదుకుంది. 'వాత్యల్యాది' అనడంలో దయ, శుశ్రూష, రక్షణ అన్నీ ఉన్నాయి. 'దయకలిగిందే హృదయం'. మహిళల హృదయం పిల్లలపట్ల అమృతభాండం. పిల్లలపట్ల అమ్మవీక్షణం అమృతవీక్షణం. తల్లి జన్మ ఇస్తే శ్రీవారి దేవేరి పద్మావతమ్మబిడ్డలను స్వస్థులుగా చేసి మరల పునర్జన్మ ప్రసాదిస్తుంది. అందుకే తిరుమల తిరుపతి దేవస్థానం ప్రారంభించిన చిన్నపిల్లల ఆసుపత్రికి అమ్మపేరే పెట్టారు.




## శ్రీవేంకటేశ్వర ఆపన్నహృదయపథకం.. దాతలకు ప్రయోజనాలు

శ్రీవేంకటేశ్వరప్రాణదానట్రస్టు ఆధ్వర్యంలో శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయ ఆసుపత్రిలో నవజాత శిశువులు, చిన్నపిల్లల శస్త్రచికిత్సలకు అవసరమయ్యే ఖర్చును విరాళంగా అందించే దాతలకు ప్రయోజనాలు కల్పించాలని గత ఏడాది మార్చినెలలో తి.తి.దే. నిర్ణయించింది. ఇందుకోసం మార్గదర్శకాలు రూపొందించింది. శ్రీపద్మావతిచిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి రూ. కోటి విరాళం అందించిన దాతలకు ఈ మేరకు ఎస్.వి.ప్రాణదానట్రస్టు ద్వారా ఇప్పటికే అమలు చేస్తున్న ప్రయోజనాలు వర్తిస్తాయి. అదేవిధంగా ఆసుపత్రి భవన నిర్మాణానికి లేదా వైద్యయంత్రాల కొనుగోలుకు గానీ రూ.కోటి విరాళం అందించే వారిని ప్రత్యేక దాతలుగా గుర్తించి ప్రత్యేక ప్రయోజనాలు కల్పించనుంది. ఎస్.వి. ప్రాణదాన ట్రస్టుకు సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) రిజిస్ట్రేషన్ కూడా పూర్తయింది. ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాలు సమకూర్చేందుకు దాతలు సీఎస్ఆర్

అందరు పిల్లలవంటి వాళ్లు కాదు వాళ్లు, సగం సగం కథల్ని మాత్రమే వినగలరు. అరకొరగా మాత్రమే కబుర్లాడ గలరు. కథలు కంచికి చేరకముందే, మొత్తంకథలు వినేయాలని వాళ్లకి మాత్రం లేదూ! కచ్చితంగా ఉంది! అర్ధరాత్రి నెగడు దగ్గర చలి కాచుకుంటున్న తాతయ్య దగ్గర గుంపుకట్టిన పిల్లల్లో సగం కథలే ప్రాప్త మున్న చిన్నారులూ ఉన్నారు. కానీ, ముందు చితాగ్ని గుండంలా నాల్కలు చాస్తున్న నిప్పు, వెనక వీపు మీద పదును గోళ్లతో చీరుతున్న చలి. తాత గొంతులో జీర, కథ ముందుకు సాగదు.

ఇంతలో ఓ పిల్లాడు, చిల్లులుబడ్డ ఒక గుండెని అరచేతిలోకి తీసుకొని– "బ్లాక్‌హోల్" అంటే లోపలి నుంచి వెలుతురు బైటికి రాదు. బైట ఉన్న వాళ్లకు ఆ లోపల ఏం జరుగుతుందో అసలు తెలీదు– అంతే కదా తాతా?" అని గొంతెత్తి అడుగుతాడు.

పొంచిన చీకట్లు చీల్చేస్తూ మెరిసిన మెరుపునవ్వుతో, మంచు కప్పిన మొక్కల మీద చిందులేసిన చినుకు ప్రేమతో చెబుతాడు తాత: "కదు గట్టిగుండె నీకుఁ గాఁగాఁ గాక/ అదరి పాయపువారి కంతేసి చెల్లునా..." అని అన్నమయ్య పాడిన గట్టిగుండెల గురించి. చిల్లుబడ్డ చిన్నారిగుండెలకు ఏడుకొండలంత దన్ను, ధైర్యం ఇచ్చిన ఆ ఆపద్బాంధవుడి పేరు తిరుమల తిరుపతి దేవస్థానం!!

బాలలమనసులో భగవంతుడు ఉంటాడు. నిర్మలమైన పసిహృదయాలు ముత్యాల్లాగా స్వచ్ఛంగా ఉంటాయి. అందుకనే బాలలంటే భగవంతుడికి ఎంతో ప్రీతి. తాను సర్వాంతర్యామి అయినప్పటికీ సమయం కుదిరినప్పుడు బాలుడిగా మారి, ఆటలాడి బాల్యావస్థలోని మాధుర్యాన్ని అనుభవించాడు. కన్నయ్య బాల్య క్రీడలే ఇందుకు ఉదాహరణ. అమ్మ దగ్గర బిడ్డ పోయే గారాలన్నీ యశోదమ్మ దగ్గర ప్రదర్శించాడు. అమ్మతో మొట్టికాయలు తిన్నాడు. ప్రేమగా అమ్మ చెవి మెలిపెట్టినా అమ్మప్రేమలోని మాధుర్యాన్ని అనుభవించాడు. వెన్న దొంగిలించాడు. ఒకటా...

నిధులను కూడా విరాళంగా ఇవ్వొచ్చు. సాధారణదాతలకు కల్పించే ప్రయోజనాలన్నీ వీరికి వర్తిస్తాయి. అయితే వైద్య పరికరాల జీవితకాలం పదేళ్లు ఉంటుంది కాబట్టి వారికి పదేళ్లకే ఈ ప్రయోజనాలు ఉంటాయి. అదేవిధంగా ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది. చిన్నారులకు లేదా నవజాతశిశువులకు శస్త్రచికిత్సలకు అయ్యే ఖర్చును విరాళంగా ఇచ్చే దాతలకు మరో అవకాశం కల్పించారు. ఈ విరాళం మొత్తాన్ని నిర్దేశించిన శస్త్రచికిత్సలకు మాత్రమే వ్యయం చేస్తారు. ఇలా విరాళం ఇచ్చిన దాతల పేర్లను ఆసుపత్రిలో ప్రదర్శిస్తారు. ప్రస్తుతం ఒక చిన్నారికి గుండె శస్త్రచికిత్స చేసేందుకు మందులు, అక్సిజనేటర్లు, శస్త్ర చికిత్స సామగ్రి, ఇంప్లాటోస్ కలిపి రూ.లక్ష ఖర్చవుతుంది. శ్రీవేంకటేశ్వర ఆపన్న స్కీమ్ ద్వారా దాతలు ఈ ఖర్చును విరాళంగా అందించవచ్చు. ఇలాంటి దాతలకు ఈ స్కీమ్ ద్వారా ఐదు గురికి మించకుండా నగదుపై బ్రేక్ దర్శన టిక్కెట్లు కేటాయిస్తారు.

# అత్యాధునిక వైద్యం

ఆస్పత్రిలో అత్యాధునిక వైద్యసదుపాయాలతో మెరుగైన చికిత్స అందిస్తున్నారు. ప్రముఖ గుండె సంబంధిత వైద్య నిపుణులు, ఇతర వైద్య సిబ్బందితో పాటు ఎకోస్కానింగ్, మోడరన్‌ల్యాబ్, ఎక్స్‌రే, క్యాథ్‌ల్యాబ్ అడ్వాన్స్‌డ్ ల్యాబ్ అందుబాటులో ఉన్నాయి. దేశంలోని ప్రముఖ చిన్నపిల్లల ఆస్పత్రిలోని గుండె సంబంధిత వైద్యనిపుణులు సైతం శ్రీపద్మావతి చిన్న పిల్లల కార్డియాక్ కేర్ సెంటరుకు వచ్చి తమ అనుభవాల్ని పంచుకుంటున్నారు.







# పరిపూర్ణ ఆరోగ్యంతో..

**గుండె సంబంధితసమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు ఇక్కడ మెరుగైన వైద్యం అందుతోంది. ఆరోగ్యశ్రీ కార్డు ఉంటే చాలు, ఏ మాత్రం ఖర్చులేకుండా ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. రాష్ట్రం నలు మూలల నుంచి ఈ ఆసుపత్రికి వచ్చి వైద్యం చేయించుకుని పరిపూర్ణ ఆరోగ్యంతో తిరిగి వెళ్తున్నారు.**









రెండా.... కన్నయ్యలీలలు ఎన్నని చెప్పగలం. సాధారణ పసిబిడ్డలు ఎలాంటి అల్లరి చేస్తారో అంత అల్లరీ పరమాత్మ బాలుడిగా మారి చేశాడు. బాలలంటే అంత ప్రేమ బాలాజీకి.

శ్రీరామావతారంలో కూడా స్వామి చందమామ కావాలంటూ మారాం చేసి, దశరథుడు అద్దంలో చంద్రుణ్ణి చూపిస్తే కానీ పట్టువదల్లేదు. అప్పటినుంచి రామచంద్రుడయ్యాడు. పసిమనసులంటే పరమాత్మకు అంత ఇష్టం. ఆ హృదయాలకు ఏ చిన్నగాయమైనా స్వామి కలతపడతాడు. మనసు గోడు వినే శక్తి ఆ స్వామికి మాత్రమే ఉంది కదా.

అయ్యవారే ఇంతగా పసిమనసుల పట్ల ప్రేమ పెంచుకుంటే అమ్మ మాత్రం పసిపాపల్ని పట్టించుకోకుండా వదిలేస్తుందా? పైగా ఆమె ముల్లోకాల తల్లి. బిడ్డకు ఏ చిన్న గాయమైనా తల్లి మనస్సు తల్లడిల్లి పోతుంది. తన ఆయుష్షు కూడా పోసుకుని బిడ్డ బాగవ్వాలని కోరుకుంటుంది. జగన్మాత కూడా ఇందుకు మినహాయింపేమీ కాదు. అమ్మ మనసు తెలుసు కాబట్టే అయ్య కూడా పసిబిడ్డలకు ఏ ఆపద రాకుండా చూసుకుంటాడు. ఉత్తరగర్భంలో ఉన్న పరీక్షిత్తు మీద అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని తన చక్రాయుధం వేసి స్వామి అడ్డగించాడు. పసిగుడ్డు ప్రాణాలు కాపాడాడు. గురుదక్షిణ పేరుతో పసివాడైన సాందీపమహర్షి కుమారుణ్ణి పునర్జీవితుడిని చేశాడు.

స్వామికి బాలలంటే ఇంత ప్రీతి కాబట్టే తిరుమల తిరుపతి దేవస్థానం బాలలసేవ భగవంతుడిసేవతో సమానమని భావించింది. బాలల కోసం ప్రత్యేకంగా ఏదైనా ఓ సేవా కార్యక్రమాన్ని నిర్వహించాలని సంకల్పించింది. ఆ సంకల్పానికి సాకారమే శ్రీపద్మావతీచిన్నపిల్లల ఆసుపత్రి.

ఈ ఆసుపత్రి 11-10-2021న ఆంధ్రప్రదేశ్ గౌరవ ముఖ్యమంత్రి శ్రీవై.ఎస్.జగన్మోహనరెడ్డి చేతులమీదుగా 70 పడకలు, మూడుఆపరేషన్ థియేటర్లతో ప్రారంభమైంది. ఏడాదిలోనే దేశంలో అత్యున్నత వైద్యసేవలు అందించే పది ఆసుపత్రులలో ఒకటిగా గుర్తింపు తెచ్చుకుంది.





2022 జనవరినుంచి ఈ ఆసుపత్రిలో గుండె సంబంధిత శస్త్రచికిత్సలు నిర్వహించి దేశం మొత్తం ఇటువైపు చూసేలా చేశారు. తెలుగురాష్ట్రాలతో పాటు ఒడిశా, బీహార్, పశ్చిమబెంగాల్, పంజాబ్, తమిళనాడు, కర్ణాటక, నాగాలాండ్‌వంటి రాష్ట్రాలతో పాటు, బంగ్లాదేశ్ నుండి వచ్చిన చిన్నారులకు శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తిచేశారు. ఆసుపత్రి దిన దినాభివృద్ధి చెందుతూ చిన్నపిల్లల సూపర్ స్పెష్పాలిటీ స్థాయికి చేరుకుంది.

ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా వివిధరాష్ట్రాలలోని దారిద్ర్యరేఖకు దిగువ ఉన్న పేదపిల్లలకు సైతం, కులమతాలకు అతీతంగా ఉచితంగానే శస్త్రచికిత్సల సేవలను అందిస్తున్నారు. రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చయ్యే ఈ ఖరీదైన వైద్యం ఉచితంగా పొందే అవకాశాన్ని కల్పించారు.

ఈ ఆసుపత్రిని సర్వప్రజావళికి అందుబాటులోకి తీసుకురావడంలో తి.తి. దేవస్థానం పూర్వకార్యనిర్వహణాధికారి కే.ఎస్.జవహర్‌రెడ్డి, ప్రస్తుత తి.తి.దే. కార్యనిర్వహణాధికారి ఏ.వీ.ధర్మారెడ్డి, ఆసుపత్రి డైరెక్టర్ డా॥ఎన్. శ్రీనాథరెడ్డి విశేషంగా కృషి చేశారు. ఆస్పత్రి నిర్వహణ, వైద్యసదుపాయాలకోసం రూ.25 కోట్లను తి.తి.దే. విడుదల చేసింది. 2022-2023 వార్షిక ఏడాదికి ప్రాణదాన పథకంద్వారా వైద్యఖర్చులకోసం రూ.15 కోట్లను తి.తి.దే. విడుదల చేసింది.

భావిభారత భవిష్యత్తు నిర్మాతలైన పసిపిల్లలను సంరక్షించాల్సిన బాధ్యత అందరిది. ఈ బాధ్యతను సర్వజన బాంధవుడైన శ్రీనివాసుడు స్వీకరించడం, అందుకనుగుణంగా తి.తి.దే. ముందడుగు వేయడం హర్షణీయం. తల్లిదండ్రులకు బిడ్డలే సిరి సంపదలు. అలాంటి పిల్లలకు వచ్చే గుండెజబ్బులను నయం చేసి తల్లిదండ్రులకు సంతోషాన్ని ప్రసాదిస్తున్న శ్రీపద్మావతీ శ్రీనివాసులు వాత్సల్యమూర్తులనేందుకు ప్రత్యక్షనిదర్శనం ఈ చిన్న పిల్లల ఆసుపత్రి.

## సూపర్‌స్పెషాలిటీ దిశగా...

**శ్రీపద్మావతీ చిన్నపిల్లల హృదయాలయాన్ని సూపర్ స్పెషాలిటీగా మారిస్తే మరింత మందికి మేలు జరుగుతుందనే ఉద్దేశ్యంతో తి.తి.దే. ముందడుగు వేసింది. ఇందులో భాగంగా తి.తి.దే. రూ. 300 కోట్లతో తిరుపతిలో నిర్మిస్తున్న శ్రీపద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ గౌరవముఖ్యమంత్రి 2022 సం॥ మే నెలలో శంకుస్థాపన చేశారు.**












**అలిపిరి వద్ద ఆరుఎకరాల విస్తీర్ణంలో 4,11,325 చదరపు అడుగుల విస్తీర్ణంలో తి.తి.దే. చిన్నపిల్లల ఆసుపత్రి నిర్మిస్తోంది. ఈ నూతన భవననిర్మాణాలను పరిశీలిస్తున్న తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారిణి శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్.**

జనవరి 15న
మకరసంక్రాంతి
సందర్భంగా..

# జీవన క్రాంతి... సంక్రాంతి

– డా॥ సుబ్బలక్ష్మి మర్ల



తెలుగువారి సంస్కృతిలో సంక్రాంతి పండుగకు ఒక ప్రత్యేకస్థానముంది. ఈ సంక్రాంతి అటు పండుగగాను ఇటు పర్వదినంగాను రెండువిధాలా విశిష్టత కలిగినటు వంటిది. మనప్రాంతంలో రైతులకు పంటచేతికి వచ్చేసమయం కనుక చేతిలో ధనం సమృద్ధిగా ఉండి వైభవోపేతంగా ఈ పండుగను జరుపుకునే ఆచారం మొదలైంది. అభ్యంగన స్నానాలు, నూతనవస్త్రాలు, దానధర్మాలు, కళాపోషణ మొదలగు అనేకభోగాలతో ముచ్చటగా మూడురోజులు జరుపుకునేందుకు ప్రకృతిమాత ప్రసాదించిన వరం సంక్రాంతి.

ఇక ఆధ్యాత్మికపరంగా, జ్యోతిషశాస్త్రరీత్యా చూస్తే ఇది అమోఘమైన పర్వదినం. ఉత్తరాయణ పుణ్యకాలంయొక్క ప్రాశస్త్యం ఇంతటిది అని చెప్పడానికి అలవికాదు. అందుచేతనే స్వచ్ఛందమరణాన్ని వరంగా పొందిన శంతనతనయుడు భీష్ముడు మహాభారతయుద్ధంలో క్షతగాత్రుడై ఉత్తరాయణపుణ్యకాలంకోసం ఎదురుచూస్తూ అంపశయ్యాగతుడై నిరీక్షించి మాఘశుద్ధ ఏకాదశి రోజున తనువు చాలించి తొల్లింటి వసువు రూపాన్ని పొందాడు.

మన జ్యోతిషశాస్త్రరీత్యా సూర్యుడు సంవత్సరంలో ఆరు నెలలు భూమధ్యరేఖకు ఉత్తరంగాను, ఆరునెలలు భూమధ్య రేఖకు దక్షిణంగాను అక్షాంశాలను మార్చుకుంటూ సంచరిస్తాడు. ఉత్తరఅక్షాంశంలో సంచరించే ఆరునెలలకాలం ఉత్తరాయణంగాను, దక్షిణాక్షాంశంలో సంచరించే ఆరునెలలకాలం దక్షిణాయనంగాను వ్యవహరింపబడుతోంది. ఉత్తరాయణంలోని సూర్యరశ్మి ఆరోగ్య ప్రదాయిని. ఉత్తరాయణంలో వచ్చే పర్వాలలో అతి ముఖ్యమైనవి శ్రీసూర్యజయంతి (మాఘశుద్ధసప్తమి); సమస్తవిశ్వానికి కారణభూతుడు త్రిమూర్త్యాత్మకుడు అయిన సూర్యభగవానుని జన్మదినం ఈ ఉత్తరాయణంలోనే కావడంవల్ల దీని పవిత్రత ద్విగుణీకృతమౌతోంది.

జ్యోతిషశాస్త్రంలో చెప్పబడ్డ మేషాది 12 రాశులలోను సూర్యుడు ఒక్కొక్కనెలలో ఒక రాశిలో ప్రవేశిస్తాడు. సూర్యసంక్రమణం జరగని మాసం అధికమాసంగా పరిగణింపబడుతోంది. సూర్యుడు ఒక్కొక్క రాశిలో ప్రవేశించడాన్ని ఒక్కొక్క సంక్రమణంగా చెప్పుకుంటున్నాం. అయితే వీటన్నిటిలో దక్షిణాయనం మొదలయ్యే కర్కాటకసంక్రమణానికి ఉత్తరాయణ మారంభమైన

మకరసంక్రమణానికి ఒక ప్రత్యేకత ఉంది. వీటి రెంటిలో తిరిగి మకరసంక్రమణానికి అత్యంత ప్రాధాన్యమీయబడింది. సూర్యుడు మకరరాశిలో ప్రవేశించే పవిత్రసమయమే మకర సంక్రమణం. దీన్నే 'మకరసంక్రాంతి' అని, 'సంక్రాంతి' అని, సంకురాతిరి' అని వ్యవహరిస్తున్నాం. సంక్రాంతి పండుగకు నాంది ప్రస్తావన వంటిది ధనుస్సంక్రమణం. ధనుర్మాసం వైష్ణవు లకు అత్యంత పవిత్రమైన మాసం. ఈ నెలరోజులు గోదా సహితుడైన శ్రీరంగనాథస్వామిని అత్యంత భక్తిశ్రద్ధలతో కొలు స్తారు. ప్రాతఃకాలాన మేల్కొంచి, గోదాదేవి విరచితమైన పాశు రాలను ఆలపిస్తూ, శుచిర్భూతులై నగరసంకీర్తన చేస్తూ తెల్లవారిన తరువాత గోదారంగనాథులకు భోగం సమర్పించి ప్రసాదం స్వీకరిస్తారు.


ధనుర్మాసం నెలరోజులు స్త్రీలు వేకువఝామున మేల్కొని వాకిళ్లలో గోమయం కలిపిన నీళ్లు చల్లి రంగురంగుల రంగవల్లికలతో అలంకరిస్తారు.



అనేక ఔషధగుణాలుగల గోమయంవల్ల క్రిమికీట కాదులను పరిమార్చే ఘాటైన ముగ్గువల్ల గృహాలు కీటకరహి తాలై ఆరోగ్యానికి నెలవులుగా భాసిల్లుతాయి. రంగవల్లులను తీర్చిదిద్దే సమయంలో స్త్రీలు కొన్నిసార్లు కుడివైపుకు కొన్నిసార్లు ఎడమ వైపుకి, ఒక్కొక్కసారి ముందుకి వంగుతూ శ్రమించడం వల్ల శరీరానికి చక్కనివ్యాయామం జరిగి చలికాలంలో రోజంతా పనిచేయడానికి కావాల్సిన ఉత్సాహం, శక్తి సమకూరతాయి.

"పుష్యమాసంలో పూసగుచ్చేందుకు సమయం ఉండదు" అని సామెత. ఆ హేమంతఋతువులో పగటి సమయం తక్కువగాను, రాత్రులు సుదీర్ఘంగాను ఉంటాయి. వేకువ ఝామున మేల్కొంచి శరీరానికి చక్కని వ్యాయామాన్ని అందీ యడంవల్ల కురుచ అయిన దినంలో పనులను చురుకుగా, సమర్థవంతంగా నిర్వహించడానికి వీలు కలిగి సమయనియం త్రణ కూడ చక్కగా సాధ్యపడుతుంది. తీర్చిదిద్దిన ముగ్గులలో కన్నెపిల్లలు గోమయంతో చేసిన గొబ్బెమ్మలను ప్రతిష్ఠించి వాటిని గుమ్మడి పూలతో, బంతిపూలతో, ఆ కాలంలో లభించే వివిధ రకాలపుష్పాలతోనూ పూజించి గౌరీదేవిగా భావించి కొలుస్తారు.

తమిళులు సంక్రాంతి ముందురోజు 'భోగి'కే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. ఆ దినాన గోదా శ్రీరంగనాథుల పరిణ యాన్ని వైభోగంగా జరుపుకుంటారు. ఆరుబయట సూర్య భగవానుని ఎదురుగా పొంగలి వండి సూర్యునికి నివేదించి సూర్యారాధన చేస్తారు. అందుచేతనే వీరు దీన్ని 'పొంగల్' అని వ్యవహరిస్తారు. తెలుగువాళ్లకు సంక్రాంతే అత్యంత ప్రాధాన్య మైనది. ఇది మూడురోజులపండుగగా వ్యవహరింపబడడానికి కారణం ఏమిటి అని ప్రశ్నించుకుంటే సంక్రాంతి పర్వదినానికి ముందువచ్చే రోజుని 'భోగి'గా పిలుస్తారు. పర్వసమయంలో దైవ, పితృకార్యాలు జరపాల్సి ఉంటుంది. అందుచేత ఆ రోజున అభ్యంగన స్నానాదికాలు నిషిద్ధం. దాని కారణంగా ముందు రోజు భోగపరమైన అభ్యంగన స్నానాదికాలు నిర్వర్తించుకుని నూతన వస్త్రధారణ, విందువినోదాలు జరుపుకోవడం జరుగు తుంది. దీన్నే భోగిపండుగ అంటాం. భోగినాడు భోగిమంట లలో ఎండిన గొబ్బెమ్మలతో గుచ్చిన భోగి దండలు వేస్తారు. బాలికలు భోగి పిడతల పేరిట కళాత్మకంగా రంగులతో అలంకరించిన చిన్నచిన్న మట్టి పిడతలలో రేగిపళ్లు, రాగిపైసలు, చెఱకు ముక్కలు వేసి ఇంటింటికి పంచిపెడతారు.



రెండవరోజైన సంక్రాంతి పరమపవిత్రమైన దినం. ఆనాడు ఎవరి శక్త్యానుసారం వారు బంగారం, వెండి, భూమి, గోవులు, ధాన్యం, బియ్యం, వస్త్రాలు, పండ్లు, కూరగాయలు, గుమ్మడిపండ్లు మొదలైనవి దానంచేస్తే గ్రహబాధలు తొలగి, ఆయురారోగ్యభాగ్యాలు, మనశ్శాంతి లభిస్తాయని చెప్పబడింది.



అందుచేతనే మనవారు ఈ సంక్రాంతి పండుగనాడు, గంగిరెద్దులవారికి, సాతానిజియ్యర్లకు, బుట్టబొమ్మలవారికి, తప్పెటగుళ్లవారికి, చెక్కభజనలవారికి, పగటివేషగాళ్లకి, దాసరులకి ఇంకా అనేకవిధాలైన జానపదకళాకారులకు తమ శక్త్యానుసారం కానుకలు సమర్పించుకుంటారు. ఈ సంప్రదాయం కారణంగానే అనాదినుంచి వస్తున్న ఎన్నోఎన్నెన్నో జానపదకళారూపాలు నేటికీ సజీవంగా నిలువగలుగుతున్నాయి. సంక్రమణ పుణ్యకాలంలో పితృదేవతల తృప్తికి స్నాన, దాన, శ్రాద్ధాదులు ఆచరించాలి. ఈ విధంగా సంక్రమణ దినం ఈ మూడురోజుల పండుగలో రెండవరోజుగా పరమపవిత్రమైన అత్యంత ముఖ్యమైన దినంగా పరిగణింపబడుతూ, మొత్తం మూడురోజుల పండుగనే సంక్రాంతి పండుగ అంటారు.

జాతర, సంక్రమణం, గ్రహణం మొదలగునవి జరిగిన మరుసటి దినాన్ని 'కనుమ'గా వ్యవహరిస్తారు. ఆ రోజు పశువులను పసుపుకుంకుమలతో పూజించి పూలమాలలతోను, గంటలతోను, పూసలదండలతోను అలంకరించి ఇంతటి ఆనందానికి కారణభూతమైన ఆ గోగణానికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటారు. వ్యవసాయదారులకు సిరిసంపదలన్నీ సమకూరేది ఈ పశు గణంవల్లనే కదా! వ్యవసాయదారులు తమ నాగళ్లను, వ్యవసాయపనిముట్లను కూడ పూజిస్తారు.

సంక్రాంతి పండుగకు, కూతుళ్లను, అల్లుళ్లను, క్రొత్త వియ్యాలవారిని తీసుకొని వచ్చి, వారిని కానుకలతో సత్కరించడం మన ఆచారం. తమకు కలిగినంతలో పదిమందికి పెట్టాలి అనే సదుద్దేశం, దైవ, పితృకార్యాలని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వర్తించడం, తమ అభ్యున్నతికి మూలకారకాలైన వారికి, పశుగణానికి కృతజ్ఞతాంజలులు అర్పించడం అనే ముప్పేట సుగుణాలకు ప్రతిరూపంగా నిలుస్తూ తెలుగు సంప్రదాయాన్ని ప్రతిబింబింపజేసే పెనుపండుగ సంక్రాంతి.

ముచ్చటగా మూడు రోజులు జరుపుకున్నాక నాలుగవ రోజు కొసరుగా 'ముక్కనుమ' జరుపుకుంటారు. ముక్కనుమ నాడు స్త్రీలు సావిత్రీగౌరీదేవివ్రతాన్ని ఆరంభించి తొమ్మిది రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో గౌరీదేవిని కొల్చి పదవ రోజున వాలలాడింపు పేరుతో గౌరీదేవులను ఊరేగించి జలంలో నిమజ్జనం చేస్తారు.

ఈ విధంగా ఈ సంక్రాంతి పండుగ భోగి, సంక్రాంతి, కనుమ అనే పేర్లతో మూడురోజులపండుగై తెలుగువాళ్లకు అత్యంత ప్రీతిపాత్రమైన ముఖ్యమైన పండుగగా విరాజిల్లుతోంది.




పాఠకులకు, రచయిత(త్రు)లకు, ఏజెంట్లకు అందరికీ....


## నూతన ఆంగ్ల సంవత్సరం - 2023
## మరియు సంక్రాంతి శుభాకాంక్షలు!

హరినామస్మరణతో కూడిన హరిదాసుకీర్తనలు, ఖగోళరహస్యాన్ని దర్శింపచేసే ముచ్చటైన రంగవల్లికలు, గొబ్బెమ్మల రూపంలో గోపికలు, కృష్ణభగవానునికి చేసే ఆరాధనం, సూర్యశక్తిని ప్రసాదించే భోగి పండుగ, పితృదేవతల ఆశీర్వచనం లభించే సంక్రాంతి పండుగ, శ్రమైకజీవన సౌభాగ్యాన్ని కలిగించే కనుమపండుగ, సర్వులకు సర్వసౌభాగ్యాలను కలిగించాలని సంక్రాంతిలక్ష్మిని, దేవదేవుడైన శ్రీవేంకటేశ్వరుణ్ణి ప్రార్థిస్తూ...

మీ... ప్రధానసంపాదకుడు



ధారావాహిక



# తిరుమల సమయాచారములు

## (తిరుమల-తిరుపతి ఐతిహ్యామాల)

తెనుగు అనువాదకులు:
కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు,
కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు

*గత సంచిక తరువాయి భాగం....*

శ్రీనివాసుని వైభవాల్లో లోపం రాకుండా ఉండేందుకు తర్వాత్తర్వాత అభివృద్ధి చెందేటట్లు స్వామిసన్నిధిలో జరగాల్సిన ఆచారాలలో ఏ కొరతా లేకుండేటట్లు, కైంకర్యపరులకు అపరాధం ఏర్పడకుండా ఉండేటట్లు మంచిమాటలు చెప్పి వాళ్లను తీసుకువచ్చి స్వామికైంకర్యాన్ని ప్రతిరోజు జరిపించడానికి, శ్రీనివాసుని దివ్యదేహానికి, ముఖారవిందానికి సరిపడేటట్లు అర్ఘ్యపాద్యాలు, చందనలేపాదులు, భక్ష్యభోజ్యాలు అనే ఉపచారాలను జరిపించడానికి, భగవద్రామానుజుల దివ్యచరణాలపై భక్తికలిగే విధంగా, హితోపదేశం చేయడానికి ఆ ప్రభువు మూలంగా శ్రీవేంకటాచలపతికి సంబంధించిన సమస్త శ్రీకైంకర్యాలు, ఆరాధన స్వీకరింపజేయడానికి ఇలా అనేక భగవద్ధర్మాలు ఏర్పరచుటకు, ఇలా ఏర్పడ్డవాటిని చక్కగా నిర్వహించడానికి శ్రీరామావతారంలో ఎలాంటి లోపాలులేనిదైన, అనుదిన కైంకర్యపరుడైన ఆంజనేయస్వామి ముద్రగా ఒక ముద్రాంగులీయకం చేయించి ఇచ్చాడు.

శ్రీనివాసుని అనుమతిని పొంది ఆ ఏకాంగి శ్రీవైష్ణవుడు ప్రతిరోజూ దాన్ని ధరించాలి. హనుమ ముద్రాంకితమైన ఒక ఘంటను శ్రీముద్రాంకితమైన ఒక కటారిలో కట్టి, భగవత్కైంకర్యం కోసం యాత్రకు వెళ్లేటప్పుడు ఘంటానాదంతో, హనుమ ముద్రాంకితమైన ఒక జెండాను కూడా చేత పట్టుకుని, సేనాధిపతి అయిన విష్వక్సేనుడు రాజ్యాధికార ముద్రాధికారాల్ని సాగించాలి. సన్నిధిలోని సకలపరిజనులు ఆ ఏకాంగి శ్రీవైష్ణవునికి విధేయులై స్వామి కైంకర్యాలలో ఏకొదవా లేకుండా ఉండేటట్లు నడుచుకోవాలి.

హనుమముద్రతో ఉన్న ఉంగరంతో స్వామివారి దివ్య భండారానికి ప్రతిరోజూ రాత్రిపూట తలుపులన్నిటికీ ముద్ర వేయాలి. ఇలా లింకులెన్నో భగవద్ధర్మాలను ఉద్ధరించడానికి అనువుగా ఏకాంగి శ్రీవైష్ణవునకు 'సేనాపతి జియ్యరు' అనే పేరు పెట్టి మంగళాశాసన మర్యాద చేసి కైంకర్యనిర్వాహకులను నియమించారు.

తర్వాత తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి కైంకర్యాల్లో ఏ లోపం రాకుండా ఉండే విధంగా కడియం యాదవరాజుకు ఆనతిచ్చి శ్రీచిత్రకూటమహాత్మ్యసిద్ధమైన మిథునమాసం తిరునాళ్లను ప్రతిసంవత్సరం శ్రీగోవిందరాజస్వామి నిర్వహించాలని కట్టడి చేశారు. శ్రీగోవిందరాజస్వామివారి వైభవం ఉత్తరోత్తరాభివృద్ధి పొందడం కోసం ఆముక్తమాల్యదా (గోదా) దేవిని, ఎడమ చేత కల్హారపుష్పాన్ని ధరించి ఉండేటట్లు, రెండు భుజాలతో వ్యూహ లక్ష్మీదేవి వలే ఐశ్వర్యదాయినియై ఉండేటట్లు శ్రీగోవిందరాజస్వామికి కుడివైపున ప్రతిష్ఠింపజేసే యంత్రోద్ధారాదులను చేయించి ఆరాధన జరిపించడానికి ఏర్పాట్లు చేశారు.

ధనుర్మాసంలో 'మార్గళినీరాట్టమ్' అనే ఒక ఉత్సవాన్ని ఏడురోజులు జరిపేటట్లు, మరుసటిరోజు రథోత్సవం జరపడానికి, కనుమనాడు మనుష్యఉత్సవాలు జరుపడం నిషిద్ధమైనా స్త్రీలకు కొన్ని కామ్యకర్మానుష్ఠానాలు ప్రశస్తాలని జ్యోతిష్యశాస్త్రం చెప్పడం చేత, ఆ కనుమపండుగరోజు శ్రీగోదాదేవికి, శ్రీకృష్ణస్వామికి మాలికలు సమర్పించి విశ్వకల్యాణం జరిగేటట్లు శాసించారు.

*(ఇంకా ఉంది)*



# చదువులతల్లికి వందనం...

- డా॥ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర రావు,
94919 46070.

చదువులతల్లి, అక్షరాల అధిదేవత, విద్యలరాణి, పుస్తకపాణిని, జ్ఞానప్రదాయిని అయిన శ్రీసరస్వతీదేవి శ్రీజ్ఞాన సరస్వతీదేవిగా కొలువుదీరిన పవిత్రక్షేత్రం **"బాసర"**.

ఈ క్షేత్రంలో శ్రీసరస్వతీదేవిని ప్రతిష్ఠించిన వ్యాసమహర్షి ఈ ప్రాంతంలో ఆశ్రమాన్ని నిర్మించుకొని కొంతకాలం గడిపాడు. అందువల్ల ఈ క్షేత్రానికి "వ్యాసపురి" అనే పేరు ఏర్పడింది. కాలక్రమంలో వ్యాసపురి- "వాసర"గా మార్పు చెందింది. "వాసర" అనేది ప్రజలవాడుకలో "బాసర"గా మార్పు చెందింది.

ఈ క్షేత్రం స్థలపురాణకథనాలు విరివిగా ప్రచారంలో ఉన్నాయి. శివపార్వతుల గారాల బిడ్డడైన కుమారస్వామి భూలోక పర్యటన చేస్తూ ఈ ప్రాంతంలోని ఒక పర్వతంపై కొంతకాలం విశ్రమించాడు. అందువల్ల ఈ పర్వతానికి కుమారాచల పర్వతం అనే పేరు ఏర్పడింది. మహాభారత యుద్ధానంతరం వ్యాసమహర్షి కుమారాచలపర్వత ప్రాంతానికి వచ్చి ఒక గుహలో తపస్సు చేస్తూ గడపసాగాడు. తపస్సు చేస్తూ ఉన్న సమయంలో ఒకనాడు జగన్మాత వ్యాసభగవానుడికి దర్శనమిచ్చి మూడు పిడికళ్ల ఇసుకను తెమ్మని చెప్పింది. ఆ తల్లి మాట మేరకు వ్యాసుడు గోదావరీతీరం నుంచి మూడు పిడికళ్ల ఇసుక తీసుకువచ్చి భూమిపై పోయగానే ఆ ఇసుక మూడు పవిత్రరూపాలను పొందింది. ఆ రూపాలే శ్రీసరస్వతీ దేవి, శ్రీలక్ష్మీదేవి, శ్రీమహంకాళి అమ్మవార్లు అని స్థలపురాణం. కుమారాచల పర్వతంపైన కొలువుదీరిన శ్రీసరస్వతీదేవి కనుక అమ్మవారికి కౌమారాచలనివాసిని అనే పేరు కూడా ఉంది.

బాసరలో శ్రీజ్ఞానసరస్వతీ ఆలయానికి కొద్దిదూరంలో గోదావరినది ఉంది. నదీతీరంలో ఉన్న ఆలయంలో పరమ శివుడు శ్రీసూర్యేశ్వరస్వామి పేరుతో కొలువుదీరాడు. సమీపం లోనే గోదావరీమాత విగ్రహం, వేదవతి శిలలు ఉన్నాయి. శ్రీజ్ఞానసరస్వతీ ఆలయప్రాంగణానికి సమీపంలో ప్రధాన రహదారి ప్రక్కనే శ్రీవేదవ్యాసుడి ఆలయం ఉంది.

శ్రీజ్ఞానసరస్వతీ అమ్మవారి ఆలయంలోనికి ప్రవేశించేందుకు ఉత్తరం, పడమర అభిముఖంగా గోపురద్వారాలు ఉన్నాయి. ఉత్తరద్వారంపై మూడు అంతస్తులగోపురం, పడమర గోపురంపై ఐదుఅంతస్తుల గోపురం దర్శనమిస్తాయి. ప్రధాన





ఆలయం మహామండపం, ముఖమండపం, గర్భాలయాలను కలిగి ఉంది. ముఖమండపంలో అమ్మవారి ఉత్సవమూర్తి దర్శనమిస్తుంది. ప్రధాన గర్భాలయంలో శ్రీజ్ఞానసరస్వతీ దేవి వీణాధారిగా కొలువుదీరి పూజలందుకుంటోంది. అమ్మవారికి కుడివైపున శ్రీలక్ష్మీదేవి కొలువుదీరి ఉంది. ఆలయ ప్రాంగణంలో ఉత్తరంవైపున రావిచెట్టు, వేపచెట్టు వాటి క్రింద వేదికపై వివిధదేవతలు కొలువుదీరి ఉన్నారు. ప్రధానఆలయానికి తూర్పున శ్రీదత్తాత్రేయస్వామివారు కొలువుదీరిన ఆలయం ఉంది. ఆలయప్రాంగణంలో శ్రీమహంకాళిఅమ్మవారు ప్రత్యేక ఆలయంలో కొలువుదీరి ఉంది. ఆలయసమీపంలో కొండపైన వ్యాసగుహ ఉంది. ఈ గుహలోనే పూర్వం వ్యాసుడు తపస్సు చేసినట్లు కథనం. ఈ గుహలో శ్రీసరస్వతీదేవిని భక్తులు దర్శించుకోవచ్చు.

**జ్ఞానసముపార్జనకు తొలిమెట్టు అక్షరాభ్యాసం. అటువంటి అక్షరాభ్యాసాన్ని బాసర క్షేత్రంలోని ఆలయంలో చేస్తే ఫలప్రదమౌతుందని భక్తుల విశ్వాసం.**





కాగా, బాసరలో ఉండే మరో ఆచారం “మధూకరం” మధుకర వృత్తిచే లభించే భిక్షకు మధుకరం అని పేరు. నిష్ఠతో 11, 21, 41 రోజులు మధ్యాహ్నం బాసరలో భిక్షను స్వీకరించి, అమ్మవారికి నమస్కరించి భుజించడం వల్ల అమ్మవారి కృప కలుగుతుందని భక్తుల విశ్వాసం.


శ్రీజ్ఞానసరస్వతీ అమ్మవారికి ప్రతి సంవత్సరం దేవీ నవరాత్రుల సందర్భంగా ఆశ్వీయుజమాసంలో బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. మాఘమాసంలో శ్రీపంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

బాసరలో ఆలయంవారు నిర్వహించే కాటేజీల్లో భక్తులకు వసతి సౌకర్యాలు లభిస్తాయి. ఆదిలాబాద్ నుంచి 145, నిజామాబాద్ నుంచి 35 కిలోమీటర్ల దూరంలో హైదరాబాద్– మన్మాడ్ రైలుమార్గంలో ఉన్న బాసరకు సికింద్రాబాద్, నాందేడ్, నిజామాబాద్, కామారెడ్డిలనుంచి రైలుసౌకర్యాలు ఉన్నాయి. హైదరాబాద్, నిజామాబాద్, భైంసా, నిర్మల్‌వంటి ప్రాంతాల నుంచి బస్సు సౌకర్యాలు కూడా ఉన్నాయి.

**ఈ నెల 16న**

## గోదాపరిణయం

**సందర్భంగా...**



# కల్యాణ వైభోగమే!

– ఆచార్య పి.నరసింహారెడ్డి,
*90006 37657*

శ్రీవిల్లిపుత్తూరుకు స్వామివారు విజయం చేస్తే కూతురునిస్తానని విష్ణుచిత్తుడు చెప్పగా దయారసార్ద్రచిత్తుడై– విశ్వభర్త పక్షి నాయకుడైన గరుత్మంతుణ్ణి అధిరోహించి బ్రహ్మాదిదేవతలు తమ తమ వాహనాలెక్కి రాగా విష్వక్సేనుడు తాను ముందు వెళ్తూ పెండ్లివారినందర్నీ వరసలు తీర్చి తన వెంట తీసుకెళ్లాడు.

అలా శ్రీవిల్లిపుత్తూరుకు వారు వెళ్లి విశ్వకర్మ, మణిమయంగా కట్టిన విడిది పట్టులో ప్రవేశించారు. ఆ ఆదిమ వరుడు అయిన శ్రీహరి– దివ్యాప్సరసలు పసుపు మొదలైన స్నానీయమంగళద్రవ్యాలతో అలంకారం చేయగా, పెండ్లికొడుకయ్యాడు, దేవదుందుభులు, నారదాది దివ్యమునుల గానాలు శబ్దిస్తున్నాయి.

రంగనాథస్వామి వెండిలాంటి ధవళ దివ్యమేఘాలు కురిసే అమృతధారలతో అభిషిక్తుడయ్యాడు. ముత్యాలసరాలతోను కౌస్తుభరత్నంతోను అలంకరింపబడ్డ శంఖం లాంటి కంఠంతో, కేయూర కంకణాలతో అలంకృతుడయ్యాడు. మకరకుండలాలు, కిరీటం మొదలైన భూషణాలతో విభూషితుడయ్యాడు. దివ్యమైన అంగరాగం(మైపూత) అలదుకున్నాడు. పీతాంబరాన్ని ధరించాడు. తులసీ కల్పవృక్షాల పూలమాలకు ఆశ్రితమైన వక్షం కలవాడయ్యాడు.

ఇక్కడ ఇలా ఉండగా అక్కడ విష్ణుచిత్తుడు గృహప్రవేశం చేసి సంభ్రమాయత్తుడైన విష్ణుచిత్తుని ప్రయత్నంతో పార్వతి, వాణి మొదలైన దేవతాస్త్రీల సమూహం పూర్వం ఆచరించబడ్డ సీతారాములకల్యాణానికి సంబంధించిన అతిశయాలైన గీతాల్ని వైభవంగా పాడారు. మైత్రితో ఏకావళి, స్రగ్విణి ఇరువైపుల వింజామరలు వీస్తూ ఉండగా గోదాదేవిని పెండ్లి కూతురిని చేసి ఋషిపత్నులు ఆశీస్సహితంగా పసుపుద్రవంతో నలుగులు పెట్టారు.

అలా వివాహదీక్ష జరగ్గా, వాసన నూనెతో గోదాదేవికి తలంటి, శిరోజాల్ని గందంతో పులిమి, స్వర్ణమణిమయమైన కడవల్తో చల్లనిజలంతో జలకమాడించారు. దేవతా స్త్రీ ఒకామె ప్రేమతో తడి తుడిచి నాణ్యమైన సన్నచీర కట్టించింది. ఒకామె మణిపీఠం మీద కూర్చున్న గోదాదేవి మెరిసే పొడవాటి శిరోజాలు ఆరబెట్టి ధూపం వేసి కొప్పు తీర్చింది.


ఒక అతివ లత్తుకనీళ్లని గోదాదేవి ఎర్రని పాదాల గోళ్ల వరుసలకు పూసింది. ఒక పడతి గోదాదేవి నయమైన వేళ్లకు మట్టెలు, పిల్లాండ్లు పాదాలకు అందెలు అమర్చింది. ఒక వెలది కుచ్చిళ్లు పెట్టి బంగారు నీటి వ్రాత చెరగు ఉండే తెల్లని పట్టుచీరను ప్రేమతో గోదాదేవికి కట్టించింది. ఒకామె గోదాదేవి కటిసీమలో బంగారు మొలతాటిని, కంఠంలో తారహారాల్ని అమర్చింది. కంకణాలు, హస్తసరాలు, భుజకీర్తులు. ఉంగరాలు, తీగెలాంటి బాహువులకు, వేళ్లకు అమర్చారు. కమ్మలు, ముత్తెపు ముక్కరపెట్టారు. కన్నుగవకు కాటుకరేఖలు ఒకామె నిలిపింది. ఒకామె గోదాదేవి తెల్లని కన్నుగవకు కాటుకరేఖలు తీర్చింది– శరీరానికి కస్తూరి పూసింది. చేర్చుక్క పెట్టి, క్రొమ్ముడికి చెంగలువలు కూర్చింది.

ఈ విధంగా గోదాదేవి అలంకృతయై ఉండగా, లగ్నం సమీపించిందని విన్నవించడంతో శేషశయనుడైన హరి బయలుదేరాడు. పన్నెండు సూర్యమండలాలు దివ్వెలై వెలుగుతున్నాయి. తారకల గుంపు గొడుగుచుట్టూ ఉండే ముత్యాల జాలర్లుకాగా పద్మవిరోధి ఐన చంద్రుడు



వేంకటేశ! వరద! వేదాంతలక్షిత! శ్రీనివాస!

గొడుగయ్యాడు. సముద్రుడు సౌగంధిక పుష్పదళాలకానుకతో కూడా విపణివీథిలో కల్లాపిని చిలకరించాడు. ప్రకృతికాంత, సురస్త్రీలతో కలుసుకుని ఆ సమీప ప్రదేశాన్ని సవరణ పరిచింది. అగ్నిదేవుడు అగరుధూపం రేపాడు. మేఘుడు ఉల్లెడ పట్టాడు. వేదాలు వందిమాగధ సంఘాలై బిరుదు కైవారాలు పఠించాయి. నారద సనందనాది మునులు సంగీతమంగళత్వంతో అంతరంగానికి ఇంపుచేకూర్చాడు. గరుత్మంతుడు మదగజంగా స్వర్ణరత్నమయమైన పల్యాణాన్ని వహించాడు. అలా శ్రీరంగనాథస్వామి అలోక సామాన్యమైన వైభవంతో వెళ్లగా, భాగవతశ్రేష్ఠుడైన విష్ణుచిత్తుడు పరమసంభ్రమంతో భక్తిసహిత ప్రణామపూర్వకంగా స్వాగతం చెప్పడానికి వచ్చాడు. స్వామివారు తన వాహనం దిగి విష్వక్సేనుని కైదండ గ్రహించి నడిచి వస్తుండగా ద్వారాల్లో చంచలాక్షులు స్వామి పాదాలను కడిగే జలంకోసం పైపైన పడుతూ దేవతలు, సిద్ధసంఘాలు మేము ముందంటే మేము ముందని భూమిని నిర్జలం అయ్యేట్లు ఊడ్చుకొని ఆ పానజలాన్ని పుచ్చుకున్నారు. అలా స్వామి పెండ్లిపందిరి ప్రవేశించి విష్ణుచిత్తుడు నిర్దేశించిన స్వర్ణపీఠంపై ఆసీనుడయ్యాడు. విష్ణుచిత్తుడు బంగారు చెంబులో, పసిడి పళ్లెంలో ఉంచబడ్డ తామరపూల లాగా మృదువులైన చిగుర్లలాంటి స్వామిపాదాల్ని కడిగాడు. షోడశోపచారసహితంగా సాలంకారమైన మధుపర్కాన్ని సమర్పించగా స్వామి గ్రహించాడు. విష్ణుచిత్తాళ్వారు, ఆయన దేవేరి ధారపోయగా కన్యకా రత్నమైన గోదాదేవిని పరిగ్రహించాడు. తర్వాత వేల్పు పెద్దలు బంగారు నీటి చిత్రాలు మెరవగా ముత్యాలు కూర్చబడ్డ నల్లని అంచులు గల పెద్ద తెరపట్టి,



లగ్నం సమాసన్నంకాగా బ్రహ్మాది వేల్పులు ఆ తెరను కిందికి దించేశారు. వధూవరులైన గోదా శ్రీరంగనాథులు ఉప్పొంగుతున్న ప్రీతితో, కనుల తళతళలు చిర్రుముర్రాడగా ఆసక్తితో ఒకరి శిరంపై మరొకరు జీలకర్ర బెల్లం ఉంచుకున్నారు.

అనంతరం శ్రీరంగనాథుని శిరస్సుపై గోదాదేవి ముత్యాల తలంబ్రాలు పోసేటప్పుడు మెరిసే ఆమె చిగుళ్లలాంటి వ్రేళ్ల స్పర్శకు చక్రి చెమర్చగా ఆతని దేహం నుండి స్వేదబిందువులు దట్టంగారాలాయి. ఆ దృశ్యం ఎలా ఒప్పిందంటే, స్వామి స్వేదబిందువులు మేఘంనుండి జారిపడే వర్షధారలలాగా, తలంబ్రాలమణులు వడగండ్లులాగా ఒప్పారాయి.

గోదాదేవి దోసిలితో తలంబ్రాలు ఎత్తిపోసేటప్పుడు శ్రీరంగనాథస్వామి ఆమెను ఓరగా చూస్తుండడాన్ని గమనించిన గోదాదేవి సిగ్గుతో బాహువులుస్వామి శిరస్సు మీదికి ఎత్తకుండానే చేతులతోనే తలంబ్రాలు పైకి ఎగరజల్లింది.

హరి గోదాదేవి గళంలో మంగళసూత్రం కట్టగా ఆమె శరీరంలో పులకలు పొటమరించాయి. సతి అయిన గోదాదేవి, పతి అయిన హరి ఒకరి మణికట్లకు మరొకరు కంకణాలు కట్టారు.

హరి గోదాదేవితో లాజలతో (పేలాల్తో) హోమంవేల్పించి సప్తపదుల్ని నడిపించాడు. ఆమెతో కూడి అరుంధతీ దర్శనం చేశాడు. దేవతలు చదివించిన కట్నాల్ని దయతో స్వీకరించి వారిని తన అనుగ్రహానికి పాత్రుల్ని జేసి వారి వారి నివాసాలకు పంపాడు. గోదాదేవిని తోడుకుని శ్రీరంగానికి విజయం చేశాడు. కావేరీనదీతీరం ఉద్యానవనాల్లోని చందన వృక్షాల పొదలనీడల్లో నీలవేణి అయిన గోదాదేవిని ఉపలాలనలు చేసి, మన్మథ సామ్రాజ్యం ఏలించాడు. తన చిత్తంలో కరుణప్రసరించగా లోకాల్ని ఏలుతూ ఉన్నాడు.

# ఇలా చేద్దాం! నిరుత్సాహాన్ని తొలగించుకుందాం!!

-బ్రహ్మశ్రీ, డా॥మైలవరపు శ్రీనివాసరావు

ఏదో ఒక గొప్పదనం తనలో దాగి ఉంటే అలాంటి రోజుని పర్వదినం అన్నారు పెద్దలు. మరి అదే పండుగరోజులో ఎన్నెన్నో రహస్యాలు దాగుంటే మరి ఆ రోజు ఎంతెంత గొప్ప దౌతుందో కదా! ఈ దృష్టితో నేటి ఏకాదశిని 'పుత్రద ఏకాదశి- ముక్కోటిఏకాదశి, వైకుంఠఏకాదశి, ఉత్తరద్వారదర్శన ఏకాదశి' అని ఇన్నివిధాలుగా ఎందుకు వ్యవహరించారో క్రమంగా అనుకుందాం!

మనకి నరకాలు 14 ఉన్నాయి. వాటిలో ఒక నరకం పేరు 'పుత్' అని. అలాంటి 'పుత్' అనే పేరు ఉన్న నరకంలో పడకుండా 'త్ర' రక్షించగల శక్తి ఉన్నవాడు. పుత్+త్రుడు= వ్యాకరణసూత్రం ప్రకారం 'త్' పొల్లు లోపించి 'పుత్రుడు' అని అవుతుంది. పుత్రుడు తన తల్లిదండ్రుల్ని నరకబాధనుండి రక్షించగలవాడెలా అవుతా'డనే అనుమానం మనకు వస్తుంది. తల్లిదండ్రులు గతించాక అంత్యక్రియల దగ్గర్నుండి తాను గతించేవరకూ తానూ, తన తర్వాత తాను చూపించిన మార్గంలో అతని పుత్రులూ ఈ పద్ధతినీ, సంప్రదాయాన్నీ పాటిస్తూ పెద్దలకి శ్రాద్ధాలని పెడుతూ వాళ్లకు ఉత్తమగతుల్ని ఏర్పాటు చేస్తారు. కాబట్టి పుత్రుడు గొప్పవాడే కదా!

మరి అంతటి పుత్రుడు కావాలంటే ఎలా? ఇదుగో! ఈ ఏకాదశిని ప్రారంభించి ఈ సంవత్సరంలో వచ్చే మరో 23 ఏకాదశులనీ క్రమంగా ఓ వ్రతంగా భావించి చేస్తానని మొక్కుకుని అలా చేసినపక్షంలో ఈ ఏకాదశి 'పుత్ర+ద+ఏకాదశి' అవుతుంది మనకు. శ్రీమహావిష్ణువుకు అష్టోత్తరశతనామపూజని చేసి శ్రీవిష్ణుసహస్ర నామాన్ని చదివి లక్ష్మీనారాయణులకు పాయసాన్ని నైవేద్యంగా పెడితే చాలు ఏకాదశీపూజని ముగించినట్టే. ఇంకా విశేషంగా ఉపవసించి చేసే ప్రక్రియ కూడా ఉంది. అయినా, భగవంతుడు కనికరం కలవాడు కాబట్టి ఇంత మాత్రానికైనాసరే ఆనంద పడతాడు.

**జనవరి 2వ తేది వైకుంఠ ఏకాదశి సందర్భంగా..**

## ముక్కోటి ఏకాదశి

ముక్కోటిదేవతలూ శ్రీమహావిష్ణువును ఆరాధించేందుకు వచ్చే ఏకాదశి కాబట్టి దీన్ని 'ముక్కోటి ఏకాదశి' అంటారనే ఓ కథ లోకంలో ప్రచారంలో ఉంది. నిజానికి ఇది యోగ విభాగానికి సంబంధించిన మాట.

మన ముక్కుకుండే కుడిరంధ్రం పేరు పింగళ. ఎడమ ముక్కురంధ్రం పేరు ఇడ. ఈ రెండూ ఏటవాలుగా వెళ్తూ వెళ్తూ ఆ రెండూ ఒకటికొకటి తాకుకునే ప్రదేశం సరిగ్గా మన రెండు కనుబొమల మధ్య ప్రదేశం.

ఈ రెంటి కలయికలోనికీ మరోనాడి (సుషుమ్న) మనశరీరంలోని వెన్నెముక చివరినుండి పైపైకి ప్రకాశిస్తూ అతిసూక్ష్మంగా ఉంటూ ప్రవేశిస్తుంది. అలా ఆ మూడు నాడులూ కలిసే చోటు ఈ భ్రూమధ్యం (కనుబొమల మధ్య ప్రదేశం).

ఇలా మూడూ కలిపిన ప్రదేశం అతిపవిత్రం కాబట్టే బొట్టుని అక్కడే పెట్టాలంటూ చెప్పారు పెద్దలు.


అంతేకాదు, యోగసాధన చేసే వ్యక్తి తాను ఏ దైవాన్ని ప్రసన్నం చేసుకోవాలని భావిస్తున్నాడో ఆ యోగి, ఈ ముక్కోటి (మూడునాడులూ కలిసినచోటు)లో ఆ దైవాన్ని నిలుపుకుని ధ్యానించి ఫలితాన్ని సాధించగలిగిన ఏకాదశి కాబట్టి ఈ రోజు 'ముక్కోటిఏకాదశి' అయింది.

శిరసునుండి కంఠం వరకూ, కంఠం నుండి కటిభాగం వరకూ, అక్కడినుండి పాదాలవరకూ మొత్తం మూడు విభాగాలున్నాయి శరీరంలో యోగశాస్త్రం ప్రకారం. ఆ మూడింటినీ కూడా శక్తిమంతం చేయగల ఏకాదశి కూడా ఇదే. ఇలా మరో రెండు విశేషాలు కూడా ఉన్న ఏకాదశి ఇదే.

## వైకుంఠఏకాదశిరోజు...

'కుంఠ'మనే పదానికి మొక్కపోవడం అని అర్థం. శ్రీమహావిష్ణువు వికుంఠం చేయగలిగినవాడు. అంటే మనలో ఉన్న అరిషడ్వర్గాలను పూర్తిగా నిర్వీర్యం చేయగలిగిన శక్తి కలవాడు.

ఆ కారణంగా ఆయనను ఈ ఏకాదశిరోజున రోజంతా హృదయంలో ధ్యానిస్తే కామక్రోధాదుల తీవ్రతనీ, వాటివల్ల మనం నష్టపోతున్న విధానాన్నీ తొలగించగలడన్నమాట. అంతటి శక్తిమంతమైన రోజు ఇది అని చెప్పడం దీని భావం.



'ఉత్తరద్వారదర్శనం' అంటే ఉత్తరంగా ఉండే రెండు రెక్కలున్న తలుపుని తెరిచి ఆ లోపల ఉండే దైవాన్ని దర్శించడం అనేది పై అర్థం. ఇంత మాత్రమే చెప్తే ఏమాత్రమూ అర్థం కాదు కాబట్టి వివరంగా తెలుసుకుందాం!

శరీరానికి తూర్పుభాగం ముఖం. అందుకే తూర్పున ఉదయించే సూర్యునికి సంకేతంగా ముఖానికి బొట్టు పెడతాం. శరీరానికి దక్షిణం పాదాల కిందిభాగం. అందుకే అతి ముఖ్యమైన కార్యక్రమాలన్నిటినీ దక్షిణంవైపు తిరక్కుండా ఉండేలా చూసుకుని చేస్తాం. శరీరానికి పశ్చిమం వీపుభాగం. అందుకే వెన్నుని చూపడమంటే పరాజయం (ఓటమి) కలిగిందని అంగీకరించడమే అని అర్థం.

ఈ ధోరణిలో శరీరానికి ఉత్తరం శిరోభాగం(తల). ఆ శిరస్సులో ద్వి+అర(వ్యాకరణసూత్రం ప్రకారం) అనేది 'ద్వార' అవుతుంది. మన శరీరంలో నవ (9) రంధ్రాలే ఉన్నాయనేది మన భావన. అయితే శిరస్సులో రెండు తలుపులతో ఉన్న ఒక భాగం ఉంది. ఆ ద్వారాలు రెంటినీ తెరిస్తే ఆ లోపల కన్పిస్తాడు దైవం. ఈ శరీరానికి ఉత్తరభాగమైన శిరస్సులో ఉన్న రెండు రెక్కల్నీ (తలుపులనీ) తెరిచి ఆ దైవాన్ని దర్శించడమేదుందో అదే 'ఉత్తరద్వారదర్శన'మంటే.

## ఉత్తరదిక్కు గొప్పతనం

ఏదైనా ఓ పని విజయవంతంగా ముగియాలంటే ఉత్తరానికి నాలుగడుగులు వేసి ఆమీదట మనం వెళ్లాల్సిన దిక్కుకి వెళ్లాలంది ధర్మశాస్త్రం.

రాజసూయయాగాన్ని చేయడానికి తగినంత ధనం ధర్మరాజుకు అవసరమైన కాలంలో అర్జునుడు ఉత్తర కురుభూముల వద్దకు వెళ్లి అక్కడ దాచి ఉన్న సంపదని తెచ్చి అన్నకు అందించాడు.

దేశానికి ఉత్తరాన ఉన్న అయోధ్య గొప్పది. శరీరంలో కూడా నడుముకు కిందిదైన భాగం దక్షిణం. అందుకే వడ్డాణం తర్వాత కింది భాగానికంతకీ వెండి ఆభరణాలనే ధరించాలి.

నడుముకి పైభాగాన అంటే వడ్డాణంతో సహా అన్ని ఆభరణాలను బంగారపు వాటినే ధరించాలి. అది శరీరానికి ఉత్తరం కాబట్టి. ఇలా ఎన్నెన్నో గొప్పదనాలున్నాయి ఉత్తరానికి. అనారోగ్యం, ధనం లేనితనం, కుటుంబపరిస్థితులు వంటివి ఏమీ అడ్డురాని దర్శనం ఇది! ఇలా చేద్దాం! నిరుత్సాహాన్ని తొలగించుకుందాం! భగవంతుని ఆశీస్సుల్ని పొందుదాం!

108 దివ్యదేశాలు

# తిరుప్పుళ్ళం బూదంగుడి

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్

కుంభకోణం నుండి స్వామిమలైకి 9 కి.మీ. దూరం, స్వామిమలై నుంచి 7 కి.మీ. దూరంలో ఈ దివ్యదేశముంది.

## స్థలపురాణం

రావణుడి బారి నుండి సీతాదేవిని కాపాడాలనే ప్రయత్నంలో గాయపడ్డ జటాయువు, ఈ విషయాన్ని శ్రీరామ చంద్రుడికి తెలపాలని ప్రాణాలతోనే ఉన్నాడు. సీతాన్వేషణలో ఇక్కడకు వచ్చిన దాశరథికి జటాయువు జరిగిన వృత్తాంతాన్ని రామచంద్రుడికి విన్నవించి ప్రాణాల్ని విడిచాడు. రామభద్రుడు తన తండ్రి దశరథునికి అంతిమసంస్కారం చేయనటువంటి ఆ కొరతను తన తండ్రికి సఖుడైన జటాయువుకు చేసి ఆ కొరతను తీర్చుకున్నాడు.

ధర్మశాస్త్రాల ప్రకారం ధర్మపత్ని లేకుండా సంస్కారాలు చేయకూడదు. సీతాదేవిని రావణుడు అపహరించడం వల్ల బూదంగుడి పుష్కరిణినుండి భూమాదేవి ఉద్భవించి ఈ కైంకర్యాన్ని నెరవేర్చిందని స్థలపురాణం.

కనుక పుళ్ళం బూదంగుడి అనే ఈ నామం పుళ్ అంటే పక్షికి పేరు. అంటే ఇక్కడ జటాయువు. బూదం అంటే పాంచభౌతికమైన శరీరం. ఆ పాంచభౌతిక జటాయువు శరీరానికి చేయాల్సినటువంటి ఆ కైంకర్యాలను చేసిన దేవదేవుడు వేంచేసి ఉన్నదివ్యస్థలమే ఈ తిరుప్పుళ్లం బూదంగుడి.

సీతమ్మను వెతికి వెతికి అలసిసొలసిన శ్రీరామభద్రుడు విశ్రాంతి తీసుకున్న ప్రదేశం, అది కూడా శయనమూర్తిగా, ఉన్నటువంటి ప్రదేశమే ఈ తిరుప్పుళ్లం బూదంగుడి. ఉత్తర భారతదేశంలో గయాశ్రాద్ధం పితృకైంకర్యాలకు ఎంత ప్రసిద్ధమో



### భక్తులకోసం సంక్షిప్తంగా...

**స్వామివారు**

మూలవరులు : వల్విలి రాములు

ఉత్సవమూర్తులు: వల్విలి రాములు

**అమ్మవారు**

మూలవరులు : పొత్తామరైయాళ్

ఉత్సవమూర్తులు: హేమాంబుజవల్లి

**పుష్కరిణి-** గృథస్నానం (లేక) జటాయుతీర్థం

**విమానం-** శోభనవిమానం

**ప్రత్యక్షం-** జటాయువుకు


**ముఖం/ స్థితి-** తూర్పు/ భుజంగశయనం

**మంగళాశాసనం చేసినవారు-** తిరుమంగైయాళ్వార్

**ఆలయంలో ఉన్న పరివార దేవతలు-** యోగనరసింహుడు కృష్ణుడు, గరుడుడు



అదే ప్రకారం ఈ తిరుపుళ్లం బూదంగుడి దివ్యదేశం కూడా అంతేప్రసిద్ధం. ఇక్కడొక విశేషమేమిటంటే తిరుమంగైయాళ్వార్ పలు దివ్యదేశాలను సేవించుకుంటూ ఈ దివ్యదేశానికి వచ్చారు. అక్కడ ఉత్సవమూర్తిని చూసి చూడనట్టు వెళ్లిపోయారట. ఇక్కడ ఆళ్వారులేమో నాలుగుభుజాలతో స్వామి వేంచేసి ఉన్నట్టు భావించారు. కానీ ఇక్కడ రెండుభుజాలతో ఉన్నారు కదా అని అలా వెళ్లిపోయారట.



తిరుమంగైయాళ్వార్లు వెనుతిరిగి వెళ్లిపోయే సందర్భంలో వెనకాల నుండి ఒక పెద్ద జ్యోతస్సు వ్యాపించిందట. ఆళ్వారులు ఆ జ్యోతిస్సుని చూచి ఏమి అర్థం కాకుండా అలాగే దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆ సమయంలో తన ఆయుధాలతో ప్రకాశమానమైన ఒక దివ్యమంగళవిగ్రహాన్ని ఆళ్వార్లు దర్శించారట. సాక్షాత్తు దేవదేవుడు ఈ ఆళ్వార్లకు దర్శనభాగ్యాన్ని ఇలా కలిగించాడు. ఆళ్వారులు ఎంతో పరవశించి ఇలాంటి భగవంతుణ్ణి సేవించకుండా వెళ్లిపోవడానికి సిద్ధమయ్యామే అని బాధపడ్డారట. అందువల్ల అత్యద్భుతమైన దర్శనభాగ్యాన్ని కలిగించి తనను అనుగ్రహించిన ఆ చతుర్భుజరాముణ్ణి ఆళ్వార్లు పదిపాశురాలతో కీర్తించారు.

హేమాంబుజ వల్లి నాయకాసమేతుడైన రామభద్రుణ్ణి సేవించుకుంటారో వాళ్లకు విశేషంగా పితృఋణం తీరుతుంది, సత్సంతానం కలుగుతుంది, సరైన సమయంలో వివాహం కూడా కలుగుతుంది. వేదాంతదేశికులవారు ఈ స్వామివారిపైన 'పరమార్థస్తుతి' అనే స్తోత్రాన్ని కూడా అనుగ్రహించారు. హేమాంబుజవల్లి నాయికా సమేతుడైన ఈ రామభద్రుణ్ణి సేవించుకొని అందరం కూడా తరిద్దాం.

## త్వరలో.. నూతన ధారావాహిక ప్రారంభం!

మాతృశ్రీ తరిగొండ వేంగమాంబ రచించిన **శ్రీవేంకటాచల మాహాత్మ్యము** పద్యకావ్యం చాలా విశిష్టరచన.



శ్రీవేంకటాచల క్షేత్రమహిమను, శ్రీవేంకటేశ్వరస్వామి పవిత్రగాథను ఆస్తిక లోకానికి విశేషంగా ప్రచారం చేసిన రచన ఇది. ఆరుఆశ్వాసాలు కలిగిన ఈ పద్యకావ్యాన్ని సరళ వచనంలో, తేటతెలుగులో, పాఠకులను అలరించే శైలిలో ధారావాహికగా అందించబోతున్నాం!

రచన– ఆచార్య కె.సర్వోత్తమరావు.
వీరు బహుభాషావేత్త,
బహుగ్రంథకర్త.

# లోక దీపం!

– డా॥ కప్పగంతు రామకృష్ణ,
90320 44115

కంటికి కనిపించే సకలప్రపంచాన్ని తన తేజస్సు ద్వారా నడిపించే దైవం సూర్యభగవానుడు. అదిత్యుడు, భానుడు, మిత్రుడు... ఇలా ఎన్నో పేర్లతో పూజలందుకుంటూ, మనలోని అజ్ఞానతిమిరాల్ని తనకిరణాలద్వారా దహింపజేస్తూ, జ్ఞానజ్యోతులను ప్రకాశింపజేసే దైవం శ్రీసూర్యనారాయణమూర్తి. తరు, పశు, పక్ష్యాదులతో సహా ఏ జీవి చైతన్యంగా ఉండాలన్నా అందుకు ఆదిత్యుని అనుగ్రహం తప్పనిసరి.

సమస్తలోకాలకు కర్మసాక్షి సూర్యభగవానుడు. అనంత శక్తితో కూడిన కిరణాలతో లోకాలన్నిటికీ వెలుగును, తేజస్సును ప్రసాదించే జ్యోతిస్స్వరూపుడు. అన్ని ఐశ్వర్యాలకన్నా పర మోన్నతమైన ఆరోగ్యభాగ్యాన్ని వరప్రసాదంగా భక్తులకు అనుగ్రహించే కరుణామూర్తి. అందుకనే, ఆదిత్యోపాసన సర్వోన్నతమైంది.

సూర్యోపాసన చేసి, సూర్యశతకాన్ని రచించిన పుణ్యం చేత మయూరుడనే కవి కుష్ఠువ్యాధి నుంచి విముక్తుడయ్యాడు. ఆదిత్యహృదయాన్ని పారాయణ చేసిన ఫలితంగా శ్రీరామచంద్రమూర్తి రావణాసురుణ్ణి సంహరించాడు.

సూర్యగ్రహగమనాన్ని బట్టే ఋతువులు, ఉత్తర, దక్షిణాయనాలు ఏర్పడతాయి. ఆధునిక విజ్ఞానశాస్త్రం కూడా సూర్యుడి నుంచి వచ్చే వేడి వల్ల సముద్రాలు, నదుల్లోని నీరు ఆవిరవుతుందని, ఆ ఆవిరి మేఘాలుగా మారి, వర్షించటం వల్ల సకలప్రాణికోటి త్రాగటానికి మంచి నీరు, పంటలు పండటానికి తగిన నీరు లభిస్తోందని చెబుతోంది. ఈవిధంగా చూసినా అఖండ భూమండలం మీద సకల ప్రాణులకు జీవనాధారుడు సూర్యుడే అని స్పష్టమవుతోంది.

మాఘశుద్ధసప్తమి – రథసప్తమిగా లోకప్రసిద్ధి పొందిన పర్వదినం. సూర్యోపాసకులకు ఈ రోజు ఎంతో పవిత్రమైంది. దక్షిణదిక్కును వదలి, సూర్యభగవానుడు ఉత్తరదిశకు తన ప్రయాణాన్ని మార్చుకునే రోజు ఇది. ఈ రోజు నుంచి పగటి కాలం ఎక్కువగా ఉంటుంది. లౌకికంగా చూస్తే వేసవి ప్రారంభమయ్యేది కూడా ఈ రోజే.

రథసప్తమికే సూర్యజయంతి అని కూడా పేరు. సూర్యునికి సంబంధించి అనేక సప్తమీవ్రతాలు ఉన్నాయి. కల్యాణసప్తమి, మహాసప్తమి, కమలసప్తమి, రథాంకసప్తమి, జయాసప్తమి, మార్తాండసప్తమి మొదలైనవి. వీటన్నిటిలో మాఘ శుద్ధసప్తమి రోజున వచ్చే రథసప్తమికి ఎంతో ప్రాధాన్యత ఉంది.

ఈ రోజున చేసే స్నాన, ధ్యాన, నమస్కారాది క్రియలు శారీరక అనారోగ్యాలను దూరం చేయటంతో పాటు మానసిక ప్రవృత్తులను కూడా సక్రమమార్గంలోకి మళ్లిస్తాయి. ఆనందం, ఆరోగ్యం, తేజస్సు, విజయం రథసప్తమీ ఫలితాలుగా భక్తులకు అందుతాయి.

## రథసప్తమి- ఆచార సంప్రదాయాలు

రథసప్తమి రోజున ఏడు జిల్లేడు ఆకులు, ఏడు రేగు కాయలను తల, భుజాలు తదితరప్రదేశాల్లో ఉంచుకుని,

జననీత్వంహి లోకానం సప్తమీ సప్త సప్తికే ।
సప్తమ్యా హ్యదిత్ర దేవి నమస్తే సూర్యమాతృకే ॥

– అనే శ్లోకాన్ని పఠిస్తూ స్నానం చేయాలి.

ఆ తర్వాత, తులసి కోట వద్ద ఆవుపేడతో అలికి, పసుపుకుంకుమలతో అలంకరించిన ముగ్గుల మీద గొబ్బి పిడకలను కుంపటిగా అమర్చి, దాని మీద పసుపుతో అలంకరించిన కొత్త గిన్నె పెట్టి, అందులో ఆవుపాలతో పొంగలి వండాలి. ఈ క్రమంలో పాలను మూడుసార్లు పొంగనివ్వాలి. పొంగలి వండిన తర్వాత, చిక్కుడు గింజలను రథాకారంలో గుచ్చి, తులసికోట ముందు వేసిన ముగ్గుపై ఆ రథాన్ని ఉంచి,



జనవరి, 28 రథసప్తమి సందర్భంగా...

ఆ రథం మీదకు సూర్యదేవుణ్ణి ఆవాహన చేసి, రథం ముందు పదిహేను చిక్కుడు ఆకులు పరచి, వాటిలో ఇంతకుముందు వండిన పొంగలి పెట్టి, వీటిలో ఐదు ఆకులు అగ్నిదేవునికి, ఐదు ఆకులు తులసీమాతకు, ఐదు ఆకులు సూర్యభగవానునికి నివేదన పెట్టాలి. ఆదిత్య సంబంధమైన స్తోత్రాలు, అష్టకాలు పారాయణ చేయాలి. సమంత్రకంగా, షోడశ ఉపచారాలతో ఆదిత్యునికి అర్చనలు చేయాలి.

ఈ పూజల్లో అనేక ప్రాంత, ఆచార భేదాలు కనిపిస్తాయి. కొందరు ఏడు, తొమ్మిది ఆకుల్లో నివేదన పెడతారు. కొన్ని ప్రాంతాల్లో వేకువజామునే నిద్రలేచి, దగ్గరలో ఉన్న నది లేదా చెరువుకు వెళ్లి, చెరకుగడతో అందులోని నీటిని కదిపి, ఆ తర్వాత శాస్త్రోక్తంగా స్నానం చేస్తారు. మరికొన్ని ఆచారాల్లో, ఇంటి వద్దనే స్నానం చేసి, దీపాన్ని వెలిగించి, ఆ దీపాన్ని శక్తిని అనుసరించి వెండి, బంగారం లేదా రాగి పాత్రలో ఉంచి, ఆ పాత్రను శిరసున పెట్టుకుని నదికి వెళ్తారు. నదీమాతను ధ్యానించి, దీపాన్ని నీటిలో వదులుతారు.




యద్యజ్జన్మకృతం పాపం మయా సప్తసు జన్మసు
తన్మే రోగం చ శోకం చ మాకరీ హంతు సప్తమీ

ఏతజ్జన్మ కృతం పాపం
యచ్చ జ్ఞాతాజ్ఞాతే చ యే పునః
ఇతి సప్తవిధం పాపం
స్నానాన్మే సప్త సప్తికే
సప్తవ్యాధి సమాయుక్తం
హర సప్తమి మే హర ॥

ఏతన్మంత్రమయం జప్త్వా
స్నాత్వా పాదోదకే నరః
కేశవాదిత్య మాలోక్య
క్షణాన్నిష్కల్మషో భవేత్ ॥

రథసప్తమి రోజున ఈ శ్లోకాన్ని పఠిస్తూ, శాస్త్రవిధిగా స్నానం చేయాలి. ఫలితంగా ఏడుజన్మల్లో చేసిన పాపాలు నశిస్తాయి.

ధర్మసింధువు ప్రకారం రథసప్తమికి ముందురోజు అంటే షష్ఠి రోజున ఉపవాసం ఉండి, మర్నాడు శాస్త్రోక్తరీతిలో స్నానం చేసి, సప్తమీవ్రతం చేస్తే ఏడు జన్మలపాపం నశిస్తుంది. రథసప్తమీవ్రతాన్ని చేయటం వల్ల శారీరక రోగాలతో పాటు, ప్రస్తుత, గత జన్మల్లోని పాపాలు నశిస్తాయని వ్రత చూడామణి చెబుతోంది. మనుస్మృతి ప్రకారం సూర్యారాధన వల్ల శారీరక రోగాలన్నీ నశించి, ఉత్తమమైన ఆరోగ్యం కలుగుతుంది.

జాతకం ప్రకారం సూర్యగ్రహ దోషం ఉన్నవారు, ఉదర, నేత్ర, దంత, ఉష్ణదోషాలు ఉన్నవారు కెంపు, మాణిక్యంవంటి ఎర్రనిరత్నాలు, ఎర్రని పుష్పాలతో (కమలాలు) సూర్యదేవుని పూజించి, యథాశక్తిగా సూర్యదేవుని బంగారు/ వెండిప్రతిమను దానం చేయాలి. ఫలితంగా సకలదోషనివారణ జరుగుతుంది.

రథసప్తమి, ఆదివారం కలిసివస్తే, అది మరింత విశేషఫలితాలను కలిగిస్తుందని, ఆ రోజు చేసే అర్చన ఫలితంగా అపమృత్యుభయం తొలగుతుందని స్కాందపురాణం చెబుతోంది.

జిల్లేడుఆకులు, బదరీఫలాలు, గరికపోచలు, చందనంతో కలసిన అక్షతలు తీసుకుని, సమంత్రకంగా సూర్యభగవానుడికి అర్ఘ్యం ఇవ్వాలని, ఆ తర్వాత నువ్వులపిండితో చేసిన అప్పాలు నివేదన చేయాలని, అనంతరం శక్తిని అనుసరించి బ్రాహ్మణులకు దానాలు ఇవ్వాలని నిర్ణయ సింధువు చెబుతోంది.

ఈ విధమైన ఆధ్యాత్మిక విశేషాలతో పాటు ఎన్నో ఖగోళపరమైన విశేషాలు కూడా రథసప్తమి వ్రతాచరణలో అంతర్లీనంగా కనిపిస్తాయి. రథసప్తమి కేవలం పర్వదినం మాత్రమే కాదు, అనంతమైన కాల గమనంలో జరిగే ఖగోళంలోని మార్పులకు సంకేతం. గ్రహ గమనాలు, ప్రత్యేకించి సూర్య గ్రహగమనం మారుతోందని, ఇందుకు అనుగుణంగా జీవన విధానాన్ని మార్పు చేసుకోవాలనే సందేశాన్ని రథసప్తమి అందిస్తుంది. మానవజీవితం ప్రకృతి అధీనమని, ప్రకృతిని ఆశ్రయించాలే కానీ ఆక్రమించ కూడదనే జాగృతిని ఈ పండుగ కలిగిస్తుంది.

## సూర్యోపాసన నియమాలు

- సూర్యోపాసన చేసేవారు ప్రతి ఆదివారం తప్పనిసరిగా కొన్ని నియమాలను పాటించి తీరాలి. అవేమిటంటే.. మద్యపానం, స్త్రీ సంపర్కం, తైలసంస్కారం విడిచిపెట్టాలి. అసత్యం పలుకకూడదు. కోపం పనికిరాదు. హారాలు ధరించకూడదు. మంచంమీద శయనించకూడదు. బ్రాహ్మణ, గో, మనుష్య, దేవతానింద చెయ్యకూడదు. పరుల ఇంటికి వెళ్లకూడదు.
- సూర్యోపాసన చేసే రోజున, ప్రత్యేకించి ఆదివారంనాడు సూర్యోదయానికి పూర్వమే నిద్రలేచి, కాలకృత్యాలు తీర్చుకుని, ప్రవాహాలు, చెరువులు లేదా కోనేరుల్లో స్నానం చెయ్యాలి. అనంతరం పరిశుభ్రమైన వస్త్రాలు ధరించి, తిలకం ధరించాలి. సదాచారం పాటించాలి. పూజ, జపం, అర్ఘ్యం, ప్రదక్షిణ, నమస్కారం, స్తోత్రపారాయణ– ఈ ఆరువిధాలుగా సూర్యదేవుణ్ణి అర్చించాలి.
- పూజమధ్యలో లేచి వెళ్లకూడదు. పూజ ప్రారంభం నుంచి చివరివరకు ఇతరులతో మాట్లాడకూడదు. అన్యమనస్కులై ఉండకూడదు. పూజ మధ్యలో ఆవులింత, తుమ్ము, అపానవాయువు వస్తే, ఆచమనం చేసి, మూడుసార్లు గోవిందనామస్మరణ చెయ్యాలి.

## త్రికాలాల్లో సూర్యారాధన




**ప్రాతఃకాలం-** బ్రహ్మముహూర్తంలో సూర్యదండకాన్ని స్మరిస్తూ నిద్రలేచి, కాలోచితకృత్యాలు పూర్తిచేసుకోవాలి. స్నానం, సంధ్యావందనం, నిత్యార్చన పూర్తిచేసుకున్న తర్వాత సూర్య మంత్రాన్ని ఉపాసన చెయ్యాలి. సూర్యతర్పణం అనంతరం తులసికోటలో సూర్యునికి అర్ఘ్యం విడిచిపెట్టాలి. ప్రదక్షిణ నమస్కారాలు చెయ్యాలి.

**మధ్యాహ్నకాలం-** మాధ్యాహ్నిక అర్చనతర్వాత సూర్యనారాయణ స్వామిరూపును లేదా సూర్యసాలగ్రామాన్ని పూజించాలి. మహానివేదన సమర్పించి, ఆదిత్యహృదయం పారాయణ చెయ్యాలి. తీర్థప్రసాదాలు స్వీకరించాలి.

**సాయంకాలం-** నీరెండగా ఉన్న సమయంలో సంధ్యావందనం పూర్తిచేసుకుని, సూర్యభగవానుడికి షోడశోపచారాలతో పూజ చెయ్యాలి. నివేదన చేసి, హారతి సమర్పించాలి. సూర్యాష్టకం, దండకం పారాయణచెయ్యాలి.

# తిరుమల తిరుపతి దేవస్థానములు



## జనవరి 2023

| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | గురువారము | శుక్రవారము | శనివారము |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 15 | 16 | 17 | 18 | 19 | 20 | 21 |
| 22 | 23 | 24 | 25 | 26 | 27 | 28 |
| 29 | 30 | 31 | | | | |

## ఫిబ్రవరి 2023

| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | గురువారము | శుక్రవారము | శనివారము |
|---|---|---|---|---|---|---|
| | | | 1 | 2 | 3 | 4 |
| 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 12 | 13 | 14 | 15 | 16 | 17 | 18 |
| 19 | 20 | 21 | 22 | 23 | 24 | 25 |
| 26 | 27 | 28 | | | | |

## మార్చి 2023

| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | గురువారము | శుక్రవారము | శనివారము |
|---|---|---|---|---|---|---|
| | | | 1 | 2 | 3 | 4 |
| 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 12 | 13 | 14 | 15 | 16 | 17 | 18 |
| 19 | 20 | 21 | 22 | 23 | 24 | 25 |
| 26 | 27 | 28 | 29 | 30 | 31 | |

### జనవరి

01 ఆంగ్లసంవత్సరాది
02 వైకుంఠఏకాదశి
03 శ్రీస్వామి పుష్కరిణితీర్థ ముక్కోటి
07-13 శ్రీఆండాళ్ నీరాట్టోత్సవం
11 శ్రీత్యాగరాజస్వామి ఆరాధన
14 భోగిపండుగ
15 మకర సంక్రాంతి
16 కనుమ, శ్రీ గోదాదేవి పరిణయం
21 శ్రీపురందరదాసు ఆరాధన
22-30 దేవునికడప, శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం
26 వసంతపంచమి, భారతగణతంత్రదినోత్సవం
28 రథసప్తమి, భీష్మాష్టమి

### ఫిబ్రవరి

01 భీష్మఏకాదశి
05 శ్రీ రామకృష్ణతీర్థ ముక్కోటి
11-19 శ్రీనివాసమంగాపురం,
శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం
11-20 తిరుపతి, శ్రీకపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం
18 మహాశివరాత్రి
28 నుండి మార్చి 08 వరకు
తరిగొండ,
శ్రీలక్ష్మీనరసింహస్వామివారి బ్రహ్మోత్సవం

### మార్చి

03-07 తిరుమల శ్రీవారి తెప్పోత్సవం
07 శ్రీ లక్ష్మీజయంతి, శ్రీకుమారధారతీర్థముక్కోటి
18 శ్రీ అన్నమాచార్యవర్ధంతి
20-28 తిరుపతి, శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవం
22 శ్రీ శోభకృత్ నామ సంవత్సర 'ఉగాది'
24 మత్స్యజయంతి
27 నుండి ఏప్రిల్ 04 వరకు
వాయల్పాడు, శ్రీపట్టాభిరామస్వామివారి బ్రహ్మోత్సవం
30 శ్రీరామనవమి
31 నుండి ఏప్రిల్ 08 వరకు
ఒంటిమిట్ట, శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవం

# తిరుమల తిరుపతి దేవస్థానములు



## ఏప్రిల్ 2023

| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | గురువారము | శుక్రవారము | శనివారము |
|---|---|---|---|---|---|---|
| | | | | | | 1 |
| 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 |
| 9 | 10 | 11 | 12 | 13 | 14 | 15 |
| 16 | 17 | 18 | 19 | 20 | 21 | 22 |
| 23 | 24 | 25 | 26 | 27 | 28 | 29 |
| 30 | | | | | | |

## మే 2023

| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | గురువారము | శుక్రవారము | శనివారము |
|---|---|---|---|---|---|---|
| | 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 |
| 14 | 15 | 16 | 17 | 18 | 19 | 20 |
| 21 | 22 | 23 | 24 | 25 | 26 | 27 |
| 28 | 29 | 30 | 31 | | | |

## జూన్ 2023

| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | గురువారము | శుక్రవారము | శనివారము |
|---|---|---|---|---|---|---|
| | | | | 1 | 2 | 3 |
| 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 |
| 11 | 12 | 13 | 14 | 15 | 16 | 17 |
| 18 | 19 | 20 | 21 | 22 | 23 | 24 |
| 25 | 26 | 27 | 28 | 29 | 30 | |

### ఏప్రిల్

03-05 తిరుమల శ్రీవారి వసంతోత్సవం
06 తుంబురుతీర్థ ముక్కోటి
14 తమిళసంవత్సరాది,
డా॥ బి.ఆర్.అంబేద్కర్ జయంతి
22 పరశురామజయంతి,
గంగానది పుష్కర ప్రారంభం
23 అక్షయతృతీయ
25 శ్రీరామానుజ జయంతి, శ్రీ శంకర జయంతి
26 శ్రీరామ జయంతి
29 నుండి మే 01 వరకు
తిరుమల శ్రీపద్మావతీశ్రీనివాసుల పరిణయం

### మే

01 మే డే
02-05 తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి వసంతోత్సవం
04-12 నాగులాపురం శ్రీవేదనారాయణస్వామివారి బ్రహ్మోత్సవం
04 శ్రీనృసింహజయంతి, తరిగొండవెంగమాంబ జయంతి
05 శ్రీకూర్మజయంతి
06 శ్రీఅన్నమాచార్య జయంతి
13-21 కార్వేటినగరం, శ్రీవేణుగోపాలస్వామివారి బ్రహ్మోత్సవం
14 శ్రీహనుమజ్జయంతి
16 తిరుపతి గంగజాతర
26 నుండి జూన్ 03 వరకు
తిరుపతి, శ్రీగోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవం
30 నుండి జూన్ 03 వరకు
తిరుచానూరు శ్రీపద్మావతీఅమ్మవారి తెప్పోత్సవం
31 నుండి జూన్ 08 వరకు
హృషీకేశ్, నారాయణవనం, అప్పలాయగుంట,
శ్రీస్వామివార్ల బ్రహ్మోత్సవాలు

### జూన్

02-04 తిరుమలశ్రీవారి జ్యేష్ఠాభిషేకం
04 ఏరువాక పూర్ణిమ
17 సావిత్రీవ్రతం
20 పూరీజగన్నాథ రథయాత్ర
24-26 శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి
సాక్షాత్కారవైభవం, శ్రీనివాసమంగాపురం
29 తొలిఏకాదశి

# తిరుమల తిరుపతి దేవస్థానములు

## జూలై 2023

| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | గురువారము | శుక్రవారము | శనివారము |
|---|---|---|---|---|---|---|
| | | | | | | 1 |
| 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 |
| 9 | 10 | 11 | 12 | 13 | 14 | 15 |
| 16 | 17 | 18 | 19 | 20 | 21 | 22 |
| 23 | 24 | 25 | 26 | 27 | 28 | 29 |
| 30 | 31 | | | | | |

## ఆగష్టు 2023

| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | గురువారము | శుక్రవారము | శనివారము |
|---|---|---|---|---|---|---|
| | | 1 | 2 | 3 | 4 | 5 |
| 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 13 | 14 | 15 | 16 | 17 | 18 | 19 |
| 20 | 21 | 22 | 23 | 24 | 25 | 26 |
| 27 | 28 | 29 | 30 | 31 | | |

## సెప్టెంబర్ 2023

| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | గురువారము | శుక్రవారము | శనివారము |
|---|---|---|---|---|---|---|
| | | | | | 1 | 2 |
| 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 10 | 11 | 12 | 13 | 14 | 15 | 16 |
| 17 | 18 | 19 | 20 | 21 | 22 | 23 |
| 24 | 25 | 26 | 27 | 28 | 29 | 30 |



### జూలై

03 గురుపూర్ణిమ

05 తిరుపతి శ్రీవిఖనసాచార్యులవారి శాత్తుమొఱ

15 శనిత్రయోదశి

17 తిరుమల శ్రీవారి ఆణివర ఆస్థానం

07-09 తిరుచానూరు, శ్రీ సుందరరాజస్వామివారి అవతారోత్సవం

30 తిరుమల, నారాయణగిరిలో ఛత్రస్థాపన, తులసీమహాత్మ్యం

### ఆగష్టు

09 ఆడికృత్తిక
15 భారతస్వాతంత్ర్యదినోత్సవం
20 నాగచతుర్థి
21 గరుడపంచమి, మంగళగౌరీవ్రతం
25 శ్రీవరలక్ష్మి వ్రతం, తరిగొండవెంగమాంబ వర్థంతి
26-29 తిరుమల శ్రీవారి పవిత్రోత్సవం
30 శ్రావణపూర్ణిమ, శ్రీవిఖనస మహాముని జయంతి
31 శ్రీహయగ్రీవజయంతి, గాయత్రీ జపం

### సెప్టెంబరు

06 శ్రీకృష్ణాష్టమి
07 గోకులాష్టమి
14 పోలాల అమావాస్య
17 శ్రీబలరామ జయంతి, శ్రీవరాహజయంతి
18-26 తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవం
26 శ్రీవామనజయంతి
18 వినాయకచవితి
22 తిరుమల శ్రీవారి గరుడసేవ
26-29 తిరుచానూరు, శ్రీపద్మావతి అమ్మవారి పవిత్రోత్సవం
30 మహాలయపక్ష ప్రారంభం



# తిరుమల తిరుపతి దేవస్థానములు

## అక్టోబర్ 2023

| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | గురువారము | శుక్రవారము | శనివారము |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 15 | 16 | 17 | 18 | 19 | 20 | 21 |
| 22 | 23 | 24 | 25 | 26 | 27 | 28 |
| 29 | 30 | 31 | | | | |

## నవంబర్ 2023

| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | గురువారము | శుక్రవారము | శనివారము |
|---|---|---|---|---|---|---|
| | | | 1 | 2 | 3 | 4 |
| 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 12 | 13 | 14 | 15 | 16 | 17 | 18 |
| 19 | 20 | 21 | 22 | 23 | 24 | 25 |
| 26 | 27 | 28 | 29 | 30 | | |

## డిసెంబర్ 2023

| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | గురువారము | శుక్రవారము | శనివారము |
|---|---|---|---|---|---|---|
| | | | | | 1 | 2 |
| 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 10 | 11 | 12 | 13 | 14 | 15 | 16 |
| 17 | 18 | 19 | 20 | 21 | 22 | 23 |
| 24 | 25 | 26 | 27 | 28 | 29 | 30 |
| 31 | | | | | | |

### అక్టోబరు

02 మహాత్మాగాంధీజయంతి
14 మహాలయ అమావాస్య
15-23 తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవం
15-23 తిరుచానూరు, శ్రీపద్మావతీఅమ్మవారి నవరాత్రి ఉత్సవం
19 తిరుమల శ్రీవారి గరుడసేవ
20 సరస్వతీపూజ
22 దుర్గాష్టమి
23 విజయదశమి
31 అట్లతద్దె

### నవంబరు

10-18 తిరుచానూరు శ్రీపద్మావతీఅమ్మవారి బ్రహ్మోత్సవం
12 నరకచతుర్దశి, దీపావళి అమావాస్య
13 కేదారగౌరీవ్రతం
14 తిరుచానూరు, శ్రీపద్మావతీ అమ్మవారి గజవాహనోత్సవం, బాలలదినోత్సవం
17 నాగులచవితి
18 పంచమీతీర్థం
19 తిరుమల శ్రీవారిపుష్పయాగం, తిరుచానూరు శ్రీపద్మావతీఅమ్మవారిపుష్పయాగం
24 కైశికద్వాదశి, శ్రీ చక్రతీర్థముక్కోటి
26 కార్తిక పూర్ణిమ

### డిసెంబరు

10 శ్రీధన్వంతరి జయంతి
12 తిరుమల శ్రీవారి సన్నిధిన అధ్యయనోత్సవారంభం
17 ధనుర్మాసం ప్రారంభం
23 వైకుంఠ ఏకాదశి, గీతాజయంతి
24 శ్రీస్వామి పుష్కరిణితీర్థముక్కోటి
26 శ్రీదత్తజయంతి
28 తిరుమల శ్రీవారి సన్నిధిన ప్రణయకలహ మహోత్సవం



# తిరుమలలో... అధ్యయనోత్సవం

– డా॥ ఈ.ఏ. శింగరాచార్యులు,
98850 03420

శ్రీవైష్ణవసంప్రదాయం ఉభయ వేదాంతసంప్రదాయం. ఈ సంప్రదాయంలో సంస్కృతవేదానికి, ద్రావిడవేదం అనబడే ఆళ్వారుల దివ్యప్రబంధాలకు సమానమైన ప్రాధాన్యం ఉంది. శ్రీవైష్ణవఆలయాలలో నిత్యారాధనలో కూడా ఈ రెండువేదాలకు సముచితస్థానం ఇవ్వబడింది.

శ్రీవైష్ణవాలయాలలో ద్రావిడవేద ప్రాధాన్యాన్ని తెలియజేసే ఉత్సవమే అధ్యయనోత్సవం. ఇది అన్ని వైష్ణవాలయాలలో నిర్వహింపబడుతుంది. అధ్యయనం అంటే– వేదాన్ని అనుసంధించడం. వేదంతో సమానంగా గౌరవింపబడి ద్రావిడవేదాన్ని అనుసంధించే ఉత్సవం కనుక, దీనికి అధ్యయనోత్సవం అనే పేరు వచ్చింది. సామాన్యంగా, వైకుంఠ ఏకాదశికి ముందు పదిరోజులు, వైకుంఠ ఏకాదశి తరువాత నుండి పది రోజులు, ఆ తరువాత ఒకరోజు మొత్తం 21 రోజులపాటు నిర్వహింపబడే ఉత్సవం ఇది. శ్రీరంగం, తిరుమలవంటి ప్రధానమైన కొన్ని ఆలయాలలో ఈ ఉత్సవదినాలసంఖ్యలో, ఆయాదినాలలో ప్రబంధాలను అనుసంధించే క్రమంలో కొన్ని కొన్ని మార్పులు, విభిన్న సంప్రదాయాలు మనకు కనిపిస్తాయి. వైకుంఠఏకాదశికి ముందు 10 దినాల పాటు జరిగే ఉత్సవం పగటి సమయంలో జరుగుతుంది కనుక పగల్ పత్తు అని, ఆ తరువాత పదిదినాల పాటు జరిగే ఉత్సవం రాత్రివేళ జరుగుతుంది కనుక, రాపత్తు అని వ్యవహరింపబడుతుంది. ఈ అధ్యయనోత్సవానికి సంప్రదాయంలో పెరియతిరునాళ్, అంటే, గొప్ప ఉత్సవం, పెద్ద ఉత్సవం అని పేర్లు.

ఈ అధ్యయనోత్సవాన్ని తిరుమంగైయాళ్వార్లు మొట్టమొదటగా శ్రీరంగక్షేత్రంలో శ్రీరంగనాథుని అనుగ్రహంతో ఆరంభించారు. వైకుంఠఏకాదశి నుండి ఈ ఉత్సవాన్ని ఆరంభించి పదిదినాలు పాటు నిర్వహించారు. నమ్మాళ్వారులు జన్మించిన దివ్యదేశమైన ఆళ్వార్ తిరునగరినుండి నమ్మాళ్వారుల ఉత్సవవిగ్రహాన్ని ఊరేగింపుగా శ్రీరంగానికి తీసుకొనివచ్చి, శ్రీరంగంలో వేంచేపు చేసి, ఈ ఉత్సవాన్ని తిరుమంగైయాళ్వార్లు జరిపించారు. ఈ ఉత్సవంలో నమ్మాళ్వారుల తిరువాయ్‌మొళి ప్రబంధానుసంధానం శ్రీరంగనాథుని ఉత్సవమూర్తి సమక్షంలో చేయబడేది. పదవనాడు తిరువాయ్‌మొళి ప్రబంధం అనుసంధానం పూర్తి అయిన తరువాత, నమ్మాళ్వారుల "తిరువడి తొళుదల్"– భగవంతుని సన్నిధికి చేరడం అనే ఉత్సవం నిర్వహింపబడేది. ఇది భగవంతుడు ఆళ్వారులకు మోక్షాన్ని ఇచ్చిన సందర్భానికి చిహ్నంగా జరుపబడేది.

ఈ ఆళ్వారులకు తరువాత ఈ అధ్యయనోత్సవం నిలిచిపోయింది ఆ తర్వాత నాథమునులు అనే శ్రీవైష్ణవాచార్యులు మళ్లీ ఈ అధ్యయనోత్సవాలను శ్రీరంగంలో ఆరంభించారు. వారి కాలంలో ఈ ఉత్సవాలు వైకుంఠఏకాదశికి ముందు పది రోజులు, తరువాత 11 రోజులు మొత్తం 21 దినాలపాటు జరిగేవి. ఈ క్రమం శ్రీరంగంలోనే కాక మేల్‌కోట్టై, శ్రీవిల్లిపుత్తూర్ మొదలైన ఇంకా కొన్ని క్షేత్రాలలో కూడా కనిపిస్తుంది. క్రమంగా అధ్యయనోత్సవాల నిర్వహణ మిగిలిన శ్రీవైష్ణవాలయాలు అన్నిటిలోనూ ఆరంభింపబడ్డది. తిరుమలలో కూడా ఈ ఉత్సవాలు శ్రీరామానుజులకాలంనుండి జరుగుతున్నాయి.

## తిరుమలలో అధ్యయనోత్సవం

వైకుంఠఏకాదశిముందు వచ్చే అమావాస్యరాత్రి నుండి ఆరంభించి 23 రోజులపాటు ఈ ఉత్సవం జరుగుతుంది. మలయప్పస్వామి తిరుమలలో శ్రీరంగనాయకమండపంలో ఉభయ దేవేరులతో కలసి తూర్పుముఖంగా దివ్యసింహాసనంలో వేంచేసి ఉంటాడు. విష్వక్సేనులు నమ్మాళ్వార్లస్థానంలోను శ్రీరామానుజులు దక్షిణదిక్కుగాను వేంచేసి ఉంటారు. ప్రసాదనివేదన అయిన తరువాత జీయర్‌స్వాములు, అధ్యాపక స్వాములతో కలసి ఈ ఉత్సవ ప్రారంభాన్ని (తొడక్కం) చేస్తారు.



మరునాడు పగల్‌పత్తు మొదటినాడు ఉదయకాలంలో ఇయఱ్పా ప్రబంధంతో ఆరంభమౌతుంది. రాత్రి, తిరుప్పల్లాండు

### వైకుంఠపాళి
### :: 84 - సమాధానాలు ::

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 శ్రీ | రం | 2 గ | నా | 3 ధు | డు | | 4 వా | ణి | | 5 మ |
| గో | | గ | | ని | | 6 ర | జి | | | క |
| 7 దా | వా | న | లం | | 8 క | వి | | 9 క | | ర |
| దే | | ము | | 10 పౌ | లం | | 11 ధ | ను | ర్మా | సం |
| 12 వి | 13 శ్వ | | 14 పిం | డం | | 15 సం | | ము | | క్ర |
| | న | | డి | | 16 వి | క్రాం | తి | | 17 హే | మ |
| 18 పౌం | | 19 స్ర | వం | తి | | తి | | 20 ము | | ణం |
| 21 గ | తి | | ట | | 22 చే | | 23 సి | గ్గు | లు | |
| లి | | | లు | | మం | | | లు | | 24 భో |
| | | 25 అ | | 26 బం | తు | లు | | | | గి |
| 27 గొ | బ్బె | మ్మ | లు | | లు | | 28 అ | రి | సె | |


నుండి ఆరంభించి, పదిరోజులపాటు ముదలాయిరం, పెరియ తిరుమొళి అనే రెండుభాగాల అనుసంధానం జరుగుతుంది. పదవనాడు తిరునెడుందాండకమ్ ప్రబంధం అనుసంధానంతో పూర్తి అవుతుంది. ఇది సంగ్రహంగా పగల్‌పత్తు ఉత్సవం.

ఆ మరునాడు రాపత్తు ఉత్సవం ప్రారంభమౌతుంది. ఒక్కొక్కరోజు రాత్రి తిరువాయ్‌మొళి ప్రబంధంలోని ఒక్కొక్క శతకం అనుసంధింపబడుతుంది. పదవనాటి రాత్రి ఆ ప్రబంధం పూర్తి చేయబడుతుంది. మరునాడు మధురకవి ఆళ్వారుల కణ్ణినుణ్ శిఱుత్తాంబు ప్రబంధం, ఆ మరునాడు రామానుజ నూత్తందాది, ఉపదేశ రత్తినమాలై, ప్రబంధాలు, ఇయల్ శాతు, వాళి తిరునామాలు అనుసంధింపబడతాయి. ఈ విధంగా 23 రోజులపాటు ఈ ఉత్సవం జరుగుతుంది. మరునాడు శ్రీవరాహస్వామి కోవెలలో అధ్యయనోత్సవం కోయిల్ తిరువాయ్‌మొళి క్రమంలో ఒకరోజుమాత్రం జరుగుతుంది.

తరువాత, శ్రీరామానుజులు తిరుమామణి మండపానికి ప్రదక్షిణంగా వేంచేసి వచ్చిన తరువాత, మూలమూర్తికి అభిముఖంగా గరుడమండపంలో ద్వారపాలకులదగ్గర వేంచేసి ఉండగా, వారికి పరివట్టం, శేషమాల, శేషవస్త్రం ప్రసాదం, శ్రీశఠకోపం మొదలైన బహుమానాలు ఇవ్వబడతాయి. తిరుమలలో ధర్మకర్త శ్రీరామానుజులే కనుక, ఈ ఉత్సవాలను జరిపించినందుకు గౌరవంగా వారికి ఈ సన్మానం చేయబడుతుంది. ఇంతటితో అధ్యయనోత్సవాలు తిరుమలలో పూర్తి అవుతాయి.



ఆ తరువాత, తిరుపతిలో కూడా శ్రీగోవిందరాజస్వామి సన్నిధిలో, పెద్దజీయర్‌స్వామివారు, చిన్నజీయర్‌స్వామివారి మఠాల్లో కూడా ఈ అధ్యయనోత్సవాలు జరుగుతాయి.




# వ్రతభారతి

- కీ.శే. విద్వాన్,
డా॥ పమిడికాల్వ చెంచుసుబ్బయ్య

ప్రాచీనసంస్కృతీసంప్రదాయాలను నాటికీ నేటికీ నిలబెట్టుకుంటూ ఇతరదేశాలకు మార్గ దర్శకంగా విరాజిల్లుతున్నదేశం భారతదేశం. భాషలువేరైనా, ప్రాంతాలు భిన్నమైనా, వేషంలోనూ, ఆకారంలోనూ తేడాలున్నా పండుగలు, పబ్బాలు జరుపుకోవడంలో చెప్పుకోదగ్గ వైరుధ్యాలు కనిపించవు. వాటిలో **'వ్రతాల పాలన'** ఒకటి.

'వ్రత' శబ్దానికి నిఘంటువులు ఉపాసనాది పుణ్యకర్మం, నోము అని అర్థాలిచ్చాయి. వ్రతాలు అనేకరకాలు. చాలా వాటిలో తిథులకే ప్రాధాన్యం. మరికొన్నిట అరుదుగా నక్షత్రానికి కూడా ప్రాధాన్యమే.

దేవతాప్రాధాన్యంబట్టి పరిశీలిస్తే సరస్వతి మూలా నక్షత్రసంజాత. అలాంటి 'సరస్వతీదేవి' అనుగ్రహంకోసం ఆచరింపబడేవ్రతాలు రెండు. మొదటిది శ్రీపంచమి, రెండవది శరన్నవరాత్రులలో జరిపే వ్రతం. సామాన్యులకు చాలవరకు శరదృతువు మూలానక్షత్రంలో అనుసరించే సరస్వతీవ్రత మొక్కటే తెలుసు. అమ్మవారు శరదృతువులో జన్మించడంవల్ల 'శారద' అయిందని ఒక సమర్థనకూడా!

పంచాంగాలలో 'శ్రీపంచమి' అనే పేరుతో ఒక వ్రత నామం చెప్పబడింది. ఈ శ్రీపంచమికే మదనపంచమి, వసంత పంచమి, సరస్వతీజయంతి అనే పేర్లు ఉన్నాయి.

పేరునుబట్టి ఇది ఋతుసంబంధమైన పర్వం. మకర సంక్రాంతికే ఉత్తరాయణం మొదలుకావడం, అప్పటికే వసంత ఋతులక్షణాలు ప్రకృతిలో కనబడడం మనం నేటికీ చూస్తున్నాం. వసంతఋతు సూచనలకు వసంతపంచమి స్వాగతోపచారాలు చేసే పండుగరోజుగా భావించాలి. కనుక రాగల వసంతానికి శిశిరంలో అంటే 'మాఘం'లో ఆచరించే పండుగగా గ్రహించడం సబబు. రాగల వసంతానికి శిశిరంలో చేసే స్వాగతోపచారం ఈ పండుగ. మనం ఆచరించే పండుగలు- పర్వాలకు సంబంధించిన అనేకాంశాలను సూచించేవి బ్రహ్మాండాది పురాణాలు. వాటిలో బ్రహ్మవైవర్త పురాణం, దేవీభాగవతంలో 'వసంతపంచమి' వ్రతం సూచితం. వ్యాసభగవానుడు బ్రహ్మవైవర్తపురాణం ప్రకృతి ఖండం నాల్గవ అధ్యాయంలో - 'అన్ని శక్తులలో ప్రధానమైన శక్తిగల సరస్వతిని వసంత పంచమినాడు' పూజించాలని నిర్దేశించాడు.

ఆలాగే దేవీభాగవతంలో శ్రీనారాయణప్రోక్తంగా చెప్పిన సరస్వతీసూక్తంలో -

**'ప్రతివిశ్వేచ తాం దివ్యాం పూజాం వై గౌరవాన్వితామ్।
మాఘస్య శుక్లపంచమ్యాం విద్యారంభే చ సుందరి!'**

అనే ఉల్లేఖం ఉంది. విశ్వమంతా ఈ వసంతపంచమీ పూజను మాఘశుక్లపంచమినాడు చేస్తారనీ, ఈ వ్రతం ఆచరించే వారు ఉత్తమవిద్యాజ్ఞానవంతులవుతారనీ ఈ శ్లోక భావం.

ఈ భాగవతంలోనే వసంతపంచమీ వ్రతాచరణవిధానం కూడా విస్తారంగా వర్ణితం.

ఉదయవేళల్లో మాఘశుద్ధపంచమినాడు విద్యారంభం చేస్తే చాల మంచిది. ఈ దేవీభాగవతోక్తినిబట్టి ప్రాచీనకాలంలో ఈ పంచమికి ప్రాధాన్యముండేదని గ్రహించవచ్చు. 'ఓం శ్రీం ఐం సరస్వత్యై స్వాహా' అనే సరస్వతీ అష్టాక్షరీమంత్రాన్ని జపించాలని ఈ మంత్రం చదువులకు కల్పవృక్షమని పేర్కొనింది. ఈ మంత్రాన్ని మొదట శ్రీమన్నారాయణుడు వాల్మీకి మహర్షికి చెప్పాడని, తర్వాత భృగువు శుక్రునికీ, ఆస్తీకుడు జరత్కారువుకూ, విభాండకుడు ఋష్యశృంగునికీ, సూర్యుడు యాజ్ఞవల్క్యునికీ, శేషుడు పాణినికీ ఇలా ఎందరెందరో మహాత్ములు - ఎందరికో ఈ సరస్వతీకవచాన్ని ఉపదేశించారు.

## రోజూ చదువుకుందాం..

**తల్లీ! నిన్ను దలంచి పుస్తకము చేతన్ బూనితిన్, నీవు నా యుల్లంబందున నిల్చి, జృంభణముగా ఉక్తుల్ సుశబ్దంబు శో భిల్లం బల్కుము నాదు వాక్కునను సంప్రీతిన్, జగన్మోహినీ! పుల్లాబ్జాక్షి! సరస్వతీ! భగవతీ! పూర్ణేందుబింబాననా!**



**భావం : అమ్మా! సరస్వతీదేవీ! నీ దివ్యవాక్కులతో లోకాన్ని వశీకరించుకుంటావు. నీ నేత్రాలు వికసించిన తామరల వంటివి. నీ సుందరవదనం పున్నమనాటి చంద్రుణ్ణి పోలింది. నీ శక్తి షడ్గుణైశ్వర శోభితం. ఓ వాగ్దేవీ! నిన్ను స్మరిస్తూ- పఠించడానికై పుస్తకాన్ని చేతికి తీసుకున్నాను. పఠనగ్రహణ శక్తులు గల్గి, స్పష్టమైన ఉచ్చారణంతో నా పలుకులు మనోహరాలై ఉండేట్లుగా, నా నాలుకపై నిల్చి, నన్ను ధన్యుణ్ణి చేస్తావని నమ్మి నీకు నమస్కరిస్తున్నాను. నన్ను ప్రీతితో అనుగ్రహించు తల్లీ!**

**విశేషం : సరస్వతి సర్వవిద్యలకూ, సకలవాక్కులకూ అధిష్ఠానదేవత. ఈ దేవిని అందరూ ఉపాసించాల్సిందే! ఈ తల్లిని ప్రార్థించి- చదవడంకానీ, వ్రాయడంకానీ ప్రారంభించడం భారతీయసంప్రదాయం! సరస్వతీదేవీ దయవల్లనే కవిత్వం, సంగీతం, శాస్త్రజ్ఞానం సిద్ధిస్తాయి.**

కవితాశక్తి, వాక్‌శక్తి, బుద్ధిశక్తి మొదలగు మహాశక్తులు సరస్వతీదేవికృపవల్ల సిద్ధిస్తాయి.

'ఈ రోజే సరస్వతీపూజ చేస్తారు. ఉత్తరహిందూస్థానం, బెంగాల్‌లో ఈ పూజ చాల ప్రాముఖ్యం అయింది.

వంగదేశంలో **'వసంతపంచమి'**ని **'శ్రీపంచమీ'** అని అంటారు. ఆబాలగోపాలం ఆ రోజు సరస్వతీపూజ చేస్తారు. పుస్తకాలన్నీ సరస్వతీదేవిదగ్గర ఉంచుతారు. సరస్వతీపూజ చేయనిదే ఆహారం స్వీకరించరు. సరస్వతి సర్వశుక్ల. అమ్మవారు సాత్త్వికగుణానికి గుర్తు. సంగీతసాహిత్య విద్యాస్వరూపిణి కనుక పూజా సందర్భంలో చదువుకు, రాతకు, సంగీతానికి సంబంధించిన వస్తువులన్నీ అమ్మముందు ఉంచి, అమ్మవారిని చక్కగా అలంకరించి పూజిస్తారు. దక్షిణాదిలో ఇటీవలికాలంలో 'శ్రీజయంతి' కూడా పాఠశాలలో జరుపుతున్నారు.

దేవతలందరూ వాగ్దేవీపూజకులే! విశ్వమందలి ప్రతి శబ్దమూ సరస్వతీదేవికి చెందిందే! ఆమె బ్రాహ్మి. ఆమె వేద రూపంలో, పుస్తకరూపంలో ఉంటుంది. కనుక సరస్వతీవ్రతం చేసే రోజున పుస్తకాలు పెట్టి పూజించడం ఒక సంప్రదాయంగా నిలిచింది. ఇంక విద్యార్థులు సరస్వతీ అనుగ్రహసిద్ధి పొందడానికి చాల ముఖ్యమయిన ఆచరణీయవ్రతం - ఇది.

వ్రతకల్పపుస్తకాలలో సరస్వతీదేవి పూజావిధానంతో బాటు- సరస్వతీ మహిమాతిశయాన్ని ప్రకటించే ఒక వ్రతకథ కూడా కనిపిస్తుంది. ఈ కథ 'సుదేవిసుకేతుల' కథ.

శత్రురాజుల ఆక్రమణకారణంగా సుకేతుడు సర్వస్వం కోల్పోయి భార్యతో అడవులమార్గంలో తిరుగాడుతుంటే, సుకేతుడు వ్యాధిపీడితుడై నడవడానికి కూడా అశక్తుడయితే సుదేవి విలపిస్తుంటే- అపుడు అక్కడికి వచ్చిన అంగీరసమహర్షి ఆమెకు చెప్పిన వ్రతమే సరస్వతీవ్రతం. ఈ వ్రతంవల్ల సుదేవి గర్భవతియై కుమారుడు ప్రసవించడం, ఆ కుమారుడు అంగీరస మహర్షి అనుగ్రహంతో సకలవిద్యాపారంగతుడై యౌవనంలో తన తండ్రిరాజ్యాన్ని ఆక్రమించిన రాజులతో సమరం కొనసాగించి విజయం సాధించాడు. ఆపై తల్లిదండ్రులతో రాజధానికి చేరినట్లు వ్రతకథ. ఈ వ్రతకథ స్కాంద పురాణాంతర్గతం. ఈ కథనుబట్టి సరస్వతీదేవి ఒక్క చదువేగాక కోరినవారికి కోరినకోరికలు తీర్చేతల్లి అనీ విశదమవుతుంది.

# తిరుమలకు తొలిగడప

– డా॥ చింతకుంట శివారెడ్డి, 94408 59872

కడపపట్టణానికి ఉత్తరదిక్కుగా మూడుకిలోమీటర్ల దూరంలో ఉన్న దేవునికడపలో ఈ ఆలయం ఉంది. కడప బస్టాండు, రైల్వేస్టేషన్ల నుండి ఆటో సౌకర్యం కలదు. తిరుమలకు తొలిగడపగా ఈ క్షేత్రం ప్రసిద్ధి.

## స్థలపురాణం

తిరుమల దర్శనార్థం వచ్చిన జనమేజయ మహారాజు ఒకరోజు రాత్రి కలగన్నాడు. ఆ కలలో కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనమిచ్చి నేను ఫలానా ప్రాంతంలో శిలగా ఉన్నాను, అక్కడ నుండి తీసుకెళ్లి పవిత్రమైన ప్రదేశంలో ప్రతిష్ఠించమన్నాడట. ఆ కల ప్రకారమే చెరువుకు సమీపంలో నిలువెత్తు స్వామివిగ్రహం చూసి, స్వామి చెప్పినచోటే తిరుమలకు వాయువ్యంగా పది ఆమడల దూరంలో పుష్కరిణికి దగ్గరగా ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో ప్రతిష్ఠించారు. ఆలయంలో ఆంజనేయస్వామి ఒక పెద్ద రాతిపై సుమారు పదిఅడుగుల ఎత్తు చెక్కబడి ఉన్నాడు. ఆంజనేయునికి ఎదురుగా శ్రీవేంకటేశ్వర స్వామిని ప్రతిష్ఠించారు. అలా ప్రతిష్ఠించిన స్వామిని మొదట 'కడప వేంకటేశ్వరస్వామి'గా పిలుచుకునేవారు.

## చారిత్రక నేపథ్యం

ఆలయంలోని రాజగోపురం, ముఖమండపం, గర్భాలయం, అంతరాలయం, ఆలయంలోని పద్మావతి అమ్మవారు, వినాయకుడు, ఆండాల్‌అమ్మవారు, ఆళ్వార్ల మందిరాలు మరియు చుట్టుప్రాకారాన్ని మట్లి అనంతభూపాలుడు నిర్మించాడు. వైదుంబులు, ఓరుగంటిరాజులు, వల్లూరు పాలకులు, సంబెట రాజులు, సాళువ, సంగమ, తుళువ వంశీకులు ఈ క్షేత్రాన్ని ఎంతో అభివృద్ధిచేశారు. శ్రీకృష్ణదేవరాయలు పలుసార్లు స్వామిని దర్శించుకుని అనేకకానుకలు సమర్పించుకున్నాడు. నంద్యాల అవుభళేశ్వరదేవ మహారాజు ఈ స్వామికైంకర్యానికై భూదానం చేసినట్లు, మహామండలేశ్వర తిమ్మయదేవ మహారాజు ఉదయ గిరిప్రాంతంలోని ఒక గ్రామం యొక్క రాబడిని ఈ గుడికి ఇచ్చినట్లు, అరణం సర్వప్ప అనే ఆయన కిరీటాన్ని సమర్పించి నట్లు, మహామండలేశ్వర ఓబులరాజు మాన్యాలను, చిన్న అవుభళరాజు స్వామి పూలతోటకై భూమిని ఇచ్చినట్లు ఆలయా నికి గోడలపై నున్న శాసనాలు చెబుతున్నాయి. ఆలయగోపుర ద్వారానికి ఇరువైపులా రాయల వంశీకుల శిల్పాలు ఉన్నాయి.

ఈ గుడిలోని గోపురం, తిరుపతి శ్రీగోవిందరాజస్వామి ఆలయంలోని గోపురం రెండూ ఒకేకాలంలో నిర్మించినట్లు తెలుస్తోంది. కడపకు తొలి కలెక్టరుగా పనిచేసిన సర్ థామస్ మన్రో ఈ స్వామిని సేవించి, ఆలయగోపురం మరమ్మతులు చేయించాడు.



ఈ నెల 22వ తేది నుండి దేవుని కడప, శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు

## స్వామివారికి చేసే కైంకర్యాలు

ప్రతి ఏటా మాఘశుద్ధపాడ్యమి నుండి సప్తమి వరకు స్వామివారికి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. చివరిరోజైన రథసప్తమి రోజు రథోత్సవం జరుగుతుంది. ఈ రథం నిర్మాణంలో ఒక ప్రత్యేకత ఉంది. ఈ రథానికి వాడిన ఇనుప ఇరుసులను రథం లాగేందుకు ఇనుప గొలుసులను లండన్ మహానగరం నుండి ప్రత్యేకంగా ఓడలో తెప్పించినట్లు చెబుతారు. ఈ రథోత్సవాన్ని చూసేటందుకు జిల్లాలోని నలుమూలలనుండి స్వామివారి భక్తులు దేవునికడప చేరుకుంటారు.

రథోత్సవం తరువాత, తెప్పోత్సవ కార్యక్రమం కన్నుల పండుగలా నిర్వహిస్తారు. అన్నమాచార్యులు ఈ స్వామివారిని గురించి పన్నెండుకు పైగా సంకీర్తనలు రచించారు.


ఆలయానికి ఎదురుగా పుష్కరిణి ఉంది. ఈ పుష్కరిణిని విజయనగర సామ్రాజ్యచక్రవర్తి ప్రౌఢదేవరాయలు నిర్మించాడు. దీన్ని "హనుమత్ పుష్కరిణి" అని పిలుస్తారు. పుష్కరిణి మధ్యలో నీరాళిమండపం ఉంది. 1930 సం॥ వరకు ఈ పుష్కరిణిలో తెప్పోత్సవాలు జరిగేవి. మధ్యలో ఆగిపోయాయి. ఈ గుడి తిరుమలతిరుపతిదేవస్థానంవారి యాజమాన్యంలోకి వచ్చిన తర్వాత పుష్కరిణిని, ఆలయాన్ని, స్వామి విహరించే తెప్పను అందంగా సర్వాంగసందరంగా తీర్చిదిద్దారు. 1990 సం॥లో తిరిగి తెప్పోత్సవాలు ప్రారంభమయ్యాయి.

## ఆలయప్రాంగణం

గాలిగోపురంనుండి లోపలికి ప్రవేశించగానే ముందుగా స్వామివారి పాదాలు చిన్నమండపంలో దర్శనమిస్తాయి. అక్కడ నుండి కొంచెం ముందు ధ్వజస్తంభం, దానికి ముందు చిన్న మండపంలో గరుడాళ్వారు దర్శనమిస్తారు. అక్కడ నుండి ముందుకు వెళితే ముఖమండపం, అంతరాలయం, గర్భాలయాలు వరుసగా ఉన్నాయి. గర్భాలయం ఎదురుగా జయ విజయులు దర్శనమిస్తారు. అంతరాలయంలోని స్తంభాలపై అందమైన శిల్పాలు చెక్కబడ్డాయి. స్వామివారికి ఎడమవైపున



'శ్రీపద్మావతిఅమ్మవారి ఆలయం' ఉంది. గుడి ఆవరణంలో వినాయక మందిరం, విష్వక్సేనమందిరం, నాగదేవతలవిగ్రహాలు, ఆండాళ్అమ్మవారి మందిరం, శమీవృక్షం, ఆళ్వార్లసన్నిధి, కల్యాణ మండపం ఉన్నాయి. వీటితోపాటు ప్రత్యేకంగా పద్మావతి అమ్మ వారికి ఎదురుగా కప్పుకు పైభాగంలో రాతిపై రెండు బల్లులు దర్శనమిస్తాయి. వాటి పైభాగంలో వాటి ఆకృతి రూపంలో ఇత్తడి కవచం అమర్చారు. పాపనివారణం కోసం ఈ బల్లులను తాకుతూ ఉంటారు. ఈ సంప్రదాయం మనం కంచిలో బంగారు బల్లులను తాకడం చూశాం. అలాగే భక్తులు ఇక్కడ వీటిని తాకుతుండడం విశేషం. గుడి ఆవరణంలో బావి ఉంది. అక్కడ నుండి ప్రక్కగా వెళితే వేపచెట్టు క్రింద కృష్ణుడి విగ్రహాన్ని దర్శించుకోవచ్చు. గర్భాలయానికి ఆనుకొని వెనుకవైపు శ్రీ వేంకటేశ్వరస్వామివారి చిన్న విగ్రహం, ఎదురుగా పాదాలు దర్శనమిస్తాయి. స్వామిదర్శనానికై వచ్చే భక్తులు వెనుక ఉన్న విగ్రహానికి పూజలు చేసి, పాదాలవద్ద దీపాలు వెలిగిస్తుంటారు.




కులమతాలకు అతీతంగా స్వామివారిని ముస్లిం భక్తులు ఎక్కువగా కొలుచుకోవడం ఈ ఆలయం ప్రత్యేకత. తిరుమల స్వామి దర్శనానికి వెళ్లే భక్తులు తొలిగడపగా దేవుని కడపలోని స్వామిని దర్శించి వెళ్లడం అనాది సంప్రదాయం. ప్రతి సంవత్సరం ఉగాది రోజు వేలాదిమంది ముస్లింభక్తులు కడప రాయడిని దర్శించుకుంటారు. ఇది ఇక్కడ తప్ప మరెక్కడా లేని ఆచారం.

జనవరి 26,
## భారతగణతంత్ర దినోత్సవం
సందర్భంగా...

# ఏ దేశమేగినా.. ఎందు కాలిడినా...

- శ్రీ ప్రతాప వెంకట సుబ్బారాయుడు,
93939 81918



పసిమనసులు మంచివిత్తనాలు నాటాల్సిన సుక్షేత్రాలు. పెద్దలు, పురాణాల్లోని చిన్నకథలు, నీతిప్రభోదాత్మక కథలు, దేశభక్తులచరితలు పిల్లలకు చెప్పడంలోని అంతరార్థం అదే! తల్లి, తండ్రి, గురువుల కన్నా ముందుస్థానంలో నిలిచేది మాతృభూమి. ఎందుకంటే అందరికీ జన్మస్థానం భూమి. జన్మభూమిని అభిమానించి, గౌరవించడం మానవుడి ప్రథమకర్తవ్యం.

అమ్మ ఒడి పిల్లవాడికి మొదటి బడి. నీతినియమాలు, న్యాయధర్మాలు, దేశభక్తి ఉగ్గుపాలలో రంగరించాల్సింది ఆ దశలోనే. పిల్లవాళ్లు పెరుగుతున్న క్రమంలో వారి మనసుల్ని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతి తల్లిదీ. శివాజీ ఉన్నతికి అతడి తల్లి జిజియాబాయి వేసిన మార్గం మూలం. అమ్మకు అంతటి స్థానం ఉంది కాబట్టే ఢిల్లీకి రాజైనా అమ్మకు కొడుకే అన్న నానుడి పుట్టింది.

పుట్టినగడ్డ ప్రాణికి అస్తిత్వాన్నిస్తుంది. పెంచి పోషిస్తుంది. మనిషిమూలాలు విస్తరించడానికి కారకమవుతుంది. ఉదయం లేచి కాళ్లు కింద పెట్టే ముందు భూదేవికి నమస్కరించే సంస్కృతి మనది. గోదాలోకి దిగి ప్రత్యర్థితో తలపడే ముందు చేతులతో మట్టిని తీసుకుని నుదుటన ధరించి, ఒంటికి పులుముకుంటాడు, అదీ ఆటగాడు మట్టికిచ్చే గౌరవం. విదేశాన్నుంచి మనదేశంలో అడుగుపెట్టగానే ఇక్కడి నేలకు, గాలికి పులకాంకితుడవుతాడు మన దేశవాసి. దేశమంటే మట్టి, మనుషులు అన్నది వాస్తవం. మనిషి పుట్టింది మొదలు గిట్టే దాకా మట్టితో అవినాభావసంబంధం ఉంటుంది.

**"ఏ దేశమేగినా ఎందుకాలిడినా/ ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనినా పొగడరా నీతల్లి భూమిభారతిని/ నిలుపరా నీ జాతి నిండుగౌరవము"** అన్న రాయప్రోలు మాటల్లో నిండైన దేశభక్తి ప్రస్ఫుటమౌతుంది. వివేకానందుడు, యువతలో దేశభక్తిప్రచోదితంకావడానికి, వారిని చైతన్యపరచడానికి విశ్వవ్యాప్తంగా ఎన్ని ప్రసంగాలు చేశారో మనకు తెలియంది కాదు.

రావణునిసంహారం అనంతరం శ్రీరాముడు లక్ష్మణుడితో "జననీజన్మభూమిశ్చ, స్వర్గాదపి గరీయసి" అంటాడు. దీని భావం స్వర్ణకాంతులతో తేజరిల్లుతున్న ఈ లంకానగరం కన్నా నాకు నా మాతృభూమి అంటేనే ఎంతో ప్రీతి" అని. శ్రీరామచంద్రుడికి తన దేశం పట్ల అంతటి అంకితభావం ఉంది కాబట్టే రామరాజ్యఖ్యాతి ఇప్పటికీ కొనియాడబడుతోంది.

ఈనాడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యఫలాలకు కారకులు, దేశంకోసం జీవితాలను త్యాగం చేసిన దేశభక్తులు, అసువులుబాసిన మహనీయులు, "భారతదేశం నా మాతృభూమి.." అన్న ప్రతిజ్ఞలోని భావం, వందేమాతరం, జనగణమన జాతీయగీతాల అంతరార్థం అన్నీ పిల్లలకు విడమరచి చెప్పాలి. అప్పుడే మాతృభూమిపట్ల అవగాహన, బాధ్యత కలిగి ఉంటారు. తరతరాలకు ఈ విషయాలు చేరవేయాల్సిన గురుతర బాధ్యతను పెద్దలు తీసుకోవాలి.

కేవలం నాయకుల జయంతులు, స్వాతంత్ర్యదినోత్సవం, గణతంత్రదినోత్సవంలాంటి ప్రత్యేకరోజుల్లో కాకుండా పౌరులు సతతం దేశభక్తి భావం కలిగి ఉండాలి. దేశమంటే బాధ్యత వహించే వాళ్లంటే సైనికులు మాత్రమే కాదు ప్రతిపౌరుడు గుర్తుకురావాలి. దేశం మనకిన్ని వసతులు, వనరులు ఇస్తున్నప్పుడు ఈ మాత్రం గౌరవం ప్రకటించలేమా?


మనిషి ఉత్తమనాయకుడు, ఉత్తమపౌరుడు కావడానికి చిన్నతనంలో మనసులో పడే బీజాలే ముఖ్యకారణం. మొక్కగా ఉన్నప్పుడే సరైన రీతిలో మలచాలి, అప్పుడే చెట్టు కల్పవృక్షం అవుతుంది. మాతృభక్తి, పితృభక్తి, గురుభక్తి, దైవభక్తి, దేశభక్తి మనిషిలో సమపాళ్లలో మేళవించినప్పుడే ఉత్తముడు, ఉన్నతుడు అవుతాడు. జన్మసార్థకమౌతుంది.



ఈ నెల 21న పురందరదాసు ఆరాధన సందర్భంగా...

# వెంకటాచల నిలయం- వైకుంఠపురవాసం

– ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000



తెలుగులో తాళ్లపాకకవులు పదసాహిత్యాన్ని పరిపుష్టం చేసినట్టుగానే కన్నడంలో నరహరితీర్థులు, వారి పంథాలో నడచిన శ్రీపాదరాయ, వ్యాసరాయాదులు తమ "దేవరనామగళు"లతో ప్రజానీకంలో నైతికత, ఆధ్యాత్మికానురక్తి ప్రచారానికి దోహదం చేశారు. తెలుగులో అన్నమయ్య, పదకవితాపితామహుడైతే కన్నడంలో పురందరదాసు కర్ణాటక సంగీతపితామహుడు. అన్నమయ్యకు ప్రధాన ఆరాధ్యుడు శ్రీనివాసుడైతే పురందరదాసుల వారికి విఠలుడు ప్రధాన ఆరాధ్యుడు. పురందరదాసు తిరుమలకు విచ్చేసి స్వామిని అనేకరకాలైన అనుభూతులతో కీర్తించారు. పురందరదాసు దర్శించిన శ్రీనివాసుణ్ణి ఇలా విశ్లేషించుకోవచ్చు.

## 1) స్వప్న శ్రీనివాసుడు

హరిదాసులు ఎప్పుడూ భగవంతుణ్ణి సదా స్మరిస్తూ ఆ భావనాజగత్తులో సంచరిస్తూ ఉంటారు. ఆ భావనలో స్వామి తమకు ప్రత్యక్షమైనట్లుగా భావించుకుంటారు. ఇది జాగ్రదవస్థలోని స్వప్నావస్థ. ఈ అవస్థలోనే దాసులవారు శ్రీవేంకటేశ్వరుణ్ణి దర్శించారు. ఆ స్వప్నసాక్షాత్కారాన్ని– **"కనసు కండెనె మనదల్లి కళవళ కొండెనె, ఏనుహేళలి తంగి తిమ్మయ్యన పాదవను కండె"** అనే కీర్తనలో ప్రకటించారు.

"అందచందాలొలికించే నామంతో, బంగారుపాదుకలతో, ఘల్లుఘల్లుమనే అందియలతో నాముందు స్వామి సాక్షాత్కరించాడు. మకరకుండలాలు ధరించి, కస్తురితిలకం దిద్ది, గజ్జెలు ఘల్లుమంటుండగా తిమ్మయ్య నా ముందు నిలబడ్డాడు.

అంతేకాదు యతులు ముత్యాలపల్లకిని మోస్తుండగా, దేవతలు ఛత్రచామరాలతో వెంటరాగా రంగయ్య ఉత్సవమూర్తిగా సాక్షాత్కరించాడు. పద్మనేత్రుడైన కృష్ణయ్య తానే వచ్చి నిలబడ్డాడు. బ్రహ్మ, వాయువు మొదలైన దేవతలు రంగయ్యకు సేవలు చేస్తుండగా నవరత్నాలంకృతుడై, నానాభరణశోభితుడైన స్వామి నా హృదయమండపంలో కొలువైయున్నాడు." అని ఇతర చరణాలలో వర్ణించారు.

## 2) సన్నిధి శ్రీనివాసుడు

పురందరదాసులవారు స్వామి సన్నిధిలో నిలబడి కీర్తనలు పాడి అక్కడి వారిని తన్మయులు చేసినట్లు ఐదుపదాలు సాక్ష్యాలిస్తున్నాయి.

దాసులవారు తిరుమలయాత్రావిధిప్రకారం ముందుగా స్వామిపుష్కరిణిలో పవిత్రస్నానం చేసి వరాహస్వామిని సేవించి మహాద్వారందాటి సంపంగిప్రాకారప్రదక్షిణం గావించి, గరుడ గంభానికి నమస్కరించి ఆలయంలో ప్రవేశించారట. అక్కడ స్వామిని దర్శించుకున్న వైనాన్ని –

"నిన్న దివ్యమూరితియ కన్ను దణియ నోడి, ధన్యనాదెనో ధరెయలు" అనే కీర్తనలో శ్లాఘించారు.

రవికోటితేజమైన కిరీటకుండలాలతో, మెడను ధరించిన వైజయంతీమాలికలతో, ప్రతి అవయవానికి చుట్టిన హారాలతో, శ్రీవత్సంతో, చేతదాల్చిన శంఖచక్రాలతో, కటిసూత్రంతో, పీతాంబరంతో స్వామి కనిపించాడట. ఆ మూర్తిని దాసులవారు అనేక నామాలతో స్తుతిస్తూ – చివరగా "స్వామీ! నీ దివ్యమూర్తిని కళ్లారా దర్శించి ధన్యుడనయ్యాన"ని చెప్పడం విశేషం.

## 3) ఉత్సవ శ్రీనివాసుడు

తిరుమలలో సంవత్సరానికి ఒకసారి జరిగే బ్రహ్మోత్స వాలకు, చాలాదేశాలనుండి పరషలుగా భక్తులు తిరుమల చేరుకోవడం, స్వామిని సేవించడం సహజం. ఆ సమయంలో పురందరదాసు కూడా బ్రహ్మోత్సవాలకు విచ్చేసి దర్శించినట్లు రెండుమూడు కీర్తనలు సాక్ష్యమిస్తున్నాయి. ప్రత్యేకించి హరి దాసుల వారు బ్రహ్మోత్సవాలలో ప్రధానమైన గరుడోత్సవాన్ని తిలకించినట్టు స్పష్టమౌతోంది.

## 4)అభేద శ్రీనివాసుడు

మహావిష్ణువుకు మత్స్యాద్యవతారాలేగాక తనకు తానై దివ్యదేశాలలో సాక్షాత్కరించిన అర్చామూర్తులెన్నో ఉన్నాయి. ఆ మూర్తులలో తాను సేవించే స్వామిని దర్శించడమే భక్తుల ఆశంస. ఈ దృష్టితో హరిదాసులు చాలా కీర్తనలు రచించాడు.

"శరణు శరణు నిన గెంబెనో విఠల, కరుణానిధి యెంబె కాయయ్య విఠల" అనే కీర్తనలో ఇతర అవతారమూర్తు లతో విఠలునికి అభేదం కల్పిస్తూ రామవిఠలుడు, కృష్ణవిఠలుడు, వేంకటప్రభు విఠలుడని చమత్కారం చేశారు. విష్ణుమూర్తి అర్చావతారాలమధ్య విభేదం ఉండకూడదని భావించినవారు హరిదాసులు. ఈ కారణాలవల్ల భక్తులమధ్య విభేదభావం సన్నగిల్లి విశాలభావం అలవడుతుందని చెప్పవచ్చు.

## 5) అలంకార శ్రీనివాసుడు

స్వామి అనంతరూపుడు. ఏయే వేళల్లో ఏఏ రూపాలతో, ఎవ్వరెవ్వరిని కటాక్షిస్తాడో తెలియదు. అలాగే దాసులవారికి ఒకసారి స్వామి వైద్యుడుగా దర్శనమిచ్చాడు. దాసులవారు తన అనుభూతిని తానేకాక ఇతరులు పంచుకోవాలని

"వైద్య బంద నోడి వెంకట నెంబ వైద్య బంద నోడి" అని వర్ణించాడు.

శ్రీదేవీరమణుడనే వైద్యుడు, శ్రీనివాసుడనే వైద్యుడు, వేదవేద్యుడైన వైద్యుడు, వెంకటనామధేయుడైన వైద్యుడు ఇదిగో వచ్చాడు చూడండి. నీకేం భయం లేదు. ఎంతోకాలం నుండి రోగాలు వేధిస్తున్నాయనే చింత అసలు వద్దు. రసరోగాలు, రక్తసంబంధిరోగాలు, కండరాదులకు సంబంధించిన రోగాలు, మేధస్సంబంధి జబ్బులు, ఇలాగే సప్తధాతు జన్యురోగాలతో బాధపడుతున్నామని ఆందోళన పడవద్దు. నన్ను దాసునిగా చేసుకుని నన్ను ఆరోగ్యవంతునిగా చేసే వైద్యుడు వచ్చాడు. నా నాలుకకు రుచికరమైన నామామృతమనే దివ్యౌషధం ప్రసాదించే వైద్యుడు వచ్చాడు. భవరోగాన్ని వదిలించే వైద్యుడు వచ్చాడు. ఈ వైద్యుడు సామాన్యుడా? కానే కాదు. జగమంతా వెతికినా ఇంతటి 'హస్తవాసి' కలవాడు మరొకడులేడు. రోగాలగుట్టు తెలిసిన ధర్మవైద్యుడు– మరో వైద్యుడెందుకు శ్రీనివాస వైద్యుడున్నాడు కదా అన్నారు.

## 6) మానస శ్రీనివాసుడు

ఆలయంలోకి వెళ్లడానికి అందరికీ అన్ని సమయాల్లో కుదరకపోవచ్చు. ఆ సమయంలో వారు మానసికంగా పూజలు చేస్తున్నట్టుగా భావిస్తూ ఆనందానుభూతికి లోనవుతారు. అలాంటి మానస పూజాదికాలు హరిదాసులపదాలలో కని పిస్తాయి.

"ఎన్న బిట్టు నీనగలదిరు శ్రీనివాసు
నిన్న నంబిద దాస నల్లవేనో"

"నన్ను వదలి ఎక్కడకు కదలకు. ఓ శ్రీనివాసా! నిన్ను నమ్ముకున్న దాసుణ్ణి కదా! నేను" అనే భావం గల ఈ కీర్తనలో తనువే మంటపంగా, మనసే మంచంగా, సుజ్ఞానమనే దీపపు వెలుగులో సనకాదివంద్యుడైన స్వామి! నీవు తొందరగా రా! అని ప్రార్థించాడు.

## చక్షువు జ్ఞానము పొందువేళ ఇది...

**రాగం : సారంగ** | **తాళం: ఆది**

**పల్లవి**

వైకుంఠఏకాదశి... శుభవేళ ఇది
అకుంఠితదీక్షాయుతులగు భక్తుల
సంకటములు ఇక సమయువేళ ఇది

**చరణాలు**

తామరాకుపై తోయపు బొట్టై
తగిలీ తగలక తేలియాడుటే
తగు వైరాగ్యపు తత్త్వబోధయని
తేటతెల్లమై తెలియు వేళ ఇది

చంచలమనసు స్థిరముగ ఉండి.. అ-
చంచలమైన స్థాయిని చేరి
చిత్తమున సత్ చింతన నిండి
చక్షువు జ్ఞానము పొందువేళ ఇది

ఆశ్రమము ఏదైనా గానీ
అంబరీషులా ఆచరించిన
ఆ భగవంతుని అభయవాణిని
ఆనందముగా విను వేళ ఇది

- *శ్రీమతి ఆర్.వాణిశ్రీ, 96520 25604*

## 7) సంప్రార్థన శ్రీనివాసుడు

భక్తునికి భగవంతునికి ఉన్న అనుబంధం ప్రధానంగా మూడు విధాలు. మొదటిది సేవ్యసేవకానుబంధం. రెండవది మాతాసుతానుబంధం. మూడవది మధురభక్తి, ప్రేయసీ ప్రియానుబంధం. పురందరదాసువారు మొదటి రెండింటికీ ప్రాధాన్యమిచ్చారు.

'ఈ జీవనిందు ఫలవేను
రాజీవలోచనన మరెదిహ తనువినలి
అరుణ ఉదయలెద్దు మరి స్మరణెయ మాడి
గురు- హిరియర చరణకమల కెరగి
పరమశుచియాగి నదియలి మిందు రవిగర్ఘ్య
వెరెయదె కదు ఈ పాపి తనువినలి'

అనే కీర్తనలో ఈ జీవుడు బతకడంవల్ల ఫలమేమి? చెలువుడైన రాజీవలోచనుని స్మరించని అరుణోదయకాలంలో లేచి హరిస్మరణచేసి గురువులకు, పెద్దలపాదాలకు నమస్కరించి శుచిగా నదిలో స్నానంచేసి సూర్యభగవానుని అర్ఘ్యమివ్వడాన్ని మరచిన ఈ పాపిదేహంలోని జీవుడు ఉండడంవల్ల ఫలమేమిటి? అన్నారు.

పురందరదాసు కన్నడంలోనే కాదు సంస్కృతం లోనూ శ్రీనివాసకీర్తనలు రాశారు. వాటిలో చాలా ప్రసిద్ధమైంది.

వెంకటాచలనిలయం - వైకుంఠపురవాసం
పంకజనేత్రం - పరమపవిత్రం
శంఖచక్రధర చిన్మయరూపం
................................
సకలవేద విచారం సర్వజీవనికరం
మకరకుండలధర మదనగోపాలం
బకుత విపోషక పురందరవిఠలం

'మంగళాదీని, మంగళమధ్యాని, మంగళాంతాని చ' అనే సంప్రదాయం ప్రకారం దాసులవారు శ్రీనివాసునిపరంగా జయమంగళగీతాలు కూడా రచించారు.

పురందరదాసు పదాలు చాలావరకు ప్రాశ్నికాలు, ఆహ్వానరూపాలు, అనుభూతివ్యక్తీకరణలు, శరణాగతాత్మకాలు, స్తుత్యాత్మకాలు వర్ణనాత్మకాలుగా కూడా కన్పిస్తాయి.




# అంతా నా కళ్లముందు జరిగింది!

– శ్రీ ఎస్.వి.నరసింహం, 63003 29245

శ్రీ పి.వి.ఆర్.కె.ప్రసాద్ 1978–1982 మధ్యలో తి.తి.దే.లో కార్యనిర్వహణాధికారిగా పనిచేశారు. ఆ సమయంలో ఒక విచిత్ర సంఘటన జరిగింది. కర్ణాటక రాష్ట్రానికి చెందిన, ఒకే కుటుంబంలోని ఇరవైమంది కుటుంబ సభ్యులు స్వామివారి దర్శనంకోసం వచ్చారు. వారు వచ్చేటప్పుడు బంగారుకాసుల దండ ఒకటి తీసుకొనివచ్చి దాన్ని శుక్రవారం అభిషేకానంతరం స్వామికి సమర్పించాలని అభ్యర్థించారు కారణం, ఆ కుటుంబ సభ్యులందరూ కలసి ఆ కాసులదండను ఎంతో వ్యయప్రయాస కోర్చి తయారుచేయించారు. స్వామివారిని ఆ అలంకారంతో చూచి తరించాలన్నదే వారి తాపత్రయం. వారు ఆ హారంలో నూటెనిమిది బంగారుకాసులు, ప్రతికాసుమీద శ్రీవారినామం, అమ్మవారినామం చెక్కించారు. దాని విలువ ఆనాటికి సుమారు రెండులక్షలరూపాయలు పై చిలుకు ఉంటుంది.


వారి అభ్యర్థనకు స్పందించిన ఆలయఅధికారులు వారితో "అయ్యా! ఆ కాసుల దండతో బాటు అంతే విలువ గలిగిన నగదును స్వామివారికి చెల్లించినట్లైతే, ఆ కాసులపేరును స్వామికి అలంకరింపజేస్తాం" అని చెప్పారు. అప్పుడున్న నిబంధనల ప్రకారం ఏదైన బహుమానం స్వామికి సమర్పించాలంటే అంతే విలువగల సొమ్మును స్వామిఖాతాలో జమ చేయాలి. దాన్నే "వర్తన" అంటారు. వారికి వర్తన కట్టే శక్తి లేదు. దాదాపు పదహారుసంవత్సరాలు శ్రమించి కష్టపడి కుటుంబసభ్యులందరూ కలిసి ఆ హారాన్ని తయారుచేయించారు. దిక్కుతోచని పేష్కార్‌గారు కార్యనిర్వహణాధికారికి ఫోను జేసి వివరాలను నివేదించి, "ఆ భక్తులు మిమ్మల్ని కలవాలని అంటున్నారు సార్!" అన్నారు. వెంటనే కార్యనిర్వహణాధికారి "నేను గుడికి గంటలో వస్తున్నాను. వారినక్కడే ఉండమనండి" అని చెప్పి ఫోనులో చెప్పారు.


ఆ కుటుంబ పెద్ద డి.యస్.నాగరాజారావు. ఆయన చిక్కబళ్లాపూర్ జిల్లా, లక్కపల్లి గ్రామంలో ఒక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు. వారికి కొద్దిపాటి భూములున్నప్పటికీ దానిమీద వచ్చే ఆదాయం ఏమీలేదు. ఆయన చెప్పిన కథనం మేరకు 15–16 సంవత్సరాలక్రితం ఆయనకు ఒకరాత్రి స్వప్నంలో శ్రీవేంకటేశ్వరస్వామి ప్రత్యక్షమై "నాకు కాసులపేరు సమర్పించుకొంటావా?" అని అడిగాడట. దాన్ని ఆయన పెద్దగా పట్టించుకోలేదట. ఇది జరిగిన మూడోరోజున ఒక భక్తుడు ఉదయాన్నే వాళ్ల ఇంటికొచ్చి స్వామివారి లడ్డూ ప్రసాదం ఇచ్చాడు. వెంటనే ఆయనకు తనకు వచ్చిన కల జ్ఞాపకమొచ్చింది. దాంతో కుటుంబసభ్యులనందరినీ పిలిచి ఈ విషయం గురించి చర్చించాడు. అందరూ ఒకరి ముఖాలు ఒకరు చూచుకున్నారు. ఎందుకంటే వారందరికి స్వామిమీద భక్తి ఉన్నప్పటికీ నూటెనిమిది బంగారుకాసులపేరు సమర్పించేంతటి స్తోమత లేదు. కాబట్టి వారికేం పాలుబోక "తర్వాత చూద్దాంలే" అనుకుని ఆ విషయాన్ని అప్పటికి వాయిదా వేశారు!

ఆరోజు రాత్రి మరల శ్రీనివాసుడు, నాగరాజారావుకు కలలో కనిపించి మరోసారి తన అభీష్టాన్ని గుర్తుజేశారు. అప్పుడు నూటెనిమిది రాగి నాణాల కాసులదండను తయారుజేసి అందులో అక్కడక్కడ కొన్ని వెండికాసులు చేరుద్దామని నిర్ణయించుకున్నారు. మళ్లీ ఆ రోజురాత్రి నిద్రలో నాగరాజారావుకు శ్రీవారు దర్శనమిచ్చి "బంగారుకాసులపేరు కానుకగా ఈయవా!" అని మరొక్కసారి నొక్కి చెప్పారు. దాంతో ఆయనకు ఆ రాత్రంతా నిద్రపట్టలేదు. ఇంట్లో మహిళల మంగళసూత్రాలన్నీ కలిపినా ఒకటి రెండు బంగారుకాసులు కూడా చేయడానికి వీలుపడదు. నూటెనిమిది కాసులతో బంగారుహారం ఎలా తయారుచేయించాలి?.... ఎలా, ఎలా? అని తర్జనభర్జన

లయ్యాక వారొక నిర్ణయానికొచ్చారు. అదేమిటంటే "కానుక కోరిన ఇలువేలుపే ఈ సమస్యనుండి బయటపడేమార్గం చూపిస్తాడు" అని. అంతే ఆ రోజునుంచి తమ కుటుంబమంతా రోజుకి ఒక్కపూట భోజనమానేసి దానివల్ల మిగిలే డబ్బుతో శ్రీవారికి బంగారు కాసులహారంకోసం ఆదా చేయాలన్నదే వారు తీసుకున్న నిర్ణయం. నిత్యం స్వామిని స్మరిస్తూ ఉప వాసాలు కొనసాగించారు. ఈలోగా ఇంట్లో పరిస్థితులు మారుతూ వచ్చాయి. నాగ రాజారావు తమ్ముని కొకనికి ఉద్యోగం వచ్చింది. ఆ మరుసటి సంవత్సరం ఆ ప్రాంతంలో ఒక నీటిపారుదల పథకం అమలులోకి వచ్చింది. దానివల్ల వీరి పొలాల్లోకి సాగునీరు పారడం మొద లైంది. వాళ్ల బీడుభూమిలో సేద్యం ఆరంభ మైంది. మెరుగుపడ్డ ఆర్థికపరిస్థితితో బంగారుకాసుల తయారీ ఊపందుకుంది.

వాళ్ల కఠోరదీక్ష దాదాపు పద హారు సంవత్సరాలకు ముగింపు కొచ్చింది. నూటెనిమిది కాసుల బంగారు ఆభరణం తయారైంది.





ఆ సమయంలో స్వామివారు మరలా దర్శనమిచ్చి "అంతా కలిసే తయారుచేశారుగా హారాన్ని మరి అంతాకలిసే నా కొండకొచ్చి నా ముడుపు చెల్లించుకోరా! మీ హారంతో నన్ను దర్శించుకోరా!" అని అంత ర్థానమయ్యాడట. అలా చెబుతున్న నాగరాజారావుకు ఒక్కసారిగా ఏదో స్ఫురించింది. మరుక్షణం ఆర్ద్రత, ఆనందం నిండినకంఠంతో "మీరే, మీరే... నాకు కలలో, శ్రీవేంకటేశ్వరస్వామి చూపించిన వ్యక్తి. ఆయనే మిమ్మల్నే కలుసుకోమని చెప్పాడు..." అంటూ ఆయన ఉద్వేగంతో ఈ.ఓ. గారి చేయిపట్టుకుని ఊపే శారు.

ఆ గాథను విన్న పి.వి.ఆర్.కె.గారు, వారి విశ్వాసం వమ్ముకాకుండా వారికి సహాయపడటమే న్యాయమనిపించింది. ఆయనను ఏదో తెలియని ఆవేశం ఆవహిం చింది. కళ్ళుచెమ్మగిల్లాయి. అనూహ్యమైన స్పందనకు గురయ్యారు. ఎందుకంటే వారికి వర్తన కట్టే స్తోమత లేదు. వెంటనే పేష్కారును పిలిచి "వారు కోరిన ప్రకారమేవారికి వర్తన చెల్లింపునుండి మినహాయించి, ఆ మర్నాడు అభిషేకానంతరం స్వామివారిని ఆ కాసుల హారంతో అలంకరించండి" అని ఆదేశాలు ఇచ్చారు. ఆ ప్రకారమే ఆ మర్నాడు అభిషేకం తర్వాత స్వామివారిని ఆ కాసులహారంతో అలంకరించారు. ఆ కుటుంబమంతా "గోవిందా! గోవిందా!!" అనుకుంటూ తనివితీర స్వామివారిని వీక్షించుకున్నారు. ఆ క్షణంలో వాళ్లకళ్లలో తొణికిసలాడిన ఆనందం, భక్తిపారవశ్యం.... ఏమని వర్ణించగలం!

ఆ తరువాత కొన్నిరోజులకు జరిగిన తి.తి.దే. పాలకమండలి సమావేశంలో కార్యనిర్వహణాధికారిగారు "వర్తన మినహాయింపు" గురించి, ఆయన తీసుకున్న నిర్ణ యాన్ని గురించి వివరించారు. నాగరాజారావుగారి భక్తిగాథ పాలకమండలి సభ్యులను కూడా కదిలించి వేసింది. వెంటనే పాలకమండలి ఆ కాసులదండ విషయంలో కార్య నిర్వహణాధికారి తీసుకున్న చర్యకు ఆమోదముద్రవేసింది. అంతేకాదు భవిష్యత్తులో ఇలా ఎవరైన పేద భక్తులు ఇవ్వదలచిన బహుమానాలకు కూడా "వర్తన" మినహాయింపు ఇవ్వాలని తీర్మానించి, ఉత్తర్వులు కూడా జారీ చేశారు.

అప్పుడు నేను తి.తి.దే. రెవెన్యూ విభాగంలో ఉద్యోగిగా పనిచేస్తున్నాను. ఇదంతా నా కళ్లముందు జరిగిన శ్రీవారి లీలావిభూతి!



# ప్రాణశక్తి... సూర్యరశ్మి

- శ్రీమతి యడవల్లి మృదుల లక్ష్మి

ఉదయించుభానుడు ఉల్లిపూవూ ఛాయ... అంటూ ఓ కవి బాలభానుడి సౌందర్యాన్ని ఎంతోరమ్యంగా వర్ణించాడు. బాలభానుడి సౌందర్యం మనసుకు ఆహ్లాదాన్ని పంచితే అతడి తేజస్సు మనకు ఆరోగ్యాన్నిస్తుంది. కోటికిరణాలతో ప్రకాశించే సూర్యుడికి అనంతమైన ఆరోగ్యాన్నిచ్చే శక్తి ఉంది. ఉదయపు నడక, వ్యాయామం, యోగసాధన... వీటన్నిటి వెనకా ఉన్నది ఆదిత్యుడి ఆరోగ్యశక్తే.

సూర్యకిరణాల్లోని వైజ్ఞానికాంశాలకు సంబంధించిన కొన్ని అంశాలు మనకు పురాణాల్లోనూ కనిపిస్తాయి. మహాభారతంలో కర్ణుడు సూర్యుడి వరప్రభావం వల్ల కుంతీదేవికి సహజకవచకుండలాలతో జన్మించిన సంగతి మనకు తెలిసిందే. ఈ అంశాన్ని నిశితంగా పరిశీలిస్తే కర్ణుడి జన్మ వృత్తాంతంలో సూర్యరశ్మికి సంబంధించిన ఆరోగ్యరహస్యాలు తెలుస్తాయి. కర్ణుడు సూర్యుడి అంశతో పుట్టాడు. అంటే పుట్టుక తోనే అతడికి సూర్యరశ్మి పూర్తిగా అందింది. శక్తివంతమైన సూర్యకాంతి అతడి మీద ఉండటం వల్ల అతడు పుట్టుకతోనే బలిష్టమైన ఎముకలు, కండరాలతో జన్మించాడు. దీన్నే పురాణంలో అభేద్యమైన సహజ కవచకుండలాలని చెప్పారు వ్యాసమహర్షి. ఈ కాలంలో ఈ తరహా వృత్తాంతాలు కోకొల్లలుగా కనిపిస్తాయి. పుట్టుకతోనే కామెర్లువంటి వ్యాధులకు గురౌతున్న బిడ్డలు లక్షలసంఖ్యలో ఉన్నారు. 'డి' విటమిన్ తక్కువగా ఉన్న కారణంగా వీరికి ఇంక్యుబేటర్లలో కొన్ని రోజులు ఉంచుతారు. సూర్యరశ్మి తరహా సాంకేతిక తేజోశక్తి వారికి అందిన తర్వాత బిడ్డలు ఆరోగ్యాన్ని పుంజుకుంటారు. ఇదే అలవాటు గ్రామీణుల్లోనూ ఉంటుంది. పసిబిడ్డల్ని అరుణోదయపు వేళ అలా సూర్యుడికి ఎదురుగా కాసేపు ఉంచుతారు. సూర్యకిరణాల ద్వారా అందే విటమిన్లు బిడ్డల్లోని అనారోగ్యకారక క్రిముల్ని సంహరించి, వారికి ఆరోగ్యాన్ని కలిగిస్తాయి.

శరీరానికి అవసరమైన పోషకాల్లో అతి ముఖ్యమైంది విటమిన్ డి. ఈ పోషకం ఆహారంలో కంటే సూర్మరశ్మి నుంచే ఎక్కువగా లభ్యమౌతుంది. సూర్యకాంతి వల్ల దొరికేది 80 శాతమైతే మిగిలిన 20 శాతం మాత్రమే ఆహారపదార్థాల నుంచి లభ్యమౌతుంది.

చర్మానికి సూర్యకాంతి తగలగానే విటమిన్ డి ఆవిర్భవిస్తుంది. ఇది రక్తంలో కలిసి కాలేయాన్ని చేరుతుంది. కాలేయంలో అది 'క్యాల్సిడియల్' అనే ఒక పూర్తిస్థాయి హార్మోన్‌కు తొలిరూపాన్ని తీసుకుంటుంది. మళ్లీ అది రక్త ప్రవాహంలో కలిసి 'క్యాల్సిడియల్' నుంచి క్యాల్సిట్రియల్‌గా మారుతుంది. ఈ క్యాల్సిట్రియాల్‌నే 'విటమిన్-డి' అనుకోవచ్చు. రక్తప్రవాహం ద్వారా ఇది మూత్రపిండాల్లోకి చేరినప్పుడు పూర్తిస్థాయి 'విటమిన్-డి'గా రూపొందుతుంది. వ్యాధి నిరోధకత కలిగించే కణాల్లోనూ ఈ విటమిన్ రూపొందుతుంది. అందుకే ఈ విటమిన్ ప్రభావపూర్వకమైన 'సహజవ్యాధినిరోధకారి'గా పనిచేస్తుంది. ఇది శరీరానికి అవసరమైన పోషకంగానూ, హార్మోన్‌గానూ రెండురకాల భూమికను పోషిస్తుంది.

సూర్యకాంతిలోని అతినీల లోహితకిరణాలు శరీరంలో 'డి' విటమిన్‌ను ఉత్పన్నం చేసి ఎముకలు దృఢంగా బలంగా ఉండేటట్లు చేస్తాయి. మనదేశవాసుల చర్మసౌందర్యం ఈ అతినీలలోహితకిరణాలు సోకడంతో ఎక్కువ ఆకర్షణీయంగా ఉంటుంది. ఈ కారణం వల్లనే పాశ్చాత్యులు మనదేశానికి వచ్చిన సందర్భాల్లో సూర్యకిరణాలు ఎక్కువ మోతాదులో లభించే సముద్రతీర ప్రాంతాలకు వచ్చి అక్కడ సూర్యస్నానాలు (సన్‌బాత్)

చేస్తుంటారు. ఏది ఏమైనా ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో కొంతసేపు సూర్యరశ్మి తగిలేటట్లు జాగ్రత్తపడటం మన శరీర ఆరోగ్యానికి మంచిది.

శరీరానికి గాలి, నీరు, ఆహారం అవసరమైనట్లే, సూర్యరశ్మి కూడా కావాల్సి ఉంటుంది. సూర్యరశ్మి శరీర ఆరోగ్యానికి ఔషధంలాంటిది. సూర్యరశ్మి మనిషి శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని కూడా ఇస్తుంది. కాబట్టి సూర్యరశ్మిని నిర్లక్ష్యం చెయ్యకూడదు. 'డి' విటమిన్ లోపం వల్ల ఎముకలకు సంబంధించిన రికెట్స్ వ్యాధి వస్తుంది. ఇతర ఆరోగ్య సమస్యలు కూడా ఎదురౌతాయి.

సూర్యోదయం అయ్యే సమయంలో సూర్యరశ్మికి ఎదురుగా కొంతసేపు ఉండటం వల్ల శరీరం బరువు తగ్గుతుంది. సూర్యకాంతి (సన్ లైట్), బాడీ మాస్ ఇండెక్స్ (బి.ఎం.ఐ)కు మధ్య అవినాభావ సంబంధం ఉన్నట్లు పరిశోధకులు నిర్ధారించారు. రోజులో ఎక్కువ సమయం చీకటిగా ఉండే ప్రాంతాల ప్రజలు అనేక మానసికసమస్యలు ఎదుర్కొంటారు. సూర్యరశ్మి లోపం కారణంగా వీరు చాలా త్వరగా ఆందోళనకు గురౌతుంటారు. ఈ సమస్యకు ఉత్తమపరిష్కారం సూర్యకిరణాలు మాత్రమే ఇస్తాయి.

విటమిన్–డి ఉత్పత్తి వల్ల గుండె సంబంధిత వ్యాధులు దరిజేరకుండా ఉంటాయి. సూర్యకిరణాల వల్ల శరీరంలోని అనేక భాగాలకు వ్యాయామం కూడా అవుతుంది, పొద్దునే నిద్రలేవటం వల్ల ఒక క్రమపద్ధతితో కూడిన జీవినవిధానం కూడా అలవాటు అవుతుంది. పొద్దునపూట వచ్చే సూర్యకిరణాలు అనేకరకాలుగా మన శరీరకండరాలకు ఉపయోగం. ఉదయాన్నే సూర్యకిరణాలు తాకడం ద్వారా బరువుతగ్గుతారు.

సూర్యకిరణం కేవలం వెలుగును ఇచ్చే కిరణం మాత్రమే కాదు. మనకు జీవశక్తిని ఇచ్చే ఆరోగ్యకిరణం అని గ్రహించి, దైనందినవిధానాల్లో కొద్దిపాటి మార్పులు చేసుకోవాలి. సూర్య కిరణం అప్పుడు సహజవైద్యంగా అందుతుంది.

**46వ పేజీలోని.. 'తేడాలు గుర్తించండి' కి జవాబులు**





# శ్రీకృష్ణామృతం..

ఎల్లో ఎల్లో
ఎన్నెలమ్మ రేపల్లె ఒడిలో
ఎన్నదొంగ కిట్టయ్య కతలో
ఎంత విన్న మురిపాలే మదిలో

నల్లనయ్య కనులు కొంటె కోవెల్లు
నందనగరిన పాలు మీగడలే చెల్లు
నాదియన్నది లేదు వెన్నంత కిట్టయ్య పాలు
నదురు బెదురూ లేదు దండించ నవ్వుల్ల పూలు

కన్నయ్య నేస్తాలు గోపబాలకులు
కడుపు నిండగ పాలిచ్చు ఆవు గోవుల్లు
కపటము లేదింక రక్కసుల ఆటల్లు చెల్లు
కాపాడ వచ్చాడే మాధవుడు పగలు రేయిల్లు

వెన్న దొంగ కాదె వేణుమాధవుడు
వెతలు తీర్చునేవాడు వేగిరము ఇపుడు
వెన్నంటి చూడరే వింత పోకడలు
వెలుగుల్లె అంతటా విపుల విన్యాసాలు

– 'అనంత' కృష్ణసుందరి సత్తిరాజు

# నీవేగతి రామ, నీకు మ్రొక్కితి రామా!

– శ్రీ ఎస్.కె.సైదా, 80088 41447



ఈ నెల 11న త్యాగరాజస్వామి ఆరాధన సందర్భంగా...

భారతీయ సంగీత, సాహిత్య, ఆధ్యాత్మికరంగంలో ఒక కాంతిమంతమైన తరంగం శ్రీ త్యాగరాజస్వామి. మహా వాగ్గేయకారుడుగా ప్రపంచ ప్రసిద్ధి నొందాడు. శ్రీరాముణ్ణి తన దైవంగా ఆరాధించడమే కాక సంగీత, సాహిత్య కృతులను అత్యంత ఆశువుగా పలికే సిద్ధిని పొంది ఆ కృతులను రామాంకితం చేసి జీవితాన్ని గడిపాడు. సంగీతాన్ని 'నాదోపాసన'గా సాగించిన త్యాగరాజస్వామి, ఆ నాదాన్నే రాముడుగా ఆరాధించాడు.

త్యాగరాజస్వామి సాహిత్యానికి ఉపనిషత్తులంత గొప్పస్థానాన్ని ఇచ్చారు పెద్దలు. త్యాగరాజకృతులలో రామకథ, రామవైభవం, రామతత్త్వం ప్రత్యక్షమౌతాయి. మరోవైపు అద్వైత వేదాంత పరీమళాలు గుబాళిస్తాయి. సంగీతరహస్యాలు సాక్షాత్కరిస్తాయి. రామభక్తిసామ్రాజ్యాన్ని కృతుల్లో ప్రతిష్ఠించిన త్యాగయ్య వాటి ద్వారా మరో రామాయణాన్నే అందించారు.

సంగీతపరమైన కీర్తనలు రచించి త్యాగరాజస్వామి వాటి ద్వారా ఎన్నో శాస్త్రమర్మాలను పలికించారు. 'ఎందరో మహానుభావులు', 'సమయానికి తగు మాటలాడెనే', 'సొగసుచూడ తరమా' 'తెరతీయగరాదా', 'ఎంతవారలైనా కాంతదాసులే' ఇలా లెక్కలేనన్నీ త్యాగరాజస్వామి పలుకులు తెలుగువారినోట నానుడులయ్యాయి. 'నగుమోము గనలేని నాజాలి తెలిపి, నన్ను బ్రోవ రాదా' వంటి కీర్తనలలో స్వచ్ఛమై భక్తిసుధ ప్రవహిస్తుంది. రాగ భావప్రపంచానికి రాజుగానే కాక నిరాడంబర సాత్త్విక యోగ జీవనానికి ఆదర్శంగా శోభిల్లిన అద్భుతవ్యక్తిత్వం త్యాగరాజ స్వామిది.

'నిధిచాలసుఖమా– రాముని సన్నిధి సుఖమా నిజముగ పలుకు మనసా...' అని వైరాగ్యభావనను ప్రతిష్ఠించి శ్రీరాముని సాక్షాత్కారం పొంది స్వామి ఆదేశంమేరకు సంన్యాసాన్ని స్వీకరించారు.

పుష్యబహుళపంచమి నాడు కైవల్యాన్ని పొందిన రోజునే ప్రతి సంవత్సరం 'ఆరాధన' పరంపరం. శాస్త్రసంప్రదాయం ప్రకారం ఆ పద్ధతిలోనే నేటికీ 'త్యాగరాజస్వామి ఆరాధన' పేరిట తిరువయ్యారులో అత్యద్భుతంగా జరుగుతోంది. సంగీత, సాహిత్యవేదాంతశాస్త్రాలసారం త్యాగరాజకృతివైభవం. తెలుగు భాషలోని మాధుర్యానికి ఆలవాలం త్యాగరాజకృతులు. ఆధ్యాత్మికసాధనకు కావాల్సిన మార్గాలను సూచించే వేదాంతవిషయాలెన్నో త్యాగరాజ కృతులలో పల్లవించాయి.

గ్రంథసమీక్ష


# ఆముష్మిక సోపానాలు

## (గ్రంథ సంకలనం)

**రచయిత**– కీ.శే. డా॥ వేమూరి సీతారామయ్య, **సైజు**– 1/8 డెమ్మీ, **పుటలు**– 576; **వెల**– రూ.500/–; **ప్రతులకు**– డా॥ వేమూరి రామమోహనరావు, సెల్ నెం.62815 08327.

కీ.శే.వేమూరిసీతారామయ్యగారు దాదాపు నాలుగు దశాబ్దాల తమ ఆధ్యాత్మికసాధనలో భాగంగానూ, తనను ఆశ్రయించిన సాధకుల ఉపయోగార్థం, నాలుగు వేదాంత గ్రంథకుసుమాలను 1968–1970 మధ్యకాలంలో ప్రచురించారు. అవి వరుసగా (1)అనుభవ వేదాంతసూక్తులు (2)పంచ తత్త్వవివేకము (3)వివేకచూడామణి తాత్పర్యబోధిని (4)శ్రీమద్భగవద్గీతా తాత్పర్యబోధిని అనేవి. వీటి సారాంశం– దృశ్యమానప్రపంచం మార్పులు కలిగింది, భ్రాంతితో కూడింది. జీవుడు లేక దేహధారి బ్రహ్మంకంటే వేరుకాదు. 'బ్రహ్మం' లేక 'ఆత్మ' అనేది అత్యున్నతమైన యధార్థ వస్తు స్థితి. అది అద్వితీయమైంది. అనగా అదితప్ప వేరొక వస్తువు లేదు. మహోన్నతమైన ఆధ్యాత్మికానుభవసిద్ధి ప్రాప్తించాలంటే సాధకుడు, సారూప్య, సామీప్య, సాలోక్య, సాయుజ్యాలను స్థితులను పొందుతూ కృతకృత్యుడవ్వాలి. గ్రామీణులు మరియు సంసారికులు అయినవారి శిష్యులను ఉద్దేశించి కూర్చినవే ఈ రచనలు. వారికోసం ఒక దీక్షాపత్రాన్ని కూడా రూపొందించారు. తర్కవేదాంతాలంకార, బ్రహ్మశ్రీ మందిగొండ పిచ్చయ్య శాస్త్రిగారు పైన పేర్కొన్న "వివేక చూడామణి తాత్పర్యబోధినీ", "శ్రీమద్భగవద్గీతా తాత్పర్యబోధినీ" గ్రంథాలకు చక్కని పీఠికలు రాశారు. శ్రీ గాయత్రీ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యాశంకర భారతీస్వామివారు "ప్రశంసాపూర్వక ఆశీస్సులు", అనుగ్రహించారు. ఆనాటి 'గీతావాణి' సంపాదకులు శ్రీరామకృష్ణానందస్వామి 'మాన్యప్రశంస' అందించారు.


ఈగ్రంథాలు లభ్యంకాకపోవటంతో వారి కుమారుడు డా॥ వేమూరి రామమోహనరావు ఈ నాలుగు గ్రంథాలను ఒక సంకలనంగా "ఆముష్మికసోపానాలు" అనే మకుటంతో ప్రచురించారు. దీనికి కుర్తాళం పీఠాధిపతులు శ్రీశ్రీ సిద్ధేశ్వరానందభారతీ స్వామి వారు "ఆశీర్వాద శ్రీముఖం" అనుగ్రహించారు. శంకరాద్వైతంలో ఆసక్తికల వారు తప్పక చదవాల్సిన గ్రంథం ఇది.




– శ్రీ భరద్వాజ రంగావఝుల,
*90528 64400*



విశ్వదాభిరామం వేమన పద్యసూక్తి



## కలిసిఉంటే కలదు సుఖం

**కనులు లేనివాడు, కాళ్లు పోయినవాడు,**
**ఉభయు లరయ కూడియుండునట్లు,**
**పేద పేద గూడి పెనగొనియుండును;**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

**అర్థాలు:** ఉభయులు= ఇరువురు; అరయ= రక్షించుకొనుటకు; పెనగొని= కలిసిపోయి.

**భావం:** కళ్లులేనివాడు కాళ్లు లేనివాడితోనూ, కాళ్లు లేనివాడు కళ్లు లేనివాడితో స్నేహం చేస్తారు. వారు ఒకరిని ఒకరు తమలోపాల నుండి కాపాడుకుంటారు. అలాగే పేదవాడు ఇంకొక పేదవానితో కలిసిఉంటాడు.

**వివరణ:** దివ్యాంగులు వారి వారి అవసరాలకు ఒకళ్లకొకళ్లు ఉపయోగపడతారు. ఈ అవసరాల కారణంగానే ఒకళ్లతో ఒకళ్లు కలవగలుగుతారు. అలాగే పేదవాడు పేదవాడితో మాత్రమే స్నేహం చేయగలడు. ఉన్నవాడు లేని వాడితో కలవడు. పేదవాళ్ల అవసరాలు కూడ పేదవాడికే తెలుస్తాయి. అందువల్ల పరస్పరం సహకరించుకుంటారు. అందుకే ఉన్నవాడు ఉన్నవాడితోనూ, లేనివాడు లేనివాడితోనూ కలుస్తారు. ఒకేరకం మనుషులు అదే రకం మనుషులతో బాగా కలగలసిపోతారు.

– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

భాస్కరశతకం

## స్థానబలం గొప్పది

**స్థానము తప్పివచ్చునెడఁ దానెటువంటి బలాఢ్యుఁడైన్ నిజ**
**స్థానికుఁడైన యల్పుని కతంబున నైనను మోసపోవుఁగా,**
**కానల లోపల న్వెడలి గంధగజం బొకనాడు నీటిలోఁ**
**గానక చొచ్చినన్ మొసలికాటుకు లోఁబడకున్నె భాస్కరా!**

**భావం:** భాస్కరా! ఎంతటి బలవంతుడైనా పరాయి చోటులో, అక్కడ నివాసం ఉండే బలహీనుని చేతిలో సైతం భంగపాటును పొందుతాడు కదా! అడవిలో నివసించే మదపుటేనుగు సైతం అనువు దప్పి నీటిలోనికి దిగినప్పుడు మొసలినోటబడి దీనావస్థకు గురైంది కదా!

**వివరణ:** 'ఒక ఊరికి రాజు మరొక ఊరికి వెట్టి' అన్న సామెత ప్రకారం స్థానచలం చాలా గొప్పది. స్వంత చోటులో బలహీనుడికి కూడా గొప్ప ధైర్యం కారణంగా బలం పెరుగుతుంది. బలవంతుడి బలం పరాయిచోట బెరకదనం వల్ల తగ్గుతుంది. ఇందుకు దృష్టాంతంగా శతక కవి శ్రీమద్భాగవతంలోని గజేంద్రమోక్షఘట్టాన్ని పేర్కొన్నాడు. పదివేల ఏనుగులకు ప్రభువైన మహాగజం దప్పికతో తిరుగుతూ తిరుగుతూ ఒకచోట కన్పించిన సరస్సులోకి ప్రవేశించింది. ఏనుగుల తొక్కిడితో సరస్సు అల్లకల్లోలమైంది. దాని అడుగున ఉన్న మొసలి కోపంతో ఏనుగు కాలు పట్టుకుంది. ఆ రెండిటికి చాలా కాలం పాటు యుద్ధం జరిగింది. సరస్సు తన స్వంతచోటు కావడంతో మొసలి రెట్టించిన ఉత్సాహంతో పోరాడింది. పరాయిచోటు అన్న బెరుకుదనంతో అంత బలమున్న ఏనుగూ క్రమక్రమంగా ఢీలాపడింది. చివరకు మొసలిది పైచేయి కావడంతో, ఏనుగుప్రాణాలు కోల్పోయే పరిస్థితి దాపురించింది. అప్పుడది "నీవే తప్ప నితఃపరం బెరుగ రావే ఈశ్వర! కావవే వరద! సంరక్షించు భద్రాత్మకా!" అని మొరపెట్టుకుంది. భక్తవత్సలుడైన శ్రీమన్నారాయణుడు మరుక్షణమే అక్కడకు వచ్చాడు. సుదర్శనచక్రాయుధంతో ఆ మొసలిబారి నుండి ఏనుగును కాపాడాడు.

– డా॥ వడ్డేపల్లి శ్రీనివాసరావు

**నవంబరునెల క్విజ్-4 సమాధానాలు**


01)వ్యూహలక్ష్మి 02)నరసింహపురాణం 03)ఎరుపురంగు 04)కపిలతీర్థముక్కోటి 05) శ్రీసుబ్రహ్మణ్యస్వామి 06)గరళకంఠుడు 07)పట్టువస్త్రాలు 08)జయవారం 09) ఐరావతం 10)అమృతకలశం 11)పరశురాముడు 12)పాంచరాత్రాగమం 13)మంగళకైశికిరాగం 14)విష్ణుశర్మ 15)నందకం 16)శ్రీనివాసుడు 17)వాహనసేవలు 18) చింతామణి 19) సముద్రం 20) ఐదురోజులు


క్విజ్-4కు సరియైన సమాధానాలు ఎవరూ రాసిపంపలేదు.

చిత్ర కథ

# అన్నప్రదాత

కథ- డా॥ కంపల్లె రవిచంద్రన్
చిత్రాలు- శ్రీ తుంబలి శివాజీ




ధర్మరాజు తమ పురోహితుడైన ధౌమ్యునితో...
గురుదేవా! ఏంటీ విధి వైపరీత్యం? మాపై అభిమానంతో ఎంత వారించినా వినకుండా మా వెంట వచ్చిన మహా జనాన్ని ఆదరించి పోషించే స్థితిలో లేకపోయానే?
ఈ మహారణ్యంలో ఇంతమందికి ఆహారం ఎలా సంపాదించడం? ఆకలిగొన్నవారికి అన్నం పెట్టలేని నా జన్మ వృథా కాదా?
విచారించకు ధర్మరాజా! సకల జీవరాశికి అన్న ప్రదాత ఆ సూర్యభగవానుడు. నీవు కూడా ఆ సూర్యుణ్ణి ఆరాధించి, అనుగ్రహం సంపాదించు. ఈ అశేష జనాన్ని పోషించగలుగుతావు.
అరుణాయ! శరణ్యాయ! కరుణారస సింధవే అసమాన బలాయ ఆర్తరక్షకాయ నమోనమః
వత్సా! ధర్మనందనా! ఇది అక్షయపాత్ర. దీనిని అర్చించి, అర్థిస్తే ఎంతమందికైనా కోరిన ఆహారాన్ని ప్రసాదిస్తుంది...
ధన్యోస్మి భగవాన్! ధన్యోస్మి!
శుభం
2




# రచన శాశ్వతం

– శ్రీ ఆర్.సి.కృష్ణ స్వామి రాజు, *93936 62821*

రఘునాథపురం నగరంలోని అందమైన ప్రాకారాలు, భవనాలు, దారులు, తోటలు శత్రురాజుల దండయాత్రల వల్ల పూర్తిగా ధ్వంసమయ్యాయి. అది చూసి బాధపడ్డ ఆ దేశ మహారాజు మళ్లీనగరానికి పునర్వైభవం తీసుకురావాలని ప్రయత్నాలు ప్రారంభించాడు. అందులో భాగంగా భవనాలు కట్టే తాపీదారులను, వాస్తుశిల్పులను, భవననిర్మాణవేత్తలను పిలిపించి, గతంలో ఉన్నట్లే ఏ మార్పూ లేకుండా నిర్మాణం జరగాలని, దానికి తగ్గట్టుగా నమూనాపటం తయారుచేయమన్నాడు. వారు రకరకాల నమూనాలు తయారు చేసి రాజుకు చూపారు. పాతనిర్మాణాలకు దగ్గరగా ఉన్నట్లు తోచినా, అవి రాజుగారికి పూర్తి సంతృప్తినివ్వలేదు. వాటన్నిటిలోనూ ఏదో వెలితి కనిపించింది.

రెండో ప్రయత్నంగా, యుద్ధానికి ముందు ఉన్న నిర్మాణాలు ఉన్నవి ఉన్నట్లుగా తెలియపరిచేవారికి బహుమతి ఇస్తామని రాజ్యమంతటా దండోరా వేయించాడు.

రెండురోజుల తర్వాత ఒక పిల్లవాడు రాజసభకు వచ్చాడు. పాతనిర్మాణాల గురించి తను పూర్తి సమాచారం ఇవ్వగలనని చెప్పాడు. 'నిపుణులే సమాచారం ఇవ్వలేనిది ఈ పిల్లవాడు ఏమి ఇవ్వగలడు?' అని అందరూ ఆశ్చర్యంగా అతడి వైపు చూశారు. వాడు తనతో పాటు తెచ్చిన పెద్ద సంచిలోని కొన్ని తాళపత్రగ్రంథాలను రాజు ముందు ఉంచాడు.

"రాజా, ఇవన్నీ మా తాత రాసిన గ్రంథాలు. మన నగర నిర్మాణాలు ఉన్నవి ఉన్నట్లుగా వీటిలో రాయబడి ఉంది" అని చెప్పాడు.

'నిజమా' అని సంభ్రమాశ్చర్యాలతో రాజు వాటిని తీసి చూశాడు. పిల్లవాడు చెప్పింది నిజమని తెలిపేలా వర్ణనలు ఉన్నాయి.


"మీ తాత ఈ గ్రంథాల్లో ఇవన్నీ రాసినట్లు నీకు ఎలా తెలుసు? " అని ప్రశ్నించాడు రాజు.

"మా తాత పుట్టుగుడ్డి మహారాజా. కానీ, ఆయన చాలా గొప్ప కవి. తను రాసే గ్రంథాల్లో మన నగరం గురించి, భవన నిర్మాణాల అందాలను గురించి రాయాలనిపించింది. అయితే అతడు వాటిని కళ్లారా చూడలేదు కాబట్టి నన్ను తీసుకెళ్లేవాడు.

అన్ని వీధులూ తిరిగి సూక్ష్మంగా పరిశీలించే వాడిని. వాటి అణువణువూ వర్ణిస్తూ మా తాతకు చెప్పేవాడిని. ఎంతో జాగ్రత్తగా విని ఆయన వాటిని గ్రంథస్తం చేయడం జరిగింది. అంతేకాదు, ఏ కారణాల చేతనైనా నగరం నాశనమైతే తన గ్రంథం చదివి పునర్నిర్మించవచ్చని ఆయన ఎప్పుడూ నాతో చెబుతూ ఉంటాడు" అని వివరించాడు.

ఎంతో సంతోషపడిన రాజు వెంటనే ఆ పిల్లవాడి తాతను పిలిపించి మర్యాదలు చేశాడు. తాతా మనవళ్ల నుంచి మరిన్ని వివరాలు సేకరించి చక్కటి నగర నిర్మాణం చేశాడు.

'కాలగర్భంలో రాజులు పోవచ్చును, రాజ్యాలు పోవచ్చును. కానీ... వాటి ఆనవాలు శాశ్వతంగా భద్రపరిచేది మాత్రం కవులే' అని రాజు తెలుసుకున్నాడు. అప్పటినుంచీ కవిపండితులకు పెద్దపీట వేయడం ప్రారంభించాడు.



# బాలవినోదం

పిల్లలూ... మీ మేధకు పదును పెట్టండి....

## కదంబం

### ద్వాదశ మాసాదిత్యులు

| | |
|---|---|
| 01) చైత్రమాసము - వేదాంగుడు | 07) ఆశ్వయుజము - సువర్ణరేతస్కుడు |
| 02) వైశాఖము - భానుడు | 08) కార్తీకము - దివాకరుడు |
| 03) జ్యేష్ఠ - ఇంద్రనామకుడు | 09) మార్గశిరము - మిత్రుడు |
| 04) ఆషాఢము - రవి | 10) పుష్యమాసము - విష్ణువు |
| 05) శ్రావణము - గభస్తి | 11) మాఘము - అరుణుడు |
| 06) భాద్రపదము - యముడు (భద్ర) | 12) ఫాల్గుణము - సూర్యుడు (అధికమాసములందు మాసాదిత్యుడు - పుషుడు) |

### కనిపెట్టండి చూద్దాం!

ఇక్కడున్న వాక్యాల్లో కొన్ని సంగీత వాయిద్యాల పేర్లు దాగున్నాయి. జాగ్రత్తగా పరిశీలించి, అవేంటో కనిపెట్టండి చూద్దాం.

1) తను నా స్నేహితురాలు ప్రవీణ కలిసి చదువుకుందామని నేనే రమ్మని చెప్పా.
2) మా చెల్లి నవీన, మీ అక్క సమత బలాబలాలేంటో రేపు పోటీలో తెలుస్తుందిలే!
3) గత నెలలో భీమడోలు నుండి తీసుకొన్న మిఠాయిలు భలే రుచిగా ఉన్నాయి.
4) ఇక్కడున్నంత వరకు కాస్త తగ్గించుకో నీ ఆవేశం ఖండాంతరాల ఖ్యాతిని చెడగొట్టుకోకు.

జవాబు: 1)వీణ 2)తబలా 3)డోలు 4)శంఖం

### దాగినమాట

ఈ అక్షరాలన్నింటిని కలిపితే ఒక సామెత వస్తుంది. అదేమిటో కనుక్కోండి. సామెతలోని 7వ అక్షరం మధ్య వృత్తంలో ఉంది. ప్రయత్నించండి.

| మధ్య వృత్తం | చుట్టూ ఉన్న అక్షరాలు |
|---|---|
| పో | డ, చె, అ, క్క, ర, లో, క, క, త్తె |

జవాబు: అడకత్తెరలో పోకచెక్క

### చెప్పుకోండి చూద్దాం!


#### పొడుపు కథలు

1) పొడవేమో జానెడు.. పొట్టనిండా ముత్యాలే. ఏంటది?
2) మూడుకాళ్లతో నడుస్తుంది. కానీ, ముందుకు తప్ప వెనక్కి మాత్రం వెళ్లలేదు. అదేంటో?
3) అందరికీ కొడుకూ, కూతురూ అవుతారు. ఎవరు వారు?

జవాబులు: 1)బెండకాయ 2)గడియారం 3)పెళ్లికొడుకు, పెళ్లికూతురు

### చిత్రలేఖనం

ఈ క్రింది బొమ్మకు రంగులు వేయండి!



ఈ పక్కన ఉన్న బొమ్మను క్రింది గడులలో గీయండి!!

# క్విజ్ 06

01) కర్మసాక్షి అని ఎవరిని అంటారు? జ)....................

02) ఆదిత్యోపాసన ఎవరిని ఉద్దేశించింది? జ)....................

03) మయూరుడు ఉపాసించినదెవరిని? జ)....................

04) నదులలోని నీరు ఎవరి వల్ల ఆవిరవుతుంది? జ)....................

05) భానుడనే మరొక పేరు ఎవరికుంది? జ)....................

06) కర్ణుడు ఎవరి వరప్రసాదంగా జన్మించాడు? జ)....................

07) విటమిన్-డి ఎవరి వల్ల వస్తుంది? జ)....................

08) మార్తాండసప్తమి రోజు ఎవరిని పూజిస్తారు? జ)....................

09) అనంతమైన ఆరోగ్యాన్ని ఇచ్చే శక్తి ఎవరికుంది? జ)....................

10) పసిబిడ్డల్ని ఉదయంపూట ఎవరి కెదురుగా ఉంచుతారు? జ)....................

11) ఎవరి కిరణాలు ఆరోగ్యానికి అవసరం? జ)....................

12) ఋతువులు ఎవరి గమనం వల్ల ఏర్పడుతాయి? జ)....................

13) జీవులలో చైతన్యం ఎవరి వల్ల కలుగుతుంది? జ)....................

14) కమలబాంధవుడని ఎవరినంటారు? జ)....................

15) మకరరాశిలో ఎవరి ప్రవేశాన్ని మకరసంక్రమణమంటారు? జ)....................

## నియమనిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.

02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.

03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సు ప్రతులు పంపేటట్లు అయితే, చందానమోదుసంఖ్య తప్పనిసరి.

04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.

05) జవాబులు చేరాల్సిన చివరితేది 25-01-2023.

06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.

07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.

08) క్విజ్‌కు సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వ బడదు.

09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా రాసి పంపాలి.

10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో రాయకూడదు.

11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. వెతికి రాయండి.

చందాసంఖ్య: .................... వయస్సు: ....................

పాఠశాల: .................... తరగతి: ....................

పేరు: ....................

చిరునామా: ....................

....................

....................

.................... పిన్‌కోడ్: ....................

ఫోను నెంబరు: ....................

**జవాబులు చేరాల్సిన చిరునామా**

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, తి.తి.దే.ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507. తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం–** సంతానం విషయంలో ఆనందం. భూగృహ స్థిరాస్తుల మార్పులు అనుకూలం. ఆస్తి తగాదాలకు పరిష్కారం. జన్మరాశిలో రాహువు దుష్ప్రభావాలను ఎదుర్కోవటానికి శ్రీవేంకటేశ్వర సుప్రభాతం, దుర్గాప్రార్థన చేయతగ్గవి.



**వృషభం–** సోదరుల సహాయసహకారాలు పరిపూర్ణంగా ఉంటాయి. చేసే ప్రయత్నాలన్నీ కృషితో సాధిస్తారు. ఆదాయం కూడా పెరుగుతుంది మంచి సామాజికఖ్యాతిని కూడా పొందే అవకాశం ఉంది.



**మిథునం–**ప్రతికూలధోరణులను తగ్గించుకోవడం మంచిది. ఆర్థికంగా ఉత్సాహంగా ఉంటారు. ఉద్యోగ వృత్తివ్యాపారాలకు కలిసివస్తుంది. సంతానం విషయంలో అప్రమత్తత అవసరం. శరీర రుగ్మతలు తొలగుతాయి. గృహంలో శుభకార్యప్రణాళిక చేస్తారు.



**కర్కాటకం–**ప్రయాణాలు మిశ్రమఫలితాన్నిస్తాయి. విద్యార్థులు విజయం సాధిస్తారు. ఆరోగ్య విషయాలలో ఉపశమనం పొందుతారు. సంతోషకరమైన జీవనం అనుభవిస్తారు. దైవబలాన్ని పెంచుకుంటారు. ఆర్థికపురోగతి వల్ల శుభకార్యనిర్వహణకు ఉపక్రమిస్తారు.



**సింహం–** వాదప్రతివాదాలకు దూరంగా ఉండటం మంచిది. విందువినోదాలలో ధనం వ్యయం. ఉద్యోగజీవితంలో సమస్యలను, మానసిక ఒత్తిడి అధిగమించుటకు హనుమాన్‌చాలీసా నిత్యం పఠించడం మంచిది. గుండె మరియు పొట్టకు సంబంధించిన ఆరోగ్యసమస్యలు పెరుగుతాయి.



**కన్య–** ప్రయాణాలలో జాగ్రత్త అవసరం. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. మానసికఒత్తిళ్లు ఉంటాయి. ఆస్తి విషయాలలో కూడా సమస్యలు తొలగి నెలాఖరుకు ప్రయోజనాలు పొందుతారు. విద్యార్థులు పురోగతిని పొందుతారు. ప్రయత్నాలకు అనుగుణంగా ఆదాయం కూడా ఉంటుంది. వృత్తి, వ్యాపారాలు అనుకూలం.



**తుల–** ధనవ్యయంపై నియంత్రణ లేక ఇబ్బందులు వస్తాయి. ధైర్యంతో, ప్రణాళికతో ముందంజ, చేతికి ధనం వస్తుంది. బంధుమిత్రులతో ఆనందంగా కాలక్షేపం చేస్తారు. సమాజంలో ఆదరణ పెరుగుతుంది.



**వృశ్చికం–**విందువినోదాలకు అధికధనవ్యయం చేస్తారు. బంధువులరాకపోకలు ఉంటాయి. శత్రుజయం కల్గుతుంది. ఆదాయమార్గాల కోసం అన్వేషిస్తారు. ఆరోగ్యవిషయాలలో చాలా జాగ్రత్త. వాటిని అధిగమించటానికి యోగాభ్యాసం మంచిది.



**ధనుస్సు–** సంపదవృద్ధి అవుతుంది. సానుకూల ప్రవర్తనవల్ల బంధుమిత్రులతో వచ్చే సమస్యల్ని అధిగమించవచ్చు. వ్యవహారాలను పరిష్కరించుకుని అనుకూలంగా మార్చుకోవచ్చు. తలనొప్పులు, నేత్రసమస్యలు, కొనసాగే అవకాశాలు ఉన్నందున ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి.



**మకరం–** భోగభాగ్యాలను అనుభవిస్తారు. శ్రమకు తగ్గ ఫలితం లభిస్తుంది. ధనవ్యయమైతే పెరుగుతుంది. ధైర్యంతో నూతనకార్యాలకు శ్రీకారం. వ్యవహారజయం కల్గుతుంది. సూర్యారాధన మంచిది.



**కుంభం–** సంతానం గురించి శుభవార్తలు వస్తాయి. విందువినోదాలకు డబ్బు ఖర్చు చేస్తారు. కుటుంబవాతావరణం, ఆరోగ్యం అనుకూలం. ఇతరదేశాలకు వెళ్లే ప్రయత్నాలు సానుకూలం. ఉద్యోగవిషయాల్లో ప్రమోషన్లు, పైవారి ప్రశంసలు కల్గుతాయి. వ్యాపారం లాభదాయకం. ఆర్థికంగా ముందంజవేస్తారు.



**మీనం–** ధైర్యసాహసాలు ప్రదర్శించి అత్యున్నత బహుమతులు గెలుచుకుంటారు. నూతన ఉద్యోగాలకు ఎంపిక అవుతారు. ధనప్రాప్తి కల్గుతుంది. స్థానచలనం సంభవిస్తుంది. జన్మరాశిలో గురు సంచారం వల్ల కొంత శారీరక రుగ్మతలను ఎదుర్కోవాల్సి వచ్చినా దైవబలంతో అధిగమిస్తారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :

(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పనిసరి)

సెల్ నెం.

**2.** కావలసినభాష :

తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐

హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3.** సంవత్సరచందా : ☐ రూ.240/-

జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4.** చందా పునరుద్ధరణ :

(అ) చందానెంబరు :

(ఆ) భాష :

**5.** చెల్లించిన మొత్తం :

డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :

తేది :

ప్రదేశం :

తేది :

చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా (12 సం॥రాలు) రూ.2400/-లు; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్‌లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి', తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.


2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, టి.టి.డి. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# వైకుంఠపాళి 84



**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

## అడ్డం

1)ఇతణ్ణి గోదాదేవి వివాహం చేసుకుంది(6); 4)సంక్రాంతి రోజున విద్యార్థులు ఈమెను పూజిస్తారు(2); 7)కార్చిచ్చు(4); 8)కవిత్వం చెప్పేవాడు(2); 10)ఇక్కడ పంటలు పండుతాయి(2); 11)సూర్యుడు ధనూరాశిలో ప్రవేశించగానే ప్రారంభమయ్యేవ్రతం(4) 12)దక్షుని కూతురు(2); 14)శ్రాద్ధకర్మలలో పెట్టేది(2); 16)శౌర్యము(3); 17)మయుని భార్య(2); 19)నది(3); 21)కర్దమప్రజాపతి కూతురు(2); 23)సంక్రాంతి పర్వదినాల్లో కన్నెపిల్లలు ఈ మొగ్గలేస్తాయి(3) 26)పెద్ద పండుగకు గుమ్మాలకు తోరణాలుగా కట్టే పువ్వులు(3) 27)వీటిని ముగ్గుల్లో పెట్టి పూజిస్తారు(4) 28)సంక్రాంతికి ప్రత్యేకమైన పిండివంట(3)

## నిలువు

1)శ్రీరంగనాథుని భార్య(5); 2)ఆకాశము(4); 3)నది(2); 4)గుజ్జుము(2); 5)సూర్యుడు మకరరాశిలో ప్రవేశించడాన్ని ఏమంటారు?(7); 6)సూర్యుడు(2); 8)దీనితో కాగితాలపై వ్రాస్తారు(2); 9)పశువులపండుగ(3); 13)ప్రజాపతి భార్య(2); 14)పెద్దపండుగకు ఇవి చేస్తారు(5); 15)మకరసంక్రమణం జరిగిన రోజు(3); 18)పెద్దపండుగనాడు ఇది వండి పొల్లాల్లో చల్లుతారు(3); 20)ధనుర్మాసంలో వాకిట్లో వేస్తారు(3); 22)ధనుర్మాసంలో పూచే పువ్వులు(4); 24)గోదారంగనాథుల పెళ్లి ఏ రోజున జరిగింది (2); 25)మాత(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు



Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.

భారతరాష్ట్రపతి, గౌ॥ శ్రీమతి ద్రౌపది ముర్ము తిరుమల శ్రీవారిని, తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారిని 05-12-2022న దర్శించుకున్నారు. వీరికి తి.తి.దే. అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్., గార్లు ఆలయమర్యాదలతో స్వాగతం పలికి, శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.













తి.తి.దే. పరిపాలనాభవనం (తిరుపతి)లో 18-11-2022న తి.తి.దే. నిర్వహించిన కార్తికదీపోత్సవం దృశ్యాలు.
ఈ కార్యక్రమంలో తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్., గారు, తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., శ్రీమతి సదాభార్గవి, ఐ.ఏ.ఎస్., ఇతర తి.తి.దే. ఉన్నతాధికారులు పాల్గొన్నారు.
ఈ ఉత్సవంలో పెద్దఎత్తున మహిళలు, దంపతులు పాల్గొని సామూహిక దీపారాధన చేశారు.

SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams printing on 25-12-2022 and posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd.No.TRP/155/2021-2023 "Licenced to post without prepayment No.PMGK/RNP/WPP-04(1)/2021-2023" posting on 5th of Every Month.

